CC-0. In Public Domain. Digitized by eGangotri

బొమ్మల
మహాభారతం

రెండవ భాగం



Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

బాలల మహాభారతం

రెండవ భాగము

ఆంగ్ల మూలం: శ్రీ రాఘవేశానంద స్వామి
తెలుగు సేత: శ్రీ జ్ఞానదానంద స్వామి
చిత్రములు: పద్మవాసన్



శ్రీ రామకృష్ణ మఠము
మైలాపూరు :: మద్రాసు 600 004

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri



Published by :
© The President,
Sri Ramakrishna Math,
Mylapore, Madras 600 004.

All Rights Reserved
Second Impression
II-5M 3C-7-94
ISBN 81-7120-408-2
ISBN 81-7120-318-3

Printed in India at
Sri Ramakrishna Math Printing Press,
Mylapore, Madras 600 004.

Sri Vidyabharathi Book Centre, Sringeri





విషయ సూచిక

CC-O. In Public Domain. Digitized by eGangotri పుట

సభాపర్వం

మయసభ ... 1

రాజసూయ యాగం జరిపించమని
నారదుడు, యుధిష్ఠిరునికి సలహా ఇవ్వడం ... 2

ధర్మజునికి శ్రీకృష్ణుడు సలహా ఇచ్చుట ... 3

జరాసంధుని పరిమార్చుటం ... 4

రాజసూయ యాగం ... 8

శ్రీకృష్ణుడు శిశుపాలుని వధించుట ... 9

దుర్యోధనుడి మాత్సర్యం ... 11

దూతగా విదురుడు వెళ్లటం ... 13

దుర్యోధనుడు తన గోతిని తానే త్రవ్వుకొనుట ... 14

శ్రీకృష్ణుని అహేతుక కృప ... 16

ధర్మజుడు మళ్లీ జూదమాడుట ... 18

అరణ్య పర్వం

అక్షయపాత్ర ... 19

విదురుడు పాండవులను చూడవచ్చుట ... 20

మైత్రేయుని శాపం ... 21

శ్రీకృష్ణుని వాగ్దానం ... 22

శివార్జునుల యుద్ధం ... 24

ఇంద్రుని నగరంలో అర్జునుడు ... 27

అర్జునుడు తమ మధ్య లేనందువల్ల
ధర్మజుడు దుఃఖించుట ... 28

గంధమాదన పర్వతాలకు పాండవుల రాక ... 30

భీముడు హనుమంతుని కలుసుకొనుట ... 31

భీముడు సౌగంధికా పుష్పాలను ద్రౌపది కిచ్చుట ... 34

అర్జునుడు తిరిగి వచ్చుట ... 37

భీముణ్ణి కొండచిలువ పట్టుకొనుట ... 39

శ్రీకృష్ణుని పునరాగమనం ... 40

దుర్యోధనుడి పన్నాగం ... 41

ధర్మజుడి సహృదయత ... 42

ఊరడిల్లని దుర్యోధనుడు ... 44

దుర్యోధనుడు యాగాన్ని నిర్వర్తించుట ... 45

కృష్ణుడు తన భక్తులను కాపాడుట ... 46

జయద్రథుడు శిక్షింపబడుట ... 48

కవచ కుండలాల కానుక ... 50

నకులుడు తదితరులు మరణించుట ... 52

యక్ష ప్రశ్నలు ... 53

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

ఉపోద్ఘాతం

బాలల మహాభారతం మొదటి సంపుటంలో దాయాదులైన కౌరవ పాండవుల మధ్య వైరం ప్రారంభ మైన కథనం చదివారు. రాజ్యంమీద విస్తృత విఘాతాలను తీసుకొచ్చిన కుటుంబ కలహం ఇది. నేటికీ ఎడతెగని పోట్లాటను కురుక్షేత్రయుద్ధంగా పరిగణిస్తారు. ఈ రెండవ సంపుటంలో యీ మహాయుద్ధానికి నాంది పలిగిన పూర్వాపరాలను తెలుసుకుంటాం. విధి ఎంత వైపరీత్య మైనదో కూడా చూస్తాం. ధర్మవర్తనులు పడరాని అగచాట్లు పడటం చూసి ధర్మం అనేది అసలు యీ ప్రపంచంలో వున్నదా అని మనం ఆశ్చర్యపోతాం. పాత్ర చిత్రణలో వ్యాసుడు అందెవేసిన చెయ్యి. పరిస్థితుల కనుగుణంగా వర్తించే వీరోచితమైన వైవిధ్యంగల అనేక పాత్రలను వ్యాసుడు ఇందులో ప్రవేశపెట్టాడు. ఈ మహాభారతం కేవలం ధర్మసూక్ష్మాన్ని తెలియచేసే స్మృతే కాదు - మానవ నైజ అగాధాలలోకి తీసుకువెళ్లి ఉత్కంఠతో సాగిన కథనం కూడా. కాబట్టి ముందుకు వెళ్లి చదవండి.

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

సభాపర్వం

మయసభ

ఖాండవ దహన ఉదంతానికి పిదప, ఒకనాడు శ్రీకృష్ణుడు, అర్జునుడు, మయుడు విశ్రాంతిగా కూర్చుని వున్నారు. అప్పుడు మయుడు చేతులు జోడించి వారితో ఇలా అన్నాడు: ''మీరు నా ప్రాణాలు కాపాడారు. అందుకు ప్రత్యుపకారంగా మీకు ఏదైనా చేసిపెట్టడం నా ధర్మం. వృత్తిరీత్యా నేను శిల్పిని. మీకు నచ్చింది ఏదైనా చెయ్యమని ఆదేశించండి.'' అర్జునుడు చిరునవ్వుతో ''ప్రత్యుపకారం ఆశించి నేను ఎవరికీ సహాయం అందించడం లేదు. అంతగా నీకు చెయ్యాలని వుంటే, శ్రీకృష్ణుడు కోరినదానిని చేసిపెట్టు; నేను సంప్రీతుడి నౌతాను'' అన్నాడు.

మయుడు శ్రీకృష్ణుని కేసి చూశాడు. శ్రీకృష్ణుడు క్షణకాల మాలోచించి ''ధర్మరాజు నా ప్రీతిపాత్రుడు. ఆతడికోసం నువ్వు ఒక సభామండపాన్ని నిర్మిస్తే, నేను సంతోషిస్తాను. నీ శిల్ప చాతుర్యమంతా చూపించి దానిని అతిలోక సుందరంగా రూపొందించు'' అన్నాడు. తన శిల్పచాతుర్యానికే పరీక్షపెట్టే ఆ కార్యాన్ని మయుడు ఆనందంగా స్వీకరించాడు. సభామంటప నిర్మాణ పథకం గురించి పాండవులతో చర్చించాడు. పాండవుల వద్ద సెలవుగైకొని, మయుడు కైలాసపర్వతంవైపు వెళ్లాడు. అక్కడి బిందుసరోవరంలో అంతకుముందు తాను భద్రపరచిన అమూల్య రత్నాలను సేకరించాడు. వాటితోపాటు తాను భద్రపరచిన ఒక గదను, దేవదత్తమనే శంఖాన్నీ కూడా తీసుకుని పాండవుల వద్దకు వచ్చాడు; గదను భీముడికి, శంఖాన్ని అర్జునుడికి బహూకరించాడు. తరువాత ఒక శుభముహూర్తంలో సభామంటప నిర్మాణాన్ని మొదలుపెట్టాడు. కుడ్యాలు, తిన్నెలు, ప్రాకారాలు అన్నీ మణులతోనే రూపొందించాడు.
అక్కడక్కడ ఇంద్రనీలమణులు తాపి, వాటి కాంతులతో యథార్థమైన నీటికోనేరులా కనిపింపచేశాడు. అందులో

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

కెంపులు పొదిగి ఎర్రతామర పువ్వులలా చేసిపెట్టాడు. వెండితో తెల్లతామరలూ, రాజహంసలూ తయారుచేశాడు. నిజానికి అది ఒట్టి గచ్చుమాత్రమే. అయినా చూపరులకు అది నిజమైన కోనేరన్న భ్రమ కలుగుతుంది. నిజమైన కోనేళ్లనూ ఆ సభామంటపంలో నిర్మించాడు. స్ఫటిక రాతి కుడ్యాలు ఆ కోనేళ్ళలో ప్రతిఫలించినట్లు చేసి అది మామూలు గచ్చు అనే భ్రమ కలిగేటట్లు చేశాడు. ఇలా తన శిల్ప చాతుర్యమంతా వినియోగించి ఆ సభామంటపాన్ని పదమూడు నెలల కాలంలో నిర్మించాడు. తరువాత పాండవులను ఆహ్వానించి ఆ అద్భుత సభామంటపాన్ని వారికి చూపించాడు. అనేక రకాల మణులతో గూడిన ఆ సభామంటపం రెండో సూర్యుడిలా వెలిగిపోతోంది. పాండవులు ఆ సభామంటపాన్ని గాంచి పరమానందభరితులయ్యారు. మయుడికి కృతజ్ఞతలు తెలిపి, అతడిని ఘనంగా సత్కరించారు. జ్యోతిష్కులు నిర్ణయించిన ఒక శుభముహూర్తంలో బ్రాహ్మణోత్తములు ఆశీర్వచనాలు, పుణ్యాహవచనాలు పలుకుతూవుంటే తన తమ్ములతో ధర్మరాజు సభామంటప ప్రవేశం చేశాడు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ధర్మరాజు అనేక వేలమంది బీదవారికి మృష్టాన్న భోజనం పెట్టాడు. విలువైన దానాలు చేశాడు. అనేక దేశాల రాజులూ, ఋషిపుంగవులూ ఆ వేడుకలో పాల్గొని, ఆ ఉత్సవానికి మరింత వన్నె తీసుకు వచ్చారు.

రాజసూయ యాగం జరిపించమని నారదుడు, యుధిష్ఠిరునికి సలహా ఇవ్వడం

ఇలా వేంచేసిన అతిథులలో దేవర్షి, భక్తశిరోమణి యైన నారదుడు కూడా వున్నాడు. ధర్మరాజు దేవర్షిని అర్ఘ్యపాద్యాదులతో పూజించి, ఆహ్వానించాడు. అప్పుడు నారదుడు 'ధర్మజా! నేను అనేక సభామంటపాలను దేవలోకాలలో గాంచాను. వైభవంలోగాని, సౌందర్యంలోగాని అవేవీ దీనికి దీటురావు'' అన్నాడు ప్రశంసాపూర్వకంగా. తరువాత నారదుడు ధర్మజుని ప్రజల యోగక్షేమాలను విచారించాడు. అప్పుడు ధర్మజుడు విన

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

యంతో ''దేవర్షీ! వేదాధ్యయనమూ, సంపద, భార్య, ధీవికాసం - ఇవన్నీ ఎప్పుడు ఫలవంతము లవుతాయి'' అని అడిగాడు. అందుకు నారదుడు ''వేదాధ్యయనం చేసినవాడు అగ్నిహోత్రాది యజ్ఞాలు నిర్వర్తించినప్పుడు, ధనవంతుడు తన సంపదను ఇతరులకు పంచిపెట్టినప్పుడు, భార్య మాతృస్థానాన్ని వహించినప్పుడు, శాస్త్రజ్ఞానం వినయము మొదలైన సద్గుణాలను పెంపొందించినప్పుడు ఫలవంతా లవుతాయి'' అన్నాడు.

పరలోకపాలకుల సభామంటపాలు ఎలా వుంటాయో తెలుసుకోవాలని ధర్మరాజు కుతూహలపడ్డాడు. ఇంద్రసభ, వరుణసభ, యమసభ, కుబేరునిసభ మొదలైన సభామంటపాలు ఎలా వుంటాయో నారదుడు సవివరంగా చెప్పాడు. మొదట ఇంద్రసభను వర్ణిస్తూ సూర్యవంశానికి చెందిన హరిశ్చంద్రమహారాజు ఇంద్రుని సింహాసనంలో తానుకూడా భాగం పంచుకున్నాడని నారదుడు అన్నాడు. శంతనుడు, పాండురాజు మొదలైన మహారాజు లెందరో స్వర్గంలో వున్నట్టుకూడా ఆయన చెప్పాడు. అప్పుడు ధర్మజుడు, ''నారదమునీంద్రా! మా పెద్ద లందరూ స్వర్గంలో వున్నారని చెబుతూ, హరిశ్చంద్ర మహారాజు మాత్రం ఇంద్రుడితోపాటు స్వర్గసింహాసనాన్ని అధిష్ఠించి వున్నట్లు చెప్పారు కదా! మిగిలిన వారంతా చెయ్యని సత్కార్యాలేవైనా ఆయన ఒనరించాడా?'' అని అడిగాడు. దానికి నారదుడు ఇలా అన్నాడు: ''హరిశ్చంద్ర మహారాజు రాజసూయయాగం చేసినందువల్ల, ఆ స్థానాన్ని పొందగలిగాడు. ధర్మజా! నువ్వు యీ భూమినంతా జయించగల శక్తివంతుడవు; నీ తమ్ములు అసహాయశూరులు. మీ తండ్రి నాతో వెలిబుచ్చిన ఆశయాన్ని నువ్వు నిర్వర్తించాలి. నేను ఆ విషయం చెప్పడానికే వచ్చాను.'' ''సెలవియ్యండి! మా తండ్రి ఆశయం తప్పకుండా నెరవేరుస్తాను'' అన్నాడు ధర్మరాజు.

''అందరు రాజులకంటె మేటివని నిరూపించడానికి నువ్వు రాజసూయయాగం తప్పకుండా చెయ్యాలి'' అన్నాడు నారదుడు. తాను రాజసూయయాగం నిర్వర్తిస్తే తన తండ్రి ఆశయం నెరవేరడం మాత్రమే గాకుండా, అందరి రాజుల ముందు తన సార్వభౌమత్వ నిరూపణకూడా వెల్లడవుతుందని తలపోశాడు ధర్మరాజు. తన తమ్ములతోనూ, ఇతర పెద్దలతోనూ యీ విషయం గురించి సంప్రతించాడు. ఈ విషయంలో అందరూ ధర్మజుడి అభిప్రాయంతో ఏకీభవించారు. తమ మార్గదర్శి, హితుడు అయిన శ్రీకృష్ణునికి యీ విషయం తెలియచెయ్యాలి. తుది నిర్ణయానికి రావడానికి ముందు శ్రీకృష్ణునితో సంప్రదించాలని ఆయనకు కబురుచేశారు.

ధర్మజునికి శ్రీకృష్ణుడు సలహా ఇచ్చుట

ధర్మరాజు కబురు అందగానే శ్రీకృష్ణుడు ఇంద్రప్రస్థానికి వచ్చాడు. శ్రీకృష్ణుని ఆప్యాయంగా ఆహ్వానించి, సముచితంగా ఆయనను సత్కరించారు పాండవులు. శ్రీకృష్ణుని సాన్నిధ్యము పాండవులకు ఎంతో ఆనందాన్ని కలిగించింది. యోగక్షేమాలన్నీ



Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri



విచారించిన పిదప ధర్మజుడు, ''కృష్ణా! నువ్వు మహాపురుషుడివి. నీకు తెలియని విషయమంటూ ఏదీ వుండదు. కాని చెబుతున్నాను. నారదమహర్షి నన్ను రాజసూయయాగం జరిపించమనీ, మా తండ్రి మాటగా చెప్పాడు. వీరందరూ దానికి సమ్మతించారు కూడా. ఈ విషయంలో నీ సలహా కోరే నీకు కబురు చేశాను'' అన్నాడు.

శ్రీకృష్ణుడు క్షణకాలం ఆలోచించి ''రాజసూయయాగం నిర్వర్తించడానికి అన్ని విధాల .నీకు సమర్థతవున్నది. కానీ ఇందులో నీకు అడ్డుపడేది మగధరాజైన జరాసంధు డొకడే. ఆతడు ఎంతోమంది రాజులను నిర్జించి, వారిని చెరసాలపాలు చేశాడు. క్షత్రియ పాలకు లందరూ ఆతడికి భయపడుతున్నారు. ఆతడి బారినుండి తప్పించుకోవడానికి మేముకూడా మధురానగరాన్ని వదిలేసి ద్వారకకు తరలిపోవాల్సి వచ్చింది కదా'' అన్నాడు.

''నిజమే'' అన్నాడు ధర్మజుడు. ''ఈ జరాసంధుడు నీ వల్లగాని, భీమార్జునుల వలనగానీ హతమవుతాడా? చూడబోతే నేను రాజసూయయాగం తలపెట్టకుండా వుండటం మంచిదేమో!''

''కృష్ణుని దయవుంటే మనకు సాధ్యంకానిదంటూ ఏదీ వుండదు'' అంటూ భీముడు అందుకున్నాడు. ''గెలిచినా -ఓడినా పోరాడవలసివస్తే గొప్పవాడితోనే పోరాడాలి. అప్పుడే మగసిరి తెలిసివస్తుంది. కృష్ణుని వివేకం, అర్జునుని విలువిద్యానైపుణ్యం, నా కండబలం ఏకమైతే సాధించలేనిదంటూ ఏదీ లేదు.''

అప్పుడు కృష్ణుడు కూడా ''జరాసంధుడు రాజులందరికీ సింహస్వప్నం అయి కూర్చున్నాడు. ఇప్పటికే ఎనభై ఆరు మంది రాజులను చెరబెట్టాడు. వందమందిని చెరబెట్టిన తరువాత భైరవపూజ ప్రారంభించి వారి నందరినీ నిర్దాక్షిణ్యంగా బలియిస్తాడు. ఇంతమంది రాజులను కాపాడగలిగినవాడు ముల్లోకాలలోను కీర్తిమంతుడవుతాడు'' అన్నాడు.

కాని ధర్మరాజు ''ఈ సాహసానికి నేను ఒప్పుకోను. భీమార్జునులు నా రెండు కళ్లు, నువ్వు ఆత్మవి. మీ కేమైనా జరిగితే నేను బ్రతకగలనా?'' అన్నాడు.

అందుకు కృష్ణుడు ''మరణం ఎప్పుడొస్తుందో ఎవరి కెరుక? రణరంగంలో మరణించడం క్షత్రియుడికి ఎంతో గర్వకారణం కదా! మన మందరం ఏకమై అతడినెందుకు ఎదుర్కోకూడదు?'' అని అడిగాడు.

జరాసంధుని పరిమార్చటం

జరాసంధుని పుట్టుపూర్వోత్తరాలు తెలుసుకోవాలని కోరాడు ధర్మరాజు. కృష్ణుడు ఆతడి వృత్తాంతాన్ని వివరించసాగాడు: ''బృహద్రథుడు మగధ దేశాధిపతి. కాశీరాజు కవల కూతుళ్లను అతడు వివాహం చేసుకొన్నాడు. ఇద్దరూ సౌందర్యవతులే కావడంతో ఇద్దరి పట్లా సమానమైన ప్రేమతో వుండేవాడు

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

కాని బృహద్రథుడికి ఎంతకాలానికీ సంతానం కలుగలేదు. ఎన్నో వ్రతాలూ, నోములూ చేశాడు. అయినా ఫలితం లేకపోయింది. ఇలావుండగా ఒకరోజు తన నగరానికి వచ్చిన చండకౌశికుడనే మునిశ్రేష్ఠుని తన భార్యలతో వెళ్లి బృహద్రథుడు దర్శించుకున్నాడు. భక్తితో మునికి సపర్యలు ఒనరించాడు. ఆతడి సేవలకు సంతోషించిన కౌశికుడు బృహద్రథుణ్ణి ఏదైనా వరం కోరుకోమన్నాడు. ''పుత్ర భాగ్యం ప్రసాదించండి'' అంటూ అర్థించాడు బృహద్రథుడు. ఆ ముని మంత్రించిన ఒక మామిడి పండును రాజుకు ఇచ్చాడు. బ్రహ్మానందంతో బృహద్రథుడు ఆ పండును స్వీకరించి, ఇద్దరు భార్యలకూ ఇచ్చాడు. రాణులు దానిని సమంగా కోసి, తిన్నారు. క్రమంగా ఇద్దరూ గర్భవతులయ్యారు. కాని చిత్రంగా వారు సగం శరీరభాగం గల పిల్లవాడిని కన్నారు. ప్రతి శరీరభాగం ఒక కన్ను, ఒక భుజం, ఒక కాలు, సగం కడుపు, సగం ముఖం - ఇలా కలిసివున్నాయి.

రాణు లిద్దరూ యీ వైచిత్ర్యానికి భయపడ్డారు. దాదుల్ని పిలిచి ''ఎవరికీ తెలియకుండా యీ శరీరభాగాలను కోటబైట పారవేసిరండి'' అన్నారు. అలా ఆ శరీరభాగాలు కోట బైటకు విసిరివేయబడ్డాయి.

ఆ రాత్రి అటువైపు వెళుతున్న 'జర' అనే రాక్షసి ఆ రెండు శరీరభాగాలు దారిలో పడివుండటం చూసి, మాంసం ముక్కలనుకుని సంతోషంగా వాటిని చేతుల్లోకి తీసుకొన్నది. తీరా చూస్తే ఆ రెండు శరీరభాగాలూ మెల్లగా కదులుతున్నాయి. కుతూహలం కొద్దీ ఆ రాక్షసి రెండు శరీర భాగాలను సంధించినది. ఆశ్చర్యం! ఆ శరీరభాగాలు అతుక్కున్నాయి.



Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

జర చేతిలో చిన్నారి బాలుడు రూపొందాడు. ఆ బాలుడిది వజ్రకాయంగా గుర్తించినది ఆ రాక్షసి. అతడి శరీరం బరువెక్కి, ఆమె చేతులలో ఇమడలేకపోతున్నాడు. పిల్లవాడు ఏడవడం ప్రారంభించాడు. పిల్లవాడి ఏడుపు విని దాదులు పరిగెత్తు కుంటూ వచ్చారు. ఆ పసిబాలుణ్ణి చూసి ఆశ్చర్యపోయి, అతడిని రాజువద్దకు ఎత్తుకెళ్లారు. రాజు పరమానందభరితుడ య్యాడు. జర కారణంగా ఆ పిల్లవాడికి ప్రాణం వచ్చింది కాబట్టి అతడికి జరాసంధు డని నామకరణం చేశారు.

తల్లిదండ్రులకు సంతోషాన్ని చేకూర్చుతూ జరాసంధుడు సాటిలేని వీరునిగా ఎదిగాడు. కాలక్రమంలో జరాసంధుడికి రాజ్యభారం నొప్పగించి, భార్యలతో సహా బృహద్రథుడు తపోవనానికి వెళ్లిపోయాడు. రాజయ్యాక కన్నుమిన్నూ కాన

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

పిట్టలమీదికి డేగలా అనేకమంది రాజుల మీద దండయాత్ర జరిపాడు జరాసంధుడు. వారిని నానాహింసలూ పెట్టాడు. జరాసంధుడి అల్లుడైన కంసుణ్ణి నేను సంహరించినందువల్ల యాదవవంశాన్నే నిర్మూలిస్తానని జరాసంధుడు ప్రతిజ్ఞచేశాడు. పదిహేను పర్యాయాలు మధురానగరంపై దాడిచేశాడు. చివరికి నేను మధురను విడిచి సముద్రమధ్యంలో ద్వారకానగరాన్ని నిర్మించి అక్కడికి మేమంతా తరలిపోయాము.''

జరాసంధుని శక్తిసామర్థ్యాల గురించి తెలుసుకున్న తరువాత ధర్మజుడు అతడితో పోరు సలపడానికి వెనుకంజవేశాడు. కానీ భీమార్జునులు పోరాడడానికి స్థిరనిశ్చయులై వున్నారు. అప్పుడు కృష్ణుడు ''అతణ్ణి అతడి సేనతోపాటు గెలవటం అసంభవం. కాని ద్వంద్వ యుద్ధంలో భీముడుగాని అర్జునుడు గాని అతడిని మట్టుపెట్టగలరు'' అన్నాడు. ధర్మరాజు ఇష్టంలేక పోయినా, సమ్మతించాడు.



భీమార్జునులూ, కృష్ణుడూ స్నాతకవ్రతులైన బ్రాహ్మణ వేషాలు ధరించి మగధకు బయలుదేరారు. అప్పుడే గురుకులంలో విద్యాభ్యాసం ముగించి వస్తున్న వారిని స్నాతకవ్రతులంటారు. వీరిని గౌరవనీయులుగా పరిగణిస్తారు. మగధ రాజధాని వద్దకు రాగానే జరాసంధుడు, అతడి ప్రజలు అర్చించే చైత్యక గిరిని భేదించారు. అన్యులు నగరంలో ప్రవేశిస్తే తమంత తామే మ్రోగే మూడు పెద్ద భేరీలను పగలగొట్టారు. రాచవీథిలో నడుస్తూ దారిలో కనిపిస్తున్న నానా విధ పుష్పగంధపరిమళాలతో గుబాళించిపోతున్న అంగళ్లను, సకల విధాలైన రమ్య వస్తువులతో శోభిల్లుతున్న ఆ నగర ఐశ్వర్యాన్ని చూసి వారు ఆశ్చర్యపోయారు. వారికి కావలసిన గంధాలు, పూలమాలలూ బలాత్కారంగా పుచ్చుకున్నారు. ముగ్గురూ అగరూ, చందనం, పుష్పాళ్లూ అందుకొన్నారు. పూలమాలలు ధరించి ఠీవిగా రాచవీథిలో వెళుతూవుంటే పౌరు లందరూ వారిని చిత్రంగా చూడసాగారు.

కృష్ణుడు, భీమార్జునులతోసహా జరాసంధుని మందిరంలో ప్రవేశించాడు. స్నాతకబ్రాహ్మణులుగా ఎంచి జరాసంధుడు వారిని సాదరంగా ఆహ్వానించాడు. భీమార్జునులు మౌనం పాటించే సరికి, కృష్ణుడు ''నా స్నేహితులు యీ రోజు పూర్తిగా మౌనవ్రతం పూని వున్నారు. అర్ధరాత్రి దాటిన తరువాతనే మాట్లాడతారు'' అన్నాడు.

''మంచిది! అంతవరకు మీరు విశ్రమించండి. అర్ధరాత్రి దాటాక మిమ్మల్ని నేను కలుసుకుంటాను'' అంటూ వెళ్లిపోయాడు జరాసంధుడు.

చెప్పినట్లుగానే అర్ధరాత్రి దాటాక స్నాతక బ్రాహ్మణులను కలుసుకోవడానికి వచ్చాడు జరాసంధుడు. వారి ధోరణి, ప్రవర్తన చూసి జరాసంధుడిలో సందేహం కలిగింది. [illegible] వేషధారుల్లా వున్నారు. మీ వేషాలు బ్రాహ్మణులలా వున్నప్పటికీ, మీ చేతులమీది వింటినారి గుర్తులు, తక్కిన అంశాలు మీరు క్షత్రియులని కొట్టవచ్చినట్లు తెలుపుతున్నాయి. ఏమిటి సంగతి?'' అని అడిగాడు. అప్పుడు కృష్ణుడు, తామెవరైనది తెలుపుతూ, క్రోధతామ్రాక్షుడైన జరాసంధుని ఉసిగొల్పుతూ ''మా ముగ్గురిలో ఎవరినైనా మల్లయుద్ధానికి నువ్వు ఎన్నుకోవచ్చును'' అన్నాడు. అందుకు జరాసంధుడు ''కృష్ణా! నువ్వు గోపాలుడివి, అర్జునుడు యింకా చిన్నవాడు. నాతో సమఉజ్జీయా భీముడే. ఇతణ్ణే మల్లయుద్ధానికి ఎన్నుకొంటున్నాను'' అన్నాడు.

వారి మధ్య మల్లయుద్ధం ప్రారంభమయింది. బలంలో ఇద్దరూ సమానులు. ఇద్దరూ భీకరంగా కలయబడుతూవుంటే కాలయముడు విజృంభించి యీ సంక్షోభాన్ని కలిగిస్తున్నాడా అని ప్రజలు భయపడ్డారు. ఇలా నిర్విరామంగా వారిద్దరూ పదమూడు రోజులు పోరాడారు. పదునాలుగవ రోజు జరాసంధుడు అలిసిపోయినట్లు కనబడ్డాడు. వెంటనే జరాసంధుణ్ణి చంపమని కృష్ణుడు, భీముణ్ణి ఉత్సాహపరిచాడు. తక్షణం భీముడు తన బలాన్నంతా కూడదీసుకొని జరాసంధుణ్ణి పైకెత్తి గిరిగిర నూరుమార్లు త్రిప్పి క్రిందపడేసి, ఆతడి శరీరాన్ని రెండు ముక్కలుగా నిలువునా చీల్చిపారేశాడు. కాని విచిత్రంగా ఆ రెండు శరీర భాగాలు ఒకటై అతుక్కొని, జరాసంధుడు ప్రాణా[illegible] భీముడు ఆశ్చర్యపోతూ కృష్ణుని వైపు చూశాడు.

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

కృష్ణుడు ఒక గడ్డిపరకను తీసుకొని దానిని రెండుగా చీల్చి, ఆ ముక్కలను వ్యతిరేక దిశలలో పారేశాడు. ఆ సూచనను గ్రహించిన భీముడు, మళ్ళీ విజృంభించి జరాసంధుని నేలగూల్చి అతడి శరీరాన్ని నిలువుగా చీల్చి, ఆ రెండు ముక్కలు తిరిగి కలుసుకోకుండా వాటిని వ్యతిరేక దిశలలో పారేశాడు. అలా జరాసంధుడు భీముడిచేతిలో వధించబడ్డాడు. జరాసంధుడి మృతకళేబరాన్ని కోటముఖద్వారం ముందు పడేశారు. చెరలో మగ్గుతున్న రాజు లందరినీ విడిపించారు. బంధవిముక్తులైన రాజులు సంతోషిస్తూ, వారికి కృతజ్ఞతలు తెలుపుతూ, ధర్మజుడు నిర్వర్తించబోయే రాజసూయ యాగానికి యథోచితంగ సహాయపడతామని వాగ్దానం చేశారు.

రాజసూయ యాగం

జయప్రదంగా వారు తిరిగిరాగానే, యుధిష్ఠిరుడు శ్రీకృష్ణుని గౌరవపురస్సరంగా ఆహ్వానించి, భీమార్జునులను అనురాగంతో కౌగిలించుకున్నాడు. కృష్ణుడు పాండవుల వద్ద సెలవు తీసుకొని ద్వారకకు వెళ్ళిపోయాడు. జైత్రయాత్రకు బైలుదేరాలన్న సంకల్పంతో అర్జునుడు ''అగ్రజా! నావద్ద ఎన్నో దివ్యాస్త్రాలున్నాయి. రాజసూయయాగానికి వ్యయమయ్యే ధనాన్ని వీటితో సంపాదిస్తాను. నన్ను ఆశీర్వదించి పంపు'' అన్నాడు. ధర్మజుడు, అర్జునుణ్ణి దీవించి పంపాడు. చతురంగబలాలతో అర్జునుడు ఉత్తరదిశగా బయలుదేరాడు. అలాగే భీముడు, నకులుడు, సహదేవుడు కూడా మిగిలిన వైపులకు బయలుదేరారు. భీముడు తూర్పువైపున జయించాడు, సహదేవుడు దక్షిణం, నకులుడు పశ్చిమదిశను, అర్జునుడు ఉత్తరదిశను జయించారు.

ఇలా నలుగురు సోదరులు తమ జైత్రయాత్రల ద్వారా సంపాదించిన ధనరాశులతో యుధిష్ఠిరుని ఖజానాలు పొంగిపొరలాయి. ధర్మజుడు రాజసూయ యాగానికి సన్నాహాలు చేయసాగాడు. శ్రీకృష్ణుడు కూడా తన పరిజనులతో, విలువైన కానుకలతో వచ్చాడు. కృష్ణునిచూసిన పాండవుల ఆనందానికి మేరలేకపోయింది. కృష్ణుడు, వ్యాసుడు యాగానికి కావలసిన ఏర్పాట్లు చేయసాగారు. దేశంలోని రాజు లందరినీ ఆహ్వానించడానికి దూతలు అన్ని దిక్కులకు పంపబడ్డారు. అతిథులు ఒక్కొక్కరుగా రాసాగారు. రాబోయే అతిథులకోసం ఇంద్రప్రస్థంలో రమ్యమైన విడిదిగృహాలు నిర్మించబడ్డాయి. నగరమంతా భూతలస్వర్గంలా రూపొందినది. ధర్మజుడి ఖజానాలోని ధనం ప్రవహిస్తూంది. ఈ ఖజానాను చూసుకోవలసిన బాధ్యతను శ్రీకృష్ణుడు, దుర్యోధనుడికి అప్పగించాడు. ధర్మజుడికి లభిస్తున్న అఖండగౌరవానికి ఈర్ష్యతో దుర్యోధనుడు లోలోన కుమిలిపోసాగాడు. కాని తన మనోభావాలను బైటపడ నీయలేదు. వ్యాస ధౌమ్యులు యాగానికి ఋత్విక్కులయ్యారు. ధర్మజుడు యాగానికి యజమానిగా విభూషితుడయ్యాడు. రాజసూయయాగం అట్టహాసంగా ప్రారంభమైనది. ఆరు అగ్నులతో శాస్త్రయుక్తంగా, ఎక్కడా ఏ లోపం రాకుండా నిర్విఘ్నంగా యాగం జరిగింది. ఇక చాలు అన్నంతవరకు దక్షిణలు ఒసంగబడ్డాయి. తాహతుకి లోపం లేకుండా రాజు లందరూ గౌరవసత్కారాలతో సంతృప్తులయ్యారు. అగ్నిముఖంగా మంత్రాహుతులతో దేవతలూ తృప్తిపడ్డారు. యావన్మందీ యుధిష్ఠిరుని, ఆతడి సోదరులను ఎంతగానో ప్రశంసించారు.

యాగం చివరి రోజు ధర్మజునికి అవభృథస్నానం జరిపించారు. అందరూ సమావేశమైన ఆ తరుణంలో భీష్ముడు తన ఆసనం నుండి లేచి ధర్మజునితో ''నాయనా! రాజూ, ఋషీ ఋత్విజుడూ, స్నాతకుడూ, గురువూ, ఇష్టుడూ - వీరందరూ పూజనీయులు. యాగం దివ్యంగా జరిగింది. ఈ సమయంలో ఇక్కడ సమావేశమైన వీళ్లలో గొప్పవాడైన ఒక మహాత్ముని నువ్వు పూజించటం సబబుగా వుంటుందని నా అభిప్రాయం'' అన్నాడు.

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

శ్రీకృష్ణుడు శిశుపాలుని వధించుట

''తప్పకుండా'' అంటూ అందుకున్నాడు ధర్మజుడు. ''అయితే అలాంటి ఉత్తముడైన మహాత్ము డెవరో మీరే చెప్పి అనుగ్రహించండి'' అన్నాడు. ''చెప్పడాని కేముంది? ఇదిగో యజ్ఞపురుషుడు, సర్వలోకపూజ్యుడూ అయిన శ్రీకృష్ణుడే అందుకు అర్హుడు. ఆయన్నే పూజించు'' అన్నాడు భీష్ముడు. భీష్ముని ఆనతిపై సహదేవునిచేత అర్ఘ్యం తెప్పించాడు ధర్మజుడు. శాస్త్రరీత్యా ఆ మహాసభలో శ్రీకృష్ణునికి అర్ఘ్యమిచ్చి పూజించాడు. ఇది చూసి శిశుపాలుడు ''ధర్మజా! ఇంతమంది మహారాజులూ, ఋషులూ, పండితోత్తములూ వుంటే యీ చరిత్రహీనుని పూజించడమా? ధర్మసూక్ష్మం తెలియని పసివాడిలా ప్రవర్తించావు! అందరికంటే వయస్సులో పెద్దవాడని పూజించావా? వసుదేవు డున్నాడుగా? ఋత్విజుడనుకొన్నావా? వ్యాసు డేమయ్యాడు? ఆచార్యు డంటావా? కృపాచార్య ద్రోణాచార్యు లున్నారుగా? వీరిలో ఎవరితో సమానుడని యీ గొల్లవాడిని పూజించావు? అగ్రపూజ కృష్ణుడికే చేయాల



CC-O. In Public Domain. Digitized by eGangotri

న్నది నీ నిర్ణయమైనప్పుడు ఇంతమంది రాజులను ఆహ్వానించింది వారిని అవమానించడానికే కదా!'' అంటూ అవాకులుచవాకులు పేలసాగాడు.

తరువాత శిశుపాలుడు కృష్ణుడి వైపు తిరిగి ''ఓరీ గొల్లా! ఈ పూజకు అర్హుడవుకాని నువ్వు కొంచమైనా సిగ్గులేకుండా ఎలా పూజను స్వీకరించావు?'' అంటూ నిందించాడు.

ఇలా ఎడాపెడా నోటికి వచ్చినట్లు కృష్ణుని నిందించి, శిశుపాలుడు సభనుండి వెళ్లిపోయాడు. ధర్మజుడు అతణ్ణి వెంబడించివెళ్లి, అతడిని అనునయించి మళ్లీ సభలోకి తీసుకువచ్చాడు. శిశుపాలుడితో, ధర్మజుడు, ''నువ్వు శ్రీకృష్ణుని అనరానిమాట లెన్నో అన్నావు. చివరికి భీష్మణ్ణికూడా నిందించావు. సభలోని పెద్దలందరూ శ్రీకృష్ణుని పూజించడమే సబబని ఏకకంఠంతో పలికారు,'' అన్నాడు. అప్పుడు భీష్ముడు కలుగచేసుకొంటూ ''శ్రీకృష్ణుని మహిమ తెలుసుకోలేని యీ మూర్ఖుడితో మాట్లాడుతూ సమయం వృధా చెయ్యవద్దు. శ్రీకృష్ణుడు కేవలం మనకు మాత్రమేకాదు, యీ ముల్లోకాలకూ పూజనీయుడు. మంత్రాలలో గాయత్రీమంత్రంలాంటివాడు. ఈ శిశుపాలుని వాచాలత్వాన్ని పట్టించుకోకు'' అన్నాడు ధర్మజుడితో

తరువాత సహదేవుడు లేచి ''నేను చేసింది ముమ్మాటికీ సబబే! మాకు శ్రీకృష్ణుడే సర్వస్వం. శ్రీకృష్ణుని అగ్రపూజను వ్యతిరేకించే నీతో యుద్ధంచెయ్యడానికి నేను సిద్ధంగా వున్నాను శ్రీకృష్ణుని అర్చించనివారు బ్రతికివున్నా చచ్చినవారితో సమానులు'' సభనుద్దేశించి అన్నాడు.

శిశుపాలుని లెఖ్ఖచెయ్యక శ్రీకృష్ణుని పూజించారు. శిశుపాలుడు మండిపడుతూ ''చూస్తున్నారేమిటి? యుద్ధానికి సిద్ధం కండి'' అంటూ అరిచాడు. శిశుపాలుడు అల్లరి చేయడానికి పూనుకున్నాడని శ్రీకృష్ణుడు గ్రహించాడు. ఈ కల్లోలపరిస్థితి చూసి యుధిష్ఠిరుడు తడబాటుతో భీష్మునివైపు తిరిగాడు. భీష్ముడు ధర్మజుడితో ''సింహాన్ని చూసి కుక్కలు మొరుగుతున్నాయి. వాటిని మొరగనీ, నువ్వు నీ పని చూడు'' అన్నాడు. అప్పుడు శిశుపాలుని క్రోధం భీష్ముని మీదికి మళ్లింది. శిశుపాలుడు భీష్మణ్ణి నానామాటలూ అనసాగాడు. ఇంతలో కృష్ణుడు కలుగచేసుకొని ''నూరు తప్పులు కాయమని మా అత్త కోరటం చేత యింతవరకు యీ శిశుపాలుణ్ణి సహించాను. ఇక ఇతడిని మన్నించను'' అంటున్నప్పుడే మంటలు చెలరేగుతూ కృష్ణుని చేతిలోకి చక్రాయుధం రావటం, శిశుపాలుడి కంఠం తెగి క్రిందపడటం రెండూ ఒకేమారు జరిగిపోయాయి. శిశుపాలుడి శరీరం నుండి ఒక దివ్యతేజస్సు వెలువడి కృష్ణునిలో లీనమైపోయింది. ఈ శిశుపాలుడు ఏదో శాపకారణంగా మానవజన్మ ఎత్తిన మహావిష్ణువు పరిచారకుడు. శ్రీకృష్ణునిద్వారా అతడికి ముక్తి కలిగింది. శిశుపాలుడి మృతదేహానికి యుధిష్ఠిరుడు తమ్ముళ్లకు చెప్పి యథోరీతిగా దహనసంస్కారాలు చేయించాడు.



Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

దుర్యోధనుడి మాత్సర్యం



రాజసూయయాగం జయప్రదంగా ముగిసింది. కృష్ణుడు పాండవుల వద్ద సెలవు తీసుకొంటూ ''ప్రజలను కన్నబిడ్డలలా చూసుకో. మహావృక్షాలు పక్షులకు నీడనిచ్చేలా, ఇంద్రుడు దేవతలను చూసుకొనేలా నువ్వు నీ స్నేహితులకు, బంధువులకు, ఆశ్రితులకు ఆశ్రయమివ్వాలి'' అని ధర్మజుడికి హితంబోధించి వెళ్లాడు.

మేనమామ శకునితోపాటు దుర్యోధనుడు ఇంద్రప్రస్థంలో మరికొంతకాలం వున్నాడు. మయ నిర్మిత సభామంటప సౌందర్యానికీ, శిల్పచాతుర్యానికీ దుర్యోధనుడు ఆశ్చర్యపోయాడు. మయసభ నిర్మాణమే అతడికి అయోమయంగా కాన్పించింది. తెరచివుంచిన ద్వారం మూసివుందనుకొని వెళ్లేవాడు కాదు. మూసివున్న ద్వారం తెరచివుందని భ్రమపడి స్ఫటికం తలుపులకు తలను కొట్టుకొనేవాడు. ఇంద్రనీలాలు తాపడం చేసిన స్థలాలు కోనేళ్లనుకొని అందులో దిగబోయి దుస్తులు ఎత్తిపట్టుకొనేవాడు. స్వచ్ఛమైన నీటికోనేటిని మాములు గచ్చుగా భ్రమించి, అందులో పడిపోయేవాడు. నానా అవస్థపడి తడి దుస్తులతో పైకి వచ్చాడు. అతడి అవస్థనుచూసి ద్రౌపది నవ్వు ఆపుకోలేకపోయి, పకపకా నవ్వింది. భీముడు వగైరాలు చప్పట్లు చరిచారు. దుర్యోధనుడు సిగ్గుపడిపోయాడు. ప్రచండ కోపంతో హస్తినాపురం వెళ్లిపోయాడు.

ఈ పరాభవం దావానలంలా దహించింది దుర్యోధనుణ్ణి. చివరికి ఆత్మహత్యకు తెగించాడు. అప్పుడు శకుని అతణ్ణి అనునయిస్తూ పాండవులను తుదముట్టించడానికి త్వరలో పథకం వేద్దామని నచ్చచెప్పాడు. అతడిలా అన్నాడు. ''మహావీరులైన పాండవులను యుద్ధంలో జయించలేము. కానీ మరో

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

మార్గముంది. ధర్మజుడికి జూదమంటే మోజు. కాని అందులో అతడు నిష్ణాతుడుకాడు. నేను జూదంలో ఆరితేరినవాడినని నీకు బాగా తెలుసు. నన్ను జూదంలో ఓడించే వాడు యింకా ఎవరూ పుట్టలేదు. నువ్వు ధర్మజుణ్ణి, జూదానికి ఆహ్వానించు; అతడి సామ్రాజ్యాన్నంతా హరించివేస్తాను. కాని యీ జూదానికి నీ తండ్రి అనుమతిని సంపాదించాలిసుమా!''

దుర్యోధనుణ్ణి వెంటబెట్టుకుని శకుని, ధృతరాష్ట్రుని వద్దకు వచ్చి ''బావా! నీ కొడుకు అవస్థ చూశావా?'' అంటూ దుర్యోధనుడి మనోవ్యధనంతా వివరించాడు. ధృతరాష్ట్రుడు ఆ

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

మాటలకు అదిరిపడ్డాడు. కొడుకును తడివి చూస్తూ ''ఇంతగా చిక్కిపోయావేం నాయనా? నీకేమయింది?'' అంటూ అనునయంగా అడిగాడు. అప్పుడు దుర్యోధనుడు ''పాండవులను చూడండి. వాళ్ల కీర్తి దిగంతాలకు వ్యాపించింది. వారికి కప్పం చెల్లించని రాజంటూ యీ భూప్రపంచంమీద లేడంటే అతిశయోక్తికాదు. రాజసూయయాగ సమయంలో కోశాగారం చూసుకొనే బాధ్యత నా మీద పెట్టారు. సప్తసముద్రాలలో వున్న రత్నాలన్నీ వారివద్దేవున్నాయి. ఇదంతా చూశాక నా మనస్సు ఎలా స్థిమితంగా వుంటుంది? జూదంలో శకుని మామ సమర్థుడు. యుధిష్ఠిరునితో జూదం ఆడడానికి శకుని మామకు అనుమతియిస్తే, పాండవుల సంపదనంతా మామ జూదంలో గెలుస్తాడు,'' అన్నాడు. కాని ధృతరాష్ట్రుడు ''నువ్వు చెప్పిన మాటలు మంచికో చెడుకో నాకు బోధపడటం లేదు. నాకు కొంత వ్యవధి ఇవ్వు, విదురునితో సమాలోచించి చెబుతాను'' అన్నాడు.

వెంటనే దుర్యోధనుడు ''పాండవ పక్షపాతియైన ఆ విదురుడు దీనికి ససేమిరా ఒప్పుకోడు. నువ్వు దీనికి సమ్మతించకపోతే నాకు ఆత్మహత్యే శరణ్యం'' అన్నాడు బెదిరింపు ధోరణిలో. ఆ మాటలకు ధృతరాష్ట్రుడికి కాళ్లూ చేతులూ ఆడలేదు. చేయతగని పని అని తెలిసినా గత్యంతరం లేక జూదానికి తన సమ్మతినిచ్చాడు.

దూతగా విదురుడు వెళ్లటం

ధృతరాష్ట్రుడు వెంటనే జూదక్రీడకోసం ఒక చక్కని సభామంటపాన్ని నిర్మించమని ఆజ్ఞాపించాడు. ఈ వార్త తెలియగానే విదురుడు పరుగున ధృతరాష్ట్రుని వద్దకు వచ్చి ''మహారాజా! జూదక్రీడకు అనుమతించవద్దు. ఈ జూదంవల్ల కలహం తప్పదు; కురువంశం సర్వనాశనమౌతుంది'' అంటూ హెచ్చరించాడు. కాని ధృతరాష్ట్రుడు ''దైవానుగ్రహంవల్ల అలాంటిదేదీ జరగదు. నువ్వూ, నేనూ, భీష్ముడూ అంతా దగ్గరే వుంటాము కదా! ఇంకా కలహం ఎందుకు వస్తుంది? నా తరఫున నువ్వు ఇంద్రప్రస్థం వెళ్లి ధర్మజుని జూదక్రీడకు ఆహ్వానించు'' అన్నాడు.

దుఃఖభారంతో విదురుడు ఇంద్రప్రస్థం బయలుదేరాడు. విదురుని రాకకు ధర్మజుడు ఎంతో ఆనందించాడు. కుశల ప్రశ్నలయ్యాక విదురుడు ''దుర్యోధనుడు కొత్తగా ఒక సభామంటపాన్ని నిర్మించాడు. మీరందరూ ద్రౌపదితోకూడా హస్తినాపురానికి విచ్చేసి, నీకు ప్రియమైన జూదక్రీడలో అక్కడ గడపాలని ధృతరాష్ట్రుని సందేశం'' అన్నాడు.

ఈ వార్త వినగానే యుధిష్ఠిరుడు తత్తరపాటు చెందాడు. ''మహాత్మా! జూదం ఎప్పుడూ కలహంతో ముగుస్తుంది. వివేకమంతుడు దాని జోలికిపోడు. జూదమాడటం సబబేనా? నీ అభిప్రాయం ఏమిటి'' అంటూ ప్రశ్నించాడు ధర్మజుడు.

''జూదం ఎలాంటి వినాశన కారో అందరికీ తెలిసిన విషయమేగదా! నాకు సాధ్యమైనంతవరకు వాదించాను. ధృతరాష్ట్రుడు నా మాట వినక, నిన్ను ఆహ్వానించడానికి నన్ను ఇక్కడకు వెళ్లమన్నాడు. అందు నిమిత్తమే నేను వచ్చింది. నీ ఇష్టప్రకారం నువ్వు నడుచుకో'' అన్నాడు విదురుడు.

ఈ హెచ్చరికనుకూడా లెక్కచెయ్యక ధర్మజుడు, ధృతరాష్ట్రుని ఆదేశాన్ని మీరకూడదన్న తలంపుతో తన తమ్ములతో, పరివారంతో హస్తినాపురానికి బయలుదేరాడు.



Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

దుర్యోధనుడు తన గోతిని తానే త్రవ్వుకొనుట

హస్తినాపురాన్ని చేరుకోగానే పాండవులు ధృతరాష్ట్రుని మందిరానికి వెళ్లారు. పెద్దలందరికీ నమస్కరించి, ఆశీనులయ్యారు. ముందుగా శకుని ''ధర్మనందనా! ఈ సభ నిండుగా వున్నది. వెంటనే జూదక్రీడ ప్రారంభిద్దాం'' అన్నాడు. దానికి ధర్మజుడు ''జూదం మహాపాపకార్యం. నీతినియమాలు లేనిది. వినాశనకారి. మమ్మల్ని మోసంతో ఓడించడానికి ఎందుకింత కుతూహలపడుతున్నావు?'' అని అడిగాడు. ''ధర్మజా! ఇద్దరు యుద్ధం చేస్తుంటే వారిలో బలసంపన్నుడు గెలుస్తాడు. ప్రత్యర్థిని గెలవాలనుకోవటం క్రీడలో సహజమేకదా! నువ్వు నాతో ఆడడానికి భయపడుతున్నపక్షంలో, నువ్వు పాల్గొకుండా వుండవచ్చును'' అన్నాడు శకుని. అప్పుడు ధర్మజుడు ''ఓ శకునీ! వెనుదీయడానికి నేను పిరికి పందను కాను. విధి బలీయం. ఇంతకీ నే నెవరితో ఆడాలి?'' అని అడిగాడు.



Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-0. In Public Domain. Digitized by eGangotri

వెంటనే దుర్యోధనుడు ''ధర్మజా! మా మామ శకుని నా తరపున ఆడతాడు'' అన్నాడు. ''ఒకరి తరపున మరొకరు ఆడడం న్యాయబద్ధం కాదు. కాని నువ్వు పట్టుబడితే, యీ నియమాన్ని కూడా ఉల్లంఘించడానికి నేను సిద్ధమే. ఆట ప్రారంభిద్దాం'' అన్నాడు ధర్మజుడు.

భీష్ముడు, ద్రోణుడు, కృపుడు మొదలైన పెద్ద లెందరో అక్కడ కూర్చుని బాధపడుతూ ఆటను చూస్తున్నారు. ధర్మజుడు మొదట రత్నాల కడియాలు మణిహారాలు పణంగా పెట్టాడు. పాచికలు విసిరాడు కపటి శకుని; వాటిని గెలుచుకున్నాడు. తరువాత తన కోశాగారాన్నంతా ధర్మజుడు పణంగా పెట్టాడు. ఈమారు శకునే గెలిచాడు. శకుని వేస్తున్నవి మంత్రించిన పాచికలు కాబట్టే కపటంగా ప్రతిసారీ ధర్మజుని ఓడించాడు. తన సంపదలను, తన సామ్రాజ్యాన్ని, తన పరివారాన్నీ, ఒక్కొక్కరిగా తన తమ్ములను, చివరికి తననుకూడా కోల్పోయాడు ఆ ధర్మజుడు. ఇంకా పణంగా పెట్టడానికి ఏమీ లేదు అన్నప్పుడు శకుని ''ఏం, ద్రౌపదిని మరిచిపోయావా?'' అన్నాడు. తుదకు ద్రౌపదిని కూడా కోల్పోయాడు.

భార్యతో సహా పాండవులు బానిసలయ్యారనే గర్వం ఒక్కసారిగా కళ్ళు కప్పింది దుర్యోధనుణ్ణి! తన అంతఃపురాన్ని చిమ్మి పెట్టటంకోసం ద్రౌపదిని పిలుచుకురమ్మని, విదురుడితో చెప్పాడు.

సభ నలుమూలలనుండి 'సిగ్గుచేటు' 'సిగ్గుచేటు' అనే కేకలు వినవచ్చాయి. దుర్యోధనుడి అహంకారం విదురుడు సహించలేకపోయాడు. ''దుర్యోధనా! నీ పిచ్చిలో నీ గోతిని నువ్వే తవ్వుకుంటున్నావని మరిచిపోకు. తెలిసీ చేతిని నాగుపాము పుట్టలో ఎందుకు పెడుతున్నావు?'' అని అడిగాడు.

కాని విదురుని నీతివాక్యాలు దుర్యోధనుడి తలకెక్కుతాయా? దుశ్శాసనునివైపు తిరిగి ''ఆ ద్రౌపదిని ఈడ్చుకు నిరా!'' అన్నాడు. వెంటనే దుశ్శాసనుడు ద్రౌపది వద్దకెళ్ళి ''ఇదుగో! మా రాజు నిన్ను సభకు తీసుకురమ్మన్నాడు. మర్యాదగా వస్తావా రావా? నువ్విప్పుడు మా దాసీవి'' అన్నాడు.

ఈ మాటలు విన్న ద్రౌపదికి తన కాళ్ళక్రింది నేల కుంగిపోతున్న ట్లనిపించినది. బిగ్గరగా విలపిస్తూ, తాను సురక్షితంగా వుండగల గాంధారి మందిరం వైపు పరుగెత్తింది. కాని దుశ్శాసనుడు ఆమెను వదిలిపెడతాడా? ''ఎక్కడకు పలాయనిస్తున్నావు?'' అంటూ ఆమె శిరోజాలు పట్టుకుని బరబరా సభలోకి ఈడ్చుకు వచ్చాడు. విడిపోయిన శిరోజాలతో, వివర్ణమైన ముఖంతో ఆమె, పరాభవంతో తలలువంచి కూర్చున్న తన భర్తలను చూసి ''భరత చక్రవర్తి వంశంవారు తమ క్షత్రియ ధర్మాన్ని ఇలా జూదంలో మంటగలపటమా? ఇంతమంది కురువృద్ధులూ, పెద్దలూ తమ కళ్లముందే నన్ను యీ దుర్మార్గుడు యిలా ఈడ్చుకు రావటం చూస్తూ కిక్కురుమనకుండా వూరకున్నారే! నా ప్రశ్నకు జవాబు చెప్పగలవారు యీ సభలోనే



Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-0. In Public Domain. Digitized by eGangotri

లేరా? నన్ను పణంగా పెట్టడానికి నా భర్తకు హక్కు వున్నదా?'' అని అడిగింది.

సభలో అందరూ తలలు దించుకుని నిశ్శబ్దంగా కూర్చున్నారు. ఆమెకు బదులు చెప్పే ధైర్యం ఎవరికీ లేకపోయింది. చివరికి భీష్ముడు ''మహాసాధ్వీ! ధర్మం అత్యంతసూక్ష్మమైనది. దానిని అర్థం చేసుకోవటం ఎంతో కష్టం. నీ ప్రశ్నకు నేను జవాబు చెప్పలేకపోతున్నాను'' అన్నాడు. ఏకధాటిగా విలపిస్తూ, నిస్సహాయంగా తన పతులవైపు చూస్తున్న ద్రౌపదిని నానా దుర్భాషలూ ఆడాడు దుశ్శాసనుడు. భీముడు ఇక సహించలేకపోయాడు. ధర్మజుని చూస్తూ ''అన్నా! నువ్వు సామ్రాజ్యాన్నంతా కోల్పోయినపుడు బాధపడలేదు. మమ్మల్ని కోల్పోయినప్పుడు కూడా నాకు కోపం రాలేదు. కాని ద్రౌపదిని పణంగా పెట్టటం మన్నించరాని పాపం'' అంటూ ''సహదేవా! నిప్పులను తీసుకురా! ఇలాంటి పాపం చేసిన అన్న చేతులను కాల్చాలి'' అన్నాడు.

కాని అర్జునుడు కలుగచేసుకొని ''అన్నా! కోపం చూపడానికి ఇది కాదు సమయం. ధర్మజుడు మనకు అన్నగారు. ఆయనకు కట్టుబడటం మన కర్తవ్యం'' అంటూ ఎలాగో భీముణ్ణి శాంతపరిచాడు.

శ్రీకృష్ణుని అహేతుక కృప

తనను ఇదివరకే కించపరచిన పాండవులను అగౌరవపరచడానికి ఇదే తగిన సమయం అని గ్రహించిన కర్ణుడు దుశ్శాసనుడితో ''ఈ పాండవు లందరి, ద్రౌపదితో సహా, వస్త్రాలను ఒలిపించు'' అన్నాడు. పాండవులు తమ రాజోచితమైన వస్త్రాలను తీసి కిందపడేశారు. దుశ్శాసనుడు లేచి, అందరి ముందు ద్రౌపది ధరించిన వలువలను లాగివెయ్యసాగాడు. ద్రౌపది దీనంగా సభంతా కలయచూసింది. తనను కాపాడే నాథుడే లేడు. ఇక ఆర్తత్రాణపరాయణుడు ఆ శ్రీకృష్ణుడే తనను రక్షించాలి. ఎలుగెత్తి శ్రీకృష్ణుని ప్రార్థించినది. ''హే గోవిందా! ఆపద్బాంధవా! నువ్వు తప్ప యీ అనాథను రక్షించేవారెవ్వరూ లేరు. దీనబంధూ! నా మానం కాపాడు'' అంటూ ఆర్తితో ప్రార్థిస్తూ కళ్లు మూసుకుంది.

ఆపద్బాంధవుడైన శ్రీకృష్ణుడు ఆమె మొరను విన్నాడు. ఓ! ఒక అద్భుతం జరిగింది. అక్షయంగా వలువలను ప్రసాదించాడు. దుశ్శాసనుడు ఆమె చీరను విప్పుతూనే వున్నాడు. ఆశ్చర్యంగా మరో చీర ఆమె ఒంటిపై వుంది. దానిని విప్పాడు. మళ్లీ మరొకటి సిద్ధంగా వుంది. ఇలా లాగిపారేస్తూంటే, చీరలు వస్తూనే వున్నాయి. విప్పిన చీరలు గుట్టలా పడివున్నాయి. కాని ద్రౌపది ఒంటిమీద చీర ఎప్పటిలానే వుంటూ వుంది. చివరకు దుశ్శాసనుడు అలసిపోయి, క్రిందపడిపోయాడు. ఈ అద్భుతం అందరినీ ఆశ్చర్యచకితులను చేసింది. ఆపద్బాంధవుడైన భగవంతుడు తన భక్తులను ఎప్పుడూ ఆదుకుంటాడని యీ సంఘటన చక్కగా నిరూపించినది.

తమ కళ్లముందు తమ భార్యను హేయమైన పరాభవానికి గురిచేస్తున్న దుశ్శాసనుణ్ణి చూసి భీముడు పళ్లు పటపటకొరికి భీకరంగా యిలా ప్రతిజ్ఞ చేశాడు. ''ఇదిగో కురువృద్ధులూ, పెద్దలూ, బంధువులూ అందరూ వినండి! ఇలాంటి మాటలు మీరు ఇంతవరకు విని వుండరు. ఇకపైనా ఎవరూ ఇలాంటి మాటలు పలకరు. రాబోయే యుద్ధంలో యీ దురాత్ముడు దుశ్శాసనుని రొమ్మును నా యీ చేతులతో చీల్చి, వాడి రక్తాన్ని తాగుతాను. ఇలా చెయ్యలేకపోతే నేను నా తండ్రుల గతికి తప్పినవాడినవుతాను.'' ఈ భీమ ప్రతిజ్ఞకు సభంతా స్తంభించిపోయింది.

దుర్యోధనుడి యీ పాపకార్యమే కాలక్రమంలో కురువంశం సర్వనాశనం కావడానికి మూలకారణంగా పరిణమించినది.

''తొడమీద కూర్చుందువుగానిరా'' అంటూ ద్రౌపదికేసి కన్నుగీటాడు దుర్యోధనుడు. దాన్ని చూసి జూలుపట్టిలాగిన సింహంలా లేచి నిలబడ్డాడు భీముడు. క్రోధంతో, భీకరంగా



Sri-Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

వున్నాడు. ''రాజగర్వం నెత్తికెక్కింది వీడికి. ద్రౌపదిని తొడమీదికి పిలుస్తున్నాడు దురాత్ముడు. యుద్ధంలో నా గదతో వీడి తొడలు విరగ్గొట్టకపోతే నా పూర్వులు పోయిన పుణ్యలోకాలకు నేను పోను'' అంటూ అరిచాడు.

భీముని ప్రతిజ్ఞలు విని ధృతరాష్ట్రుడు హడలిపోయాడు. దుర్యోధనుని బానిసత్వంనుండి పాండవులను విడుదలచెయ్యడమే సర్వశ్రేయస్కరమైనదని భావించి, ధర్మజుడు జూదంలో కోల్పోయినదంతా అతడికి ధారాదత్తం చేశాడు.

CC-O. In Public Domain. Digitized by eGangotri

ధర్మజుడు మళ్ళీ జూదమాడుట

తరువాత ధర్మజుడు తన తమ్ములతోను, భార్యతోను ఇంద్రప్రస్థానికి బయలుదేరాడు. తన యింత ప్రయత్నమూ బూడిదలో పోసిన పన్నీరైనదే అనుకొని దుర్యోధనుడు, కర్ణుడు, శకుని మరోఎత్తువేశారు. తియ్యని మాటలతో ధృతరాష్ట్రుని సమీపించి ''పాండవుల్ని యిలా వదిలేస్తే వాళ్లు మనల్ని సర్వనాశనం చేస్తారు. ద్రౌపదికి మేము పెట్టిన పాట్లు కలలో కూడ మరచిపోరు. మమ్మల్ని ఏనాటికీ క్షమించరు. ఇక మేము బ్రతికి బట్టకట్టాలంటే తిరిగి జూదమాడటమే మార్గం. ఈసారి జూదంలో ఓడినవారు పన్నెండు సంవత్సరాలు వనవాసం చెయ్యడమూ, ఎవరి కళ్లాబడకుండా ఒక యేడు అజ్ఞాతవాసం చెయ్యాలన్నది నియమంగా పెట్టుకుందాం. మనమే గెలుస్తాం. వారిని అడవులకు పంపించి ఆ పదమూడేళ్లకాలంలోను మన సామ్రాజ్యాన్ని సుస్థిరం చేసుకుంటాం'' అంటూ అనేక విధాల నచ్చచెప్పారు.

ధృతరాష్ట్రుడు మళ్లీ దూతను పంపి పాండవులను పిలిపించాడు. విదురుడు, ద్రోణుడు మొదలైన పెద్దలు ఎంత వారించినా, అంధరాజు పట్టించుకోలేదు. ఈ సారి పందెం గురించి వివరించిన శకుని అజ్ఞాతవాసంలో వారి ఉనికి తెలిస్తే అందుకు శిక్షగా మళ్లీ పన్నెండేళ్లు వనవాసం వెళ్లాల్సి వుంటుందని చెప్పాడు.

జూదం మళ్లీ ప్రారంభమైంది. ఈ సారి కూడా శకునే గెలిచాడు. ఇంకేమి? పాండవులు వనవాసం వెళ్లడానికి సిద్ధమయ్యారు. అప్పుడు దుశ్శాసనుడు ''ఇప్పటినుండి దుర్యోధనుని ఏకఛత్రాధిపత్యం ప్రారంభమయింది. పాండవుల అంతు తేలింది,'' అన్నాడు. ఈ మాటలు విన్న భీముడు కోపోద్రిక్తుడై అతడివైపుతిరిగి ''నువ్వు ఇలాటి మాటలతో మా గుండెలను గుచ్చినట్లు, రణరంగంలో నీ గుండెను నేను చీలుస్తాను'' అన్నాడు. పాండవులు వెళుతుంటే, భీముని నడకను తాను అనుకరిస్తూ వెక్కిరించాడు దుర్యోధనుడు. అప్పుడు భీముడు అటువైపు తిరిగి ''దురాత్ముడైన యీ దుర్యోధనుణ్ణి నా గదాఘాతంతో చంపుతాను. వాణ్ణి క్రిందపడేసి తలమీద తంతాను. దుశ్శాసనుణ్ణి చంపి వాడి రక్తం పానం చేస్తాను. అర్జునుడు, కర్ణుణ్ణి హతమారుస్తాడు. సహదేవుడు కుటిల శకునిని వధిస్తాడు. సూర్యుడు తన వేడిమిని కోల్పోయినా, హిమాలయాలు తన చోటు మారినా, చంద్రుడు తన చల్లదనాన్ని కోల్పోయినా మా ప్రతిజ్ఞలను నెరవేర్చడంలో మేం తప్పకుండా సఫలీకృతులమౌతాము'' అన్నాడు ఆక్రోశంతో.

''మీ అందరి వద్దా నేను సెలవు తీసుకుంటున్నాను. తిరిగి వచ్చాక మళ్లీ కలుస్తాను'' అన్నాడు ధర్మజుడు.

ద్రౌపది కుంతీదేవి వద్దకెళ్లి ఆమె ఆశీర్వచనం పొందినది. ద్రౌపదితో పాండవులు వెళ్లిపోయాక, బెంగపడ్డ ధృతరాష్ట్రుడు విదురుని పిలిపించి పాండవులు నగరం విడిచి ఏ విధంగా వెళ్లారో వివరించమన్నాడు.

దానికి విదురుడు ఇలా అన్నాడు: ''వస్త్రాన్ని ముఖంమీద కప్పుకొని ధర్మరాజు వెళ్లాడు. రెండు చేతులూ చాచుకుంటూ వెళ్లాడు భీముడు. ఇసుక చల్లుకుంటూ అర్జునుడు వెళ్లాడు. ఒంటినిండా బుగ్గిపూసుకొని వెళ్లాడు నకులుడు. సహదేవుడు సిగ్గుతో తలవంచుకుంటూ వెళ్లాడు. వికారంగా తలవిరబోసుకొని, దుఃఖిస్తూ వెళ్లింది ద్రౌపది. అప్పుడు ఆకాశం మీద మబ్బులు లేకుండానే మెరుపులు మెరిసాయి. హఠాత్తుగా భూమి కంపించింది. ఇలాంటి చెడుశకునాలు దురాలోచనతో నువ్విలా నడుచుకొన్నదానికి పర్యవసానంగా జరుగనున్న కురువంశ సర్వనాశనానికి నాంది పలుకుతున్నాయి.'' ఇలా వాళ్లు మాట్లాడుకునేటప్పుడు దేవర్షి నారదుడు అక్కడికి వేంచేసి ''ఈ ఏటికి పద్నాలుగో ఏడు అత్యంత భయంకరమైన భారత సంగ్రామం జరుగుతుంది. దురాత్ముడైన దుర్యోధనుని కారణంగా కురువంశం సర్వనాశనమౌతుంది. భీమార్జునుల పరాక్రమంతో పాండవులు విజయం సాధిస్తారు'' అంటూ వెళ్లిపోయాడు. అప్పుడు ద్రోణాచార్యుడు దుర్యోధనుని దుష్టచర్యలవల్ల జరుగబోయే విపరీతాల గురించి ధృతరాష్ట్రుని హెచ్చరించాడు. ధృతరాష్ట్రుడు భయంతోనూ, దుఃఖంతోను కూలబడిపోయాడు.

సభాపర్వం సమాప్తం.

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

అరణ్య పర్వం

అక్షయపాత్ర

పాండవులు ద్రౌపదితో అడవులకు బయలుదేరారు. ప్రజలు కూడా భీష్మద్రోణ విదురులను నిందిస్తూ పాండవులతో పాటు బయలుదేరారు. ప్రజల ఆదరంచూసి ధర్మజుడు చలించి పోయి, వారిని తిరిగిపొండని బ్రతిమాలాడు. [illegible] దుఃఖిస్తూ వెళ్లలేక హస్తినాపురానికి వెళ్లిపోయారు. తరువాత పాండవులు తమ రథాలను గంగాతీరం వైపు మళ్లించి, గంగా స్నానం చేసి ఆరాత్రి అక్కడే గడిపారు. మరునాడు ఎంతోమంది బ్రాహ్మణులు పాండవులను కలుసుకొని వారితోపాటు అరణ్య వాసం చెయ్యడానికి సిద్ధపడివచ్చారు. కానీ ధర్మజుడు ''అయ్యా! నా ప్రార్థన మన్నించి మీరు తిరిగి వెళ్లిపొండి. మునుపటిలా మిమ్మ నేనిప్పుడు పోషించలేను, మే మెలాగో కందమూలాలు భుజిస్తూ అరణ్యవాసం పూర్తిచేసుకొంటాము'' అన్నాడు. కాని బ్రాహ్మణులు పట్టుబట్టారు. పాండవులతో పాటు కష్టాలలో పాలుపంచుకోవడానికి వారు సిద్ధంగా వున్నారు. కాని ఇంతమందికి తానెలా ఆహారం సమకూర్చగలనా అని

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

ధర్మజుడు చింతించసాగాడు. తన తమ్ములతోను, గురువు ధౌమ్యుడితోను యీ సమస్య గురించి చర్చించాడు.

అప్పుడు ధౌమ్యుడు ధర్మజునితో ''నువ్వు సహాయార్థం సూర్యదేవుని ఉపాసించు. సూర్యుడే ఆహారం సృష్టిస్తాడు. ప్రపంచంలోని సంపదకంతా కర్త ఆతడే. అందువల్ల అతడిని ఉపాసిస్తే నీ కోరిక నెరవేరుతుంది'' అన్నాడు. ధౌమ్యుని ఉపదేశం అక్షరాల పాటించాడు ధర్మజుడు. అత్యంత భక్తిశ్రద్ధలతో సూర్య దేవుని పూజించాడు. సూర్యుడు ప్రత్యక్షమయ్యాడు. ''నీ తపస్సుకు సంతోషించాను. నీ వనవాస పన్నెండేళ్లకాలం, నీ వంటయిల్లు తరుగు లేకుండా వుంటుంది. కందమూలాలూ, కాయగూరలూ ఏవయినా సరే, ద్రౌపది చేతిలో దివ్యంగా నాలుగు రకాల వంటకాలౌతాయి. ఇదిగో యీ రాగిపాత్ర తీసుకో. ఇది అక్షయపాత్ర. ఎంతమందికి వడ్డించినా సరే - దీనికి తరుగంటూ వుండదు. ద్రౌపది ఆ పాత్రనుండి ఆహారం స్వీకరించిన తరువాత - ఆ రోజుకు పాత్ర యిక ఆహారం ఇవ్వదు. మళ్లీ మర్నాడే అది అక్షయంగా ఆహారం సమకూరుస్తుంది'' అంటూ అక్షయపాత్రను ధర్మరాజుకు అందచేసి అంతర్థానమయ్యాడు సూర్యదేవుడు. ధర్మరాజు ఆ అక్షయపాత్రను ద్రౌపది కిచ్చాడు. ద్రౌపది స్వల్పంగా ఆహారం వండి అందులో వేసింది. మరుక్షణమే రకరకాల ఆహారపదార్థాలు అందులో నుండి పుట్టుకొచ్చాయి. ద్రౌపది బ్రాహ్మణు లందరికీ తృప్తిగా భోజనం పెట్టింది. పాండవులందరూ భోజనం చేశాక, ద్రౌపది కూడా భోజనం చేసింది. అంతటితో ఆనాటికి ఆ పాత్ర పని అయిపోయింది,

తరువాత ధర్మరాజు, ధౌమ్యుడు మొదలైన బ్రాహ్మణోత్తములతో కామ్యక వనానికి ప్రయాణమయ్యాడు.

విదురుడు పాండవులను చూడవచ్చుట 12

పాండవులు వనవాసానికి వెళ్లిపోయాక ధృతరాష్ట్రుడు విదుర్ణి పిలిపించి ''ఇప్పుడేంచెయ్యాలి?'' అని అడిగాడు. వివేకవంతుడైన విదురుడు ''మహారాజా! నేను సలహా ఇవ్వగలనే గాని, అది మీకు నచ్చదని నాకు బాగా తెలుసు. పాండవులను వెనక్కు పిలిచి వారి రాజ్యం వారి కిచ్చెయ్యి. ఇలా నువ్వు చెయ్యకపోతే కురువంశం సర్వనాశనమవడం చూడడానికి సిద్ధపడి వుండు. ఇదే నా సలహా! తర్వాత నీ ఇష్టం'' అన్నాడు.

విదురుని పలుకులు ధృతరాష్ట్రుడికి ములుకుల్లా గ్రుచ్చుకున్నాయి. అతడు ఉక్రోషంతో ''నువ్వెప్పుడూ పాండవ పక్షపాతివే! పాండవుల కోసం నా బిడ్డలను వదలుకోమంటావా? నన్ను సముదాయించడానికి బదులు నీ మాటలతో నన్ను బాధపెడుతున్నావు. చెయ్యడానికి అసాధ్యమైన దానినే చెయ్యమంటున్నావు. ఇక నా మొహం చూడకు. ఇక్కడ నుండి వెళ్లిపో'' అన్నాడు. ఈ మాటలు వినగానే విదురుడు కట్టుగుడ్డలతో కామ్యకవనానికి వచ్చేశాడు.

విదురుని ఎంతో సత్కారపూర్వకంగా తీసుకువచ్చారు పాండవులు. పాండవుల స్థితిని చూసి కంటతడిపెట్టాడు విదురుడు. ధృతరాష్ట్రు డితో తనకు కలిగిన అభిప్రాయభేదం గురించి చెప్పాడు. ''ఆయన వెళ్లిపొమ్మంటే వచ్చేశాను'' అన్నాడు.

విదురుడు వెళ్లిపోయిన తరువాత పశ్చాత్తాపపడి ధృతరాష్ట్రుడు స్పృహతప్పి పడిపోయాడు. కొంతసేపటికి తెప్పరిల్లి సంజయుణ్ణి పిలిపించి ''నువ్వు తక్షణం వెళ్లి విదురుణ్ణి పిలుచుకురా. ఆతడు మూర్తీభవించిన ధర్మదేవత'' అంటూ విలపించసాగాడు. సంజయుడు త్వరత్వరంగా వెళ్లి విదురుణ్ణి కలుసుకొని ధృతరాష్ట్రుని నిస్సహాయ పరిస్థితిని తెలిపాడు. పాండవులను ఆశీర్వదించాక, ధృతరాష్ట్రునిపై తనకున్న ప్రేమకొద్దీ తక్షణమే విదురుడు హస్తినాపురానికి తిరిగి వచ్చేశాడు.



Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

మైత్రేయుని శాపం

విదురుడు తిరిగి రావడం దుర్యోధనుడికి నచ్చలేదు. వెంటనే దుశ్శాసన, కర్ణ, శకునులతో చర్చ జరిపాడు. ''విదురుడు పాండవుల వద్ద కెళ్లి వెంటనే తిరిగి వచ్చేశాడు. దానికి కారణం తెలియదు. బహుశా పాండవులను మళ్లీ పిలిపించి, వాళ్ల రాజ్యం వాళ్ల కిప్పించెయ్యాలని మా తండ్రిని ఒప్పించి వుండవచ్చు. ఏ కారణంచేతనైనా పాండవులు మళ్లీ తిరిగి వచ్చిన పక్షంలో నేను ఆత్మహత్య చేసుకుంటాను'' అన్నాడు.

అప్పుడు కర్ణుడు ''వాళ్లు తిరిగివస్తే మళ్లీ జూదంలో ఓడిస్తాం. లేకపోతే ఇప్పుడే చతురంగబలాలతో వెళ్లి వారినెదుర్కొని యమపురికి పంపుదాం'' అన్నాడు. ఈ సలహాకు అంతా ఒప్పుకున్నారు. పాండవులపై దాడిచేయడానికి తీర్మానించుకున్నారు. సరిగ్గా ఆ సమయానికి వ్యాసమహర్షి అక్కడికి వచ్చి, వారిని వారించాడు. తిన్నగా ధృతరాష్ట్రుని వద్దకెళ్లి ''నువ్వు పాండవులను అడవుల పాలుచేసి, ఇప్పటికే నీకూ, నీ వంశానికీ ఎంతో అనర్థం సంపాదించుకున్నావు. అడవుల్లో వున్న పాండవులు

CC-O. In Public Domain. Digitized by eGangotri

పదమూడేళ్లూ యీ ద్వేషాగ్నిని బాగా రగిలింపజేసి, తమ అరణ్యవాసం ముగియగానే, తిరిగివచ్చి యీ భూమండలాన్నే భస్మీభూతం గావిస్తారు. ఇంత అన్యాయానికీ నువ్వే కారకుడివి. నీ కుమారుని అదుపులో వుంచుకో. లేకపోతే నీ వంశమే సర్వనాశనమైపోతుంది, జాగ్రత్త!'' అంటూ హెచ్చరించాడు.

వ్యాసుడు వెళ్లిపోయాక మైత్రేయమహర్షి హస్తినాపురం వచ్చాడు. ఆయన కామ్యకవనం నుండి వస్తున్నాడని విని ధృతరాష్ట్రుడు పాండవుల క్షేమం గురించి విచారించాడు. అప్పుడు మైత్రేయుడు ''పాండవులను కలుసుకున్న తర్వాతనే మీ వద్దకు వచ్చాను. నువ్వు పాండవులకు చాలా అన్యాయం చేశావు'' అన్నాడు. తర్వాత దుర్యోధనుడితో ''నీ మంచికోసమే చెబుతున్నాను. పాండవులు సాటిలేని పరాక్రమవంతులు. వారు ఇప్పటికే అవలీలగా బకాసురుణ్ణీ, హిడింబుణ్ణీ, కిమ్మీరుణ్ణీ వధించారు'' అన్నాడు.

మైత్రేయుడు చెబుతున్నంతసేపూ పెడసరంగా వున్నాడు దుర్యోధనుడు ముసిముసిగా నవ్వుతూ కాలిబొటనవ్రేలు కిందరాస్తూనే వున్నాడు. తొడలమీద చేత్తో తాళం వేస్తూకూర్చున్నాడు. మైత్రేయుడికి ఒళ్ళుమండింది. ''ఈ పెడసరానికి ప్రతిఫలం అనుభవిస్తావు. యుద్ధంలో భీముడు తన గదతో నీ తొడలు విరగ్గొడతాడు. అప్పుడు నీకు మరణం కలుగుతుంది'' అంటూ ఘోరంగా శపించాడు. మైత్రేయుని శాంతింపచెయ్యడానికి కాళ్లావేళ్లాపడ్డాడు ధృతరాష్ట్రుడు. కొంత శాంతించిన ముని ''ఇతడు పాండవులతో స్నేహం చేసుకొంటే నా శాపం తప్పుతుంది. లేకపోతే నా శాపానికి తిరుగులేదు,'' అన్నాడు.

భీముడిచే వధింపబడ్డ కిమ్మీరుణ్ణి గురించి తెలుసుకోవాలని ధృతరాష్ట్రుడు, విదురుణ్ణి వివరించమన్నాడు. అప్పుడు విదురుడు యిలా చెప్పాడు: ''అది భీముడు వీరవిహారం చేసిన కథ. పాండవులు కామ్యకవనం చేరిన అర్ధరాత్రివేళ ఒక రాక్షసుడు వాళ్లకు ఎదురయ్యాడు. మహాకాయుడుగా పెద్దపెద్ద కోరలతో చూడడానికి ఎంతో భయంకరంగా వున్నాడు. ధర్మరాజు అతణ్ణి ప్రశ్నిస్తే అందుకా రాక్షసుడు 'నన్ను కిమ్మీరుడంటారు. బకాసురుడి తమ్ముణ్ణి. ఈ వనంలో ప్రవేశించిన మనుష్యుల్నీ, మృగాల్నీ చంపి తినడమే నా పని. మీ రెవరు?' అని గద్దించాడు. ధర్మజుడు తమను గురించి చెబుతూ భీముడి పేరు చెప్పిన వెంటనే ఎగిరి గంతేశాడు కిమ్మీరుడు. 'హిడింబ, బకాసురుల వధకు ప్రతీకారం కోసం యింతవరకు కాచుకుని వున్నాను. నా మిత్రుడైన హిడింబుణ్ణీ, నా అన్న బకుణ్ణీ చంపిన యీ భీముణ్ణి హతమార్చి, పగతీర్చుకొంటాను' అంటూ ముందుకు వచ్చాడు. భీముడు ఒక పెద్దవృక్షాన్ని ఊడబెరికి ఆ రాక్షసుడితో యుద్ధానికి దిగాడు. వారి మధ్య ఘోరయుద్ధం జరిగింది. చివరికి భీముడు యమదండాల్లాంటి చేతులతో వాడి నడుమూ, కంఠమూ పట్టుకొని నేలమీద పడేసి బకుణ్ణి చంపినట్లే ఫెళఫెళా విరిచి కిమ్మీరుణ్ణీ చంపేశాడు.'' ఈ కథ విని కౌరవుల గుండెల్లో రాయి పడినట్లయింది..

శ్రీకృష్ణుని వాగ్దానం

పాండవులు తమ రాజ్యం పోగొట్టుకుని అడవుల్లో వున్నారనే వార్త వినడంతోనే శ్రీకృష్ణుడు కామ్యక వనానికి బయలుదేరాడు. యాదవులూ, వృష్ణికులూ, భోజులూ, అంధకులూ - యావన్మందీ ఆయనతోపాటు వచ్చారు. పాంచాలం నుండి ద్రౌపది సోదరుడు ధృష్టద్యుమ్నుడు వచ్చాడు. పాండవుల అవస్థను చూసి సహించలేకపోయాడు కృష్ణుడు. కోపంతో కాలరుద్రునిలా ''దుర్యోధనుడు, దుశ్శాసనుడు, కర్ణుడు, శకుని - వీళ్ల రక్తంతో భూదేవికి తర్పణం చేద్దాం. వీరందరిని

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

వధించి సమస్త సామ్రాజ్యానికీ ధర్మరాజునే సామ్రాట్టుని చేద్దాం'' అంటూ పిడుగులా ఉరిమాడు. ''ధర్మరక్షణకు దుష్టసంహారం తప్పనిసరి'' అన్నాడు.

అర్జునుడు, కృష్ణుణ్ణి శాంతపరిచాడు. మునుపటి జన్మలలో శ్రీకృష్ణుడు జగద్ధితార్థం గావించిన అనేక లీలలను గురించి వివరించాడు. ఇవన్నీ తాను నారదుని ద్వారా విన్నానని చెప్పాడు. అర్జునుని స్తోత్రంతో శాంతించిన శ్రీకృష్ణుడు ''అర్జునా! నువ్వు నేనూ ఒకటేగా'' అన్నాడు, చిరునవ్వుతో ''మనం ఆదిమునులమైన నరనారాయణులం. నువ్వు నరుడివి. నేను నారాయణుణ్ణి. నువ్వు వేరు, నేను వేరు అనే భేదమే లేదు. అందుచే నీ మిత్రుడే నా మిత్రుడు; నీ శత్రువే నా శత్రువు. జగద్ధితార్థమే మనం జన్మస్వీకరించాం'' అన్నాడు.

అప్పుడే ద్రౌపదివచ్చి శ్రీకృష్ణుని ముందు నిలబడింది. ఆమె కోపంతో ''నువ్వు ప్రజాపతివని మహర్షు లంటారు. ఈ ప్రపంచ సృష్టికర్తవు. నువ్వే మహావిష్ణువు, సనాతన పురుషుడవు. సకల జీవరాసుల ప్రభువు. నా పట్ల నీకెంతో వాత్సల్యముంది. కాబట్టే నా మనస్సులోని విషయాలు బైటపెడుతున్నాను. ఓ కృష్ణా! నన్ను ఎంత దారుణంగా సభకు యీడ్చుకొచ్చారు? వీరాధివీరులైన భీమార్జునులు నేను ఆక్రోశిస్తూంటే కదలనైనా కదల లేదు. ఎందుకొచ్చిన బాహుబలం వీళ్లది? భర్తలున్నారు. అన్నదమ్ములున్నారు. కొడుకులున్నారు. బంధువులున్నారు. ఇందరూవున్నా దిక్కులేనిదాన్నే అయ్యాను నేను. నా పరాభవానికి ప్రతీకారం లేదా అన్నా?'' అంటూ వెక్కి వెక్కి ఏడ్చింది.

Sri Vi harathi Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

శ్రీకృష్ణుడు ఆమెను ఓదారుస్తూ ''చెల్లీ! నీ విప్పుడు దీనంగా విలపిస్తున్నట్లే నీ పరాభవానికి కారకులైన వారి భార్యలు రణభూమిలో వారి భర్తల మృతదేహాలను చూసి విలపిస్తారు. నా పలుకులు అక్షరాల నిజమని నమ్ము. నువ్వు మహారాణి వౌతావు,'' అన్నాడు కృష్ణుడు. అప్పుడు అర్జునుడు ''అవును ద్రౌపదీ! శ్రీకృష్ణుడు డన్నది తప్పక జరిగితీరుతుంది. విలపించకు'' అన్నాడు.

వెంటనే ధృష్టద్యుమ్నుడు ''నేను ద్రోణుణ్ణి చంపుతాను. శిఖండి భీష్మణ్ణి, భీముడు దుర్యోధనుణ్ణి, అర్జునుడు కర్ణుణ్ణీ చంపుతారు,'' అంటున్నప్పుడు అంతా శ్రీకృష్ణుని వైపు చూశారు.

శ్రీకృష్ణుడు వారి వంక చూస్తూ ఇలా అన్నాడు. ''నేను ద్వారకలో వుండివుంటే ఇలా జరిగివుండేదికాదు. జూదం వల్ల సంభవించే అనర్థాలను గురించి వివరించి, దానిని నివారించేవాణ్ణి. ఆ సమయంలో నేను శిశుపాలుడి కొడుకు దమఘోషుణ్ణి చంపటంలో నిమగ్నుడైవున్నాను. అతణ్ణి వధించి ద్వారకకు తిరిగి వచ్చాక మీకు సంభవించిన అనర్థం గురించి తెలిసింది. వెంటనే ఇక్కడకు వచ్చేశాను.'' కొన్నిరోజులు పాండవులతో గడిపి శ్రీకృష్ణుడు ద్వారకకు బయలుదేరాడు.

శివార్జునుల యుద్ధం

శ్రీకృష్ణుడు వెళ్లిపోయాక పాండవులు ద్వైతవనం చేరుకున్నారు. ప్రతిరోజూ బ్రాహ్మణోత్తములు వేదపారాయణం చేస్తూ, ధర్మసూక్ష్మలను గురించి పాండవులతో చర్చించేవారు. ఒకరోజు ద్రౌపది పడుతున్న అవస్థలు చూసి భీముడు ఎంతో విచారించాడు. ''ఇలా అడవుల్లో వుండటంవల్ల ఏమిలాభం? దుర్యోధనుడు మన రాజ్యం కాజేశాడు. ఆడినమాట తప్పినా ఏమి? పాటించినా ఏమి? ధర్మంకోసం ధర్మాన్ని పాటించడం అన్ని ముప్పులకు దారి తీస్తుంది. నా కో ఉపాయం తోస్తూంది. సంవత్సరానికి బదులు నెలలు లెక్కపెట్టడం కద్దు. పదమూడు సంవత్సరాలు కదా ఒప్పందం! మనం అడవులకు వచ్చి పదమూడు మాసాలైనది. పదమూడు సంవత్సరాలకు పదమూడు మాసాలు సరిపోతాయి. ధర్మ విరోధం లేదు. యుద్ధానికి తగిన సమయమిదే. అంతకంటే క్షత్రియుడికి వేరే ధర్మం ఏముంటుంది?'' అన్నాడు. కాని ధర్మజుడు అక్షరాల ధర్మం పాటించాలని గట్టిగా తీర్మానించాడు. అప్పుడే వారి వద్దకు వ్యాసమహర్షి వచ్చాడు. ధర్మరాజుని చూసి మందహాసంతో, ''భీష్ముడు, ద్రోణుడు మొదలైన వారిని ఎలా గెలవడ మని భయపడుతున్నావా'' అంటూ అతని మనసులోని విషయాన్ని బైటపెట్టాడు. ''నేను నీ సహాయార్థమే వచ్చాను. నీ కొక రహస్య విద్య ఉపదేశిస్తాను. ఎంతో యోగం వుంటేగాని ఇది లభించదు. ఈ మహావిద్యకోసం అర్జునుణ్ణి నియోగించు. దీని శక్తితో అర్జునుడు మహావీర్యవంతుడౌతాడు. ఇంద్రుడు, యముడు, వరుణుడు, కుబేరుడు మొదలైన దేవతలనీ, శివుణ్ణీ ప్రత్యక్షం చేసుకుంటాడు. వారివల్ల దివ్యాస్త్రాలు పొందుతాడు. శత్రువులందరినీ అవలీలగా జయిస్తాడు'' అంటూ 'ప్రతిస్మృతి' అనే ఒక రహస్యవిద్యను ఉపదేశించి వెళ్లిపోయాడు వ్యాసుడు.

కొన్ని రోజుల అనంతరం ధర్మజుడు, అర్జునుణ్ణి పిలిచి ''భీష్ముడు, ద్రోణుడు మొదలైనవారు ధనుర్విద్యలో సర్వజ్ఞులు. అందువల్ల వ్యాసుడు నాకు ఉపదేశించిన దివ్యమంత్రాన్ని నీకు ఉపదేశిస్తాను. ఆ మంత్రప్రభావంతో నువ్వు దేవతల అనుగ్రహం పొందగలుగుతావు. ఇంద్రునివద్ద దివ్యాస్త్రాలన్నీ వున్నాయి. తపోనిష్ఠతో దేవేంద్రుని మెప్పించి ఆ దివ్యాస్త్రాలన్నిటిని సంపాదించు. తరువాత ఇంద్రుని ఉపదేశంతో శివుణ్ణి ఆరాధించి ఇష్టసిద్ధి పొందు'' అన్నాడు. సోదరుల వద్ద సెలవుగైకొని, ఋషుల ఆశీర్వాదాలతో అర్జునుడు తపస్సుకు బయలుదేరాడు.

ఈశాన్యదిక్కుగా బయలుదేరిన అర్జునుడు హిమాలయంచేరి గంధమాదన పర్వతందాటి ఇంద్రకీలపర్వతం అధిరోహించసాగాడు. 'ఆగు' అంటూ ఆకాశంనుండి పెద్దకేక వినబడింది. అర్జునుడు చుట్టూచూశాడు. ఒక చెట్టుక్రింద కూర్చున్న ఒక ముసలి బ్రాహ్మణుడు కనబడ్డాడు. ఆతడి శరీరం కృశించివున్నా, ముఖంలో బ్రహ్మతేజస్సు వుట్టిపడుతోంది. ఆయనకు అర్జునుడు నమస్కరించాడు. అప్పుడా బ్రాహ్మణుడు ''ప్రశాంతంగా తపస్సు చేసుకొనే ఋషులు వశిస్తున్న ఈ ప్రాంతంలో కత్తీ, కవచం, ధనుస్సూ ఇవన్నీ ఎందుకు ధరించి వస్తున్నావు? ఈ పుణ్యభూమిలో అ [illegible] పనికిరావు. వాటిని విడిచిపెట్టు'' అన్నాడు.

కాని అర్జునుడు చలించలేదు. ఆయుధాలను దృఢంగా పట్టుకొన్నాడు. ''అయ్యా! నేను అర్జునుణ్ణి. దివ్యాస్త్రాల నిమిత్తం ఇక్కడికి వచ్చాను'' అన్నాడు. వెంటనే ఆ ముసలి బ్రాహ్మణుడు ఇంద్రుని రూపంతో అర్జునుడికి దర్శన మిచ్చాడు.

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

''అర్జునా! నీకు కావాల్సిన వరం కోరుకో. నీ పట్ల ప్రసన్నుడిన య్యాను'' అన్నాడు.

ఇంద్రుడికి మళ్లీ అర్జునుడు ప్రణమిల్లి ''దేవా! నాకుదివ్యా స్త్రాల నన్నిటిని ప్రసాదించు'' అని కోరాడు. దానికి ఇంద్రుడు ''అర్జునా! నీకు కావాల్సినవి దివ్యాస్త్రాలే అయితే, శివుణ్ణి ప్రత్యక్షం చేసుకో. తపస్సు గావించి శివుణ్ణి ప్రసన్నుణ్ణి చేసుకో, నీ కోరిక సిద్ధిస్తుంది'' అంటూ అంతర్ధానమయ్యాడు.

ఇంద్రుడు చెప్పినట్లే అర్జునుడు తపస్సుకు పూనుకు న్నాడు. మొదట్లో కందమూలాలు తింటూ వచ్చాడు. తరువాత మూడు రోజులకు ఒకసారిమాత్రం ఒక రాలినఆకు తింటూ వచ్చాడు. అలా మొదటినెల గడిపి, రెండో నెలలో ఆరురోజులకు ఒక ఆకు తినసాగాడు: మూడవనెల పదిహేను రోజులకు ఒక ఆకు తింటూ గడిపాడు. నాలుగవ నెల వాయుభక్షణంతో గడుపుతూ, రెండు చేతులు మీదికెత్తి, ఒకే కాలుమీద నిలబడి ఘోరమైన తపస్సు కొనసాగించసాగాడు, అర్జునుడు

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

ఇది చూసి ఆశ్చర్యచకితులైన మునులు శివుని వద్దకెళ్లి విషయం విన్నవించారు. "ఎన్నడూ కనీవినీ ఎరుగని ఉగ్రమైన తపస్సు చేస్తున్నాడు అర్జునుడు. కాలమేఘాల్లాగా తపోగ్ని పొగలు తపోవనం నిండిపోతున్నాయి. అతని కోర్కె చెల్లించు మహాదేవా!'' అన్నారు.

"భయపడకండి'' అన్నాడు శివుడు అభయహస్తం యిస్తూ, "అతడి అభీష్టమేమిటో నాకు బాగా తెలుసు. అతడు కోరినవరం ప్రసాదిస్తాను. మీరు నిశ్చింతగా వెళ్లండి'' అన్నాడు.

శివుడు, కిరాతుడిలా వేషం ధరించాడు. చేత చక్కని విల్లును పట్టుకుని కిరాతుని భార్యలా వేషం ధరించిన పార్వతీదేవితో, శివుడు బయలుదేరాడు. ఆ సమయంలో ఒక అడవిపంది అర్జునుడి మీదికి దూసుకు వచ్చింది. అర్జునుడు గాండీవం నుండి వాడియైన బాణాన్ని దాని మీదికి వదిలాడు. అదే సమయంలో కిరాతుడుకూడా ఒక బాణాన్ని ఆ పందిమీదికి వదిలాడు. అర్జునుడు, కిరాతుణ్ణి చూసి "ఎవరు నువ్వు? నేను బాణప్రయోగం చేసిన యీ పందిమీద మళ్లీ నువ్వెందుకు బాణం ప్రయోగించావు?'' అని అడిగాడు. అందుకు కిరాతుడు "ఈ అరణ్యమే నా నివాసం. నువ్వు వనవాసిగా కనిపించడం లేదు. నేను ప్రయోగించిన బాణంతోనే ఆ పంది చచ్చింది'' అన్నాడు.

క్రమంగా వారి మధ్య వాదులాట ప్రారంభమై చివరి కది పోట్లాటగా పరిణమించింది. కిరాతుని పరాక్రమం ముందు అర్జునుడు నిలువలేకపోయాడు. తన ధనుస్సును కోల్పోయాడు. కిరాతుడు అర్జునుని ఒడిసి పట్టుకున్నాడు. అర్జునుడు సహాయార్థం శివుణ్ణే ధ్యానించాడు. మరుక్షణం కిరాతుడు, శివుడిగా మారి అర్జునుడికి దర్శన మిచ్చాడు.

భక్తిశ్రద్ధలతో అర్జునుడు, శివుని పాదాలమీద సాష్టాంగపడ్డాడు. శివుడు అత్యంత ప్రసన్నుడై "అర్జునా! నీ తపస్సుకు శౌర్యానికి సంతృప్తుడనయ్యాను. నీకు పాశుపతాస్త్రాన్ని ప్రసాదిస్తున్నాను. దీన్ని అభిమంత్రిస్తే అనేక లక్షల శూలాలు, గదలూ, సర్పాల్లాంటి బాణాలు ఒక్కసారిగా పుట్టుకొస్తాయి. ఈ పాశుపతానికి అసాధ్యమైన దేదీ యీ ప్రపంచంలో లేదు. త్వరలోనే నీకు మరికొన్ని దివ్యాస్త్రాలు లభిస్తాయి'' అంటూ శివపార్వతులు తమ నిజస్వరూపాలు చూపించి, అర్జునుణ్ణి ఆశీర్వదించారు. తాను ధన్యుడినయ్యానని భావించాడు అర్జునుడు. అప్పుడు శివుడు "నువ్వు ఇంద్రుణ్ణికూడా దర్శించి, ఆయన ఆశీస్సులు కూడా పొందు'' అంటూ పార్వతీదేవితోసహా అంతర్ధానమయ్యాడు.



Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

ఇంద్రుని నగరంలో అర్జునుడు

తరువాత అర్జునుడు ఇంద్రుణ్ణి స్మరించాడు. క్షణంలో అతడిముందు ఒక దివ్యరథం ప్రత్యక్షమైంది. అది ఇంద్రుని రథం. దాని సారథి మాతలి. ''అర్జునా! నీ తండ్రి దేవేంద్రుడు నీ కోసం యీ రథం పంపాడు. నిన్ను అమరావతికి తీసుకురమ్మన్నాడు'' అన్నాడు మాతలి. అర్జునుడు రథాన్ని అధిరోహించాడు. క్షణాల మీద రథం అమరావతి చేరింది. దేవేంద్రుడు రత్నఖచిత సింహాసనం మీద ఆసీనుడై వున్నాడు. దేవకన్యలు



Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

చామరాలు వీస్తున్నారు. అర్జునుడు తలవంచి తండ్రికి నమస్కరించాడు. ఇంద్రుడు సంతోషంతో కుమారుణ్ణి ఆలింగనం చేసుకున్నాడు. తన సింహాసనం మీద కూర్చోపెట్టుకున్నాడు. అర్జునుడు రెండో ఇంద్రునిలా వెలిగిపోతున్నాడు. గంధర్వులు అర్జునుణ్ణి ప్రశంసిస్తూ గానం చేశారు. మేనక, ఊర్వశి మొదలైన అప్సరసలు నాట్యం చేశారు. ఇంద్రుడి అనతి మేరకు ఐదు సంవత్సరాలు అర్జునుడు అమరావతిలో ఆనందంగా కాలం గడిపాడు. ఈ సమయంలో అనేక దివ్యాస్త్ర ప్రయోగాలు నేర్చుకున్నాడు. చిత్రసేనుని వద్ద నృత్యం, గానం కూడా నేర్చుకున్నాడు.

ఇంద్రలోకంలోని ఊర్వశి అనే అప్సరస అర్జునుణ్ణి మోహించింది. అతడికి తన వలపును ప్రకటించి, తనతో కొంతసమయం గడపమని కోరింది. కాని ఆమెను తల్లిగా భావించిన అర్జునుడు ఆమె కోరికను తిరస్కరించాడు. కాని మోహితురాలైన ఊర్వశి తన కోరిక నెరవేరకపోవడంతో ''నా అభిలాష నిష్ఫలం చేసినందుకు నువ్వు నపుంసకుడివైపో. మానవ లోకంలో మానాభిమానాలు లేకుండా ఆడవాళ్లమధ్య బతుకు'' అంటూ శపించి వెళ్లిపోయింది. ఈ విషయం తెలుసుకున్న ఇంద్రుడు ''మునులుకూడా సాధించలేని మనోనిగ్రహాన్ని నువ్వు చూపించావు. నీలాంటి కుమారులను కన్నతల్లి ధన్యురాలు. శాపానికి వగవకు. మీ అజ్ఞాతవాసకాలంలో యీ శాపం నీకు వరంలా పరిణమిస్తుందిలే'' అన్నాడు.

కొన్నిరోజుల పిమ్మట లోమశమహర్షి లోకసంచారం చేస్తూ ఇంద్రలోకానికి వచ్చాడు. ఇంద్రునితోపాటు సింహాసనం అధిష్ఠించివున్న అర్జునుణ్ణిచూసి అలాంటి ఉన్నతస్థాయికి ఎదగడానికి అతడు ఏఏ పుణ్యకర్మలు చేశాడా అని విస్తుపోయాడు. అప్పుడు దేవేంద్రుడు ''ఈ అర్జును డెవరైనదీ, ఇక్కడికి ఎందుకు వచ్చిందీ అంతా చెబుతాను. ఇతడూ, శ్రీకృష్ణుడూ నరనారాయణులు. నివాతకవచు లనే రాక్షసులు దేవలోకాలని నాశన మొనర్చాలని పథకాలు వేస్తున్నారు. దేవత లందరూ ఏకమైనా వారిని జయించలేరు. కాని అర్జునుడు ఆ అసురులందరినీ తుదముట్టించగలడు. అతడు భూలోకానికి వెళ్లిపోవడానికి ముందు యీ అసురు లందరినీ యుద్ధంలో పరిమారుస్తాడు. మహర్షీ మీరు నాకో కార్యం చేసి పెట్టాలి. ప్రస్తుతం కామ్యకవనంలో వుంటున్న ధర్మరాజు వద్దకెళ్లి అర్జునుని గురించి దిగులు చెందవద్దని నేను చెప్పి పంపినట్లుగా చెప్పండి. అన్ని దివ్యాస్త్రాలనూ అర్జునుడు సంపాదించాడని ఆయనతో చెప్పండి. ధర్మరాజు తన సోదరులతోను, ద్రౌపదితోను తీర్థయాత్రలు చేసి పుణ్యం సంపాదించ వలసిందిగా చెప్పండి'' అన్నాడు.

అర్జునుడు తమ మధ్య లేనందువల్ల ధర్మజుడు దుఃఖించుట

అర్జునుడు ఇంద్రలోకంలో దేవేంద్రుని అతిథిగా ఆనందంగా కాలం గడుపుతున్నప్పుడు పాండవులు కామ్యకవనంలో వున్నారు. అర్జునుడు వారి మధ్య లేకపోవడం వారికి ఎంతో బాధ కలిగిస్తూవుంది. ఆ సమయంలో బహదశ్వు డనే మహర్షి



Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

వారి వద్దకు వచ్చాడు. తన హృదయపరితాపాన్ని ధర్మజుడు ఆయనతో చెప్పుకున్నాడు. ''నే నెంత దురదృష్టవంతుణ్ణో కదా! అర్జునుడి కోసం నా హృదయం పరితపిస్తూ వుంది'' అన్నాడు.

ధర్మజుణ్ణి ఓదార్చడానికి నలదమయంతుల కథ చెప్పాడు మహర్షి. ''నలుడు ఏకాకిగా అడవుల్లో తిరిగాడు. నీ సోదరులు, ద్రౌపది నీ కూడా వున్నారు. దుఃఖించవద్దు. మళ్లీ నిన్ను ఎవరైనా జూదమాడడానికి రమ్మని సవాలు చేస్తారేమో నని భయపడుతున్నావా? అక్షహృదయమనే జూదంలో నేను ఆరితేరినవాణ్ణి. ఆ రహస్యం నీకు నేర్పించి నిన్నుకూడా జూదంలో ఆరితేరినవాణ్ణిగా చేస్తాను'' అంటూ ఆ విద్యను ధర్మరాజుకు నేర్పించి వెళ్లిపోయాడు.

తరువాత ధర్మరాజు, ధౌమ్యమహర్షితో ''అర్జునుని గూర్చిన చింత మమ్మ వేధిస్తూవుంది. మా ఆశలన్నీ అతడి మీదే వున్నాయి. అర్జునుడు కౌరవ సేనలోని గొప్పయోధులంద రినీ ఒక్కుమ్మడిగా ఎదుర్కోగల సమర్థుడు. అతడు దివ్యాస్త్ర సంపన్నుడై తప్పక తిరిగి వస్తాడు. కాని అతడు మా మధ్యలేనంత వరకు యీ కామ్యకవనంలో మాకు మనశ్శాంతి అనేది వుండదు. అందువల్ల మేము దర్శించతగ్గ పుణ్యతీర్థాలనుగూర్చి మీరు తెలుపండి'' అని కోరాడు.

పాండవుల దైన్యతను చూసి ధౌమ్యుడు ''నేను మీకు కొన్ని తీర్థక్షేత్రాల గురించి వివరిస్తాను. వాటిని దర్శించడంవల్ల మీకు ఎంతో పుణ్యం చేకూరుతుంది'' అన్నాడు.

ధౌమ్యుడు పుణ్యక్షేత్రాలను గురించి వివరిస్తూన్నప్పుడు లోమశ మహర్షి అక్కడికి వచ్చాడు. ఆయన ధర్మరాజుతో ''నేను యీ భూమండలమంతా సంచారం చేశాక ఇంద్రుని చూడడానికి ఇంద్రలోకానికి వెళ్లాను. అక్కడ నీ తమ్ముడు అర్జునుణ్ణి చూశాను. అర్జునుడి గురించిన శుభవార్త ఇంద్రుడు నీతో చెప్పమన్నాడు. అర్జునుడు శివుణ్ణి మెప్పించి సాటిలేని పాశుపతాస్త్రం సంపాదించాడు. అంతేగాక సంగీతం, నృత్యం, సామవేదగానం కూడా నేర్చుకున్నాడు. ఇప్పుడు ఇంద్రుడితో ఆనందంగా కాలం గడుపుతున్నాడు. అసురులతో జరుగబోయే యుద్ధంలో దేవతలకు సహాయం చేసి త్వరలో తిరిగి వస్తానని నీతో చెప్పమన్నాడు. ఈలోపు మీరు తీర్థయాత్రలు పూర్తిచేసు కొని రావాలని అతడి అభిలాష. ఇంద్రార్జునుల అభిలాషమేరకు నేను మీతోపాటు తీర్థయాత్రలకు వచ్చి, మీకు రక్షణగా వుంటాను'' అన్నాడు.

అర్జునుడి దిగ్విజయాన్ని విన్న పాండవులు ఎంతో సంతోషించారు. లోమశ మహర్షి ఆధ్వర్యంలో వాళ్లు తీర్థయాత్ర లకు బయలుదేరారు. ఎన్నో పుణ్యనదులలో స్నానమాడి చివరకు ప్రభాస తీర్థం చేరుకున్నారు. ఆ పుణ్యజలాల్లో స్నానాలాచ రించి ధర్మరాజు పితృదేవతలకు తర్పణా లిచ్చాడు. పన్నెండు రోజులు జలంమాత్రం స్వీకరిస్తూ గడిపాడు. తన చుట్టూ మంటలు రగిల్చి, ఆ మంటలమధ్యలో కూర్చుని తీవ్రంగా తపస్సుచెయ్యసాగాడు. ఇలా ధర్మరాజు తీవ్ర తపస్సులో వున్న ప్పుడు బలరామ కృష్ణులు పాండవులను చూడడానికి వచ్చారు. పాండవులు వారిని సంతోషంగా ఆహ్వానించారు. పాండవులు పడుతున్న అవస్థలను చూసి సహించలేక బలరాముడు, సాత్యకి వెంటనే కౌరవులతో యుద్ధంచేసి వారిని తుదముట్టించాలని అభిప్రాయపడ్డారు. అందుకు శ్రీకృష్ణుడు ''నేను మీతో ఏకీభవి స్తున్నాను. కాని తమ స్వశక్తి ద్వారా జయించని రాజ్యం ధర్మజుడు స్వీకరించడు. కీర్తిప్రతిష్ఠలకోసం అతడు ధర్మాన్ని త్యజించడు. ధర్మజుడు సమ్మతిస్తే మనమందరం ఏకమై కౌర వులను జయిద్దాం'' అన్నాడు. వారి సంభాషణ విన్న ధర్మజుడు ''మీరు ఇలా మాట్లాడటంలో ఆశ్చర్యం లేదు. నాకు సత్యవ్రతప రిపాలనే అన్నిటికన్న మిన్నయైనది'' అన్నాడు. ధర్మజుడి అకుంఠిత సత్యవ్రతదీక్షను అభినందిస్తూ బలరామ కృష్ణులు వారివద్ద సెలవు తీసుకుని వెళ్లిపోయారు.



Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

గంధమాదన పర్వతాలకు పాండవుల రాక

లోమశ మహర్షి వెంట పాండవులు గంధమాదన పర్వతాల వైపు ప్రయాణం సాగించారు. కందమూలాలు మాత్రమే స్వీకరిస్తూ కరుకురాళ్లతో నిండిన ఎగుడు దిగుడు ప్రాంతాలను శ్రమతో దాటుకుంటూ పలువిధ జంతుజాలాన్ని చూస్తూ నడకసాగించారు. చివరకు వాళ్లు గంధమాదనం చేరుకున్నారు. ఇది గంధర్వులకు, కిన్నరులకు, సిద్ధులకు, ఋషులకు ఎంతో ఇష్టమైన ప్రాంతము.

గంధమాదన పర్వతాన్ని సమీపిస్తున్నప్పుడు పెనుగాలి వీచసాగింది. భూమీ ఆకాశమూ ఏకంచేస్తూ గొప్పధూళి రేగింది. పెద్దపెద్ద చెట్లు నేల కూలుతున్నాయి. ధూళి దుమారంలో ఎటు వెళ్లాలో తెలియరావడం లేదు. భీముడూ ద్రౌపది ఒక మహావృక్షం క్రింద తలదాచుకున్నారు. ధర్మజుడు, ధౌమ్యుడు దట్టమైన చెట్ల క్రింద నిలబడ్డారు. సహదేవుడు ఒక మహాశిల క్రింద తలదాచుకున్నాడు. లోమశుడు, నకులుడు మొదలైనవారు ఒక చెట్టు నీడన అప్రమత్తతతో నిలబడ్డారు. పెనుగాలి వీస్తూనే వుంది. అంతలో పెద్ద వడగళ్లవాన ప్రారంభమైంది. బ్రహ్మాండమైన వర్షం. అలా ఎంతోసేపు అదే మోతగా గాలీవానా కురిసి చివరకు ఆగింది. తర్వాత అందరూ ఒకచోట చేరి తమ ప్రయాణం సాగించారు.

గరుకురాళ్లతో ఇరుకుగా వుంది దారి. పాపం, ద్రౌపది నడవలేకపోతోంది. మూర్ఛపోయింది. వెంటనే భీముడు ఆమెను ఎత్తి పట్టుకున్నాడు. ధర్మజుడు ద్రౌపది పడే అవస్థలను చూసి దుఃఖించసాగాడు. ధౌమ్యుడు మొదలైన బ్రాహ్మణులు ధర్మరాజును అనునయించారు. అంతలో భీముడు మొదలైన వారు చేసిన శైత్యోపచారాలతో ద్రౌపది మూర్ఛనుండి తేరుకుంది. ధర్మజుడు ఆమె దగ్గర కూర్చుని ఆమెను ఓదార్చాడు. తరువాత భీముడితో ''తమ్ముడూ, రాళ్లూ రప్పలతో యీ దారి దుస్సహంగా వుంది. ఇక ద్రౌపది నడవలేదు'' అన్నాడు.

అప్పుడు భీముడు ''చింతించకండి! ద్రౌపదిని, మిమ్ములను నా భుజాలమీద ఎక్కించుకొని తీసుకువెళతాను. లేదా మీరు అనుమతిస్తే ఘటోత్కచుణ్ణి పిలిపించి మనల నందరినీ సురక్షితంగాతీసుకువెళ్లమంటాను'' అన్నాడు. అందుకు ధర్మరాజు సమ్మతించాడు.

ఘటోత్కచుణ్ణి తలచుకోగానే అతడు ఎదుట ప్రత్యక్షమైనాడు. తండ్రులకు పాదాభివందనం చేసి, భీముని ముందు



Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

చేతులు జోడించి నిలబడి 'తండ్రీ! ఏమి నీ ఆజ్ఞ?'' అన్నాడు. భీముడు కొడుకును కౌగిలించుకున్నాడు. తండ్రి ఆనతిపై పాండవులను, ద్రౌపదిని, ధౌమ్యుని తాను ఎత్తుకున్నాడు. మిగిలిన బ్రాహ్మణులకు తన సైన్యాన్ని నియోగించాడు. ఇలా అందరూ ఆకాశమార్గంగా మనోరంజకమైన నరనారాయణాశ్రమాన్ని చేరుకున్నారు. అక్కడ ఎంతోమంది ఋషులు ప్రశాంతంగా తపస్సు చేసుకుంటున్నారు. అక్కడివారికి ఆకలి దప్పులుండవు; శీతోష్ణాలుండవు. ఎలాంటి క్లేశాలు కలుగవు. వేదపారాయణంలో మునిగివున్న అక్కడి ఋషులు తమ దివ్యశక్తితో పాండవులు అక్కడికి రానున్న విషయం తెలుసుకున్నారు. వనమంతా రేగుచెట్లతో రమ్యంగా వుంది. మెలికలు మెలికలుగా వున్నాయి కొమ్మలు. అక్కడ ఎప్పుడూ చల్లగా, నీడగా వుంటుంది. అదంతా చూసి పాండవులు ఆశ్చర్యపోయారు. అర్జునుని రాక కోసం ఎదురుచూస్తూ వాళ్లు అక్కడే ఆరురోజులు సంతోషంగా గడిపారు.

భీముడు హనుమంతుని కలుసుకొనుట

ఒకనాడు భీముడు, ద్రౌపది గంధమాదన పర్వతసానువులలో విహరిస్తున్నప్పుడు ఒక సౌంగధికాపుష్పం గాలిలో ఎగురుకుంటూ వచ్చి వాళ్లముందు పడింది. వెయ్యి రేకులతో ఎంతో మృదువుగాను, అందంగాను వున్న ఆ పద్మాన్ని చూసి ''ఒక్క పుష్పమే మనస్సును యిలా ఆకర్షిస్తూవుంటే మరిన్ని అయితే ఎంత బాగుంటుందో! దగ్గరలో వుంటే మాత్రం తెచ్చిపెట్టాలి'' అంది ద్రౌపది.

భార్య కోరిక తీర్చడానికి వాయువేగంగా బయలుదేరాడు భీముడు. పెద్దగా సింహనాదం చేశాడు. ఆ గర్జనకు అడవిలోని మృగాలన్నీ భయపడి పారిపోసాగాయి.

ఆ దగ్గరలోనే ఒక గుహలో హనుమంతుడు నిద్రపోతున్నాడు. భీముని సింహనాదం విని లేచాడు. తన తోకను గాలిలో కెత్తి నేల మీద బాదాడు. ఆ భీకర శబ్దానికి కొండగుహలు ప్రతిధ్వనించాయి. భీముణ్ణి తన తమ్ముడిగా గుర్తించి హనుమంతుడు అతడికి ఏ ఆపదా కలుగకుండా హెచ్చరించాలనుకున్నాడు. అరటితోట దారిమధ్యలో ఒక పెద్ద బండమీద పడుకున్నాడు హనుమంతుడు. అతని పొడవైన తోక దారికి అడ్డంగా పడివుంది. ఒక పెద్దకోతి తన దారికడ్డంగా పడుకుని వుండటం చూసిన భీముడు దాని దగ్గరకెళ్లి పెద్దగా సింహనాదం చేశాడు.



Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

హనుమంతుడు మెల్లగా కన్నులు తెరచి నిర్లక్ష్యంగా భీముని చూస్తూ ''ముసలివాణ్ణి! జబ్బుగా వున్నవాణ్ణి! నా మానాన నేను నిద్రపోతూవుంటే నన్ను యిలా లేవగొడతావేం? ఆమాత్రం జాలికూడా నీకు లేదా? నువ్వెవరివో, ఎందుకొచ్చావో ముందుగా చెప్పు. ఇక్కడినుండి ఇక ముందుకు వెళ్లటం దుస్సాధ్యం. ఎలాగూ రానే వచ్చావు కాబట్టి కొంత సేద తీర్చుకుని తిరిగి వెళ్లిపో'' అన్నాడు. ఆ మాటలకు భీముడు ''నేను వాయుపుత్రుడైన భీముణ్ణి. నువ్వు సామాన్యమైన కోతిలా కనబడటం లేదు. నువ్వేదో రాక్షసుడవైవుండి యిలాంటి వేషం ధరించి వుంటావు'' అన్నాడు. ''నువ్వు ముందుకు వెళ్లడానికి

Vidyabharati ... Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

నేను అనుమతించను. తిరిగి వెళ్లిపోవడమే నీకు శ్రేయస్కరం" అన్నాడు ఆంజనేయుడు. ''ఓ మర్కటమా! మర్యాదగా నాకు దారి యివ్వు. లేకపోతే తగిన శాస్తి జరుగుతుంది'' అన్నాడు భీముడు.

ఆ మాటలకు హనుమంతుడు ''నాయనా! చాలా జబ్బులో వున్నాను. లేవలేను. నువ్వు ముందుకే వెళ్లాలని నిశ్చయించుకుంటే నన్ను దాటుకుంటూ వెళ్లిపో'' అన్నాడు.

''దాటి వెళ్లడమా? అందరి శరీరాల్లోను పరమాత్మ వుంటున్నాడు. ఆయన్ను అవమానించలేను. లేకపోతే హనుమంతుడు సముద్రం దాటినట్లు నిన్ను దాటి వెళ్లిపోయేవాణ్ణే!'' అన్నాడు దర్పంగా భీముడు.

''హనుమంతుడా? ఆయ నెవరు?''

''ఆయన నా అన్నగారు. మహా బలశాలి. జ్ఞానులలో అగ్రగణ్యుడు. సకల సద్గుణోపేతుడు. నేను కూడా ఆయనంతటి బలశాలినే. అందుకే నా దారికి అడ్డం తొలగు. లేకపోతే నా చేతులలో నీకు మరణం తప్పదు'' అన్నాడు భీముడు.

భీముణ్ణి యింకా కాస్త విసిగించాలని ''ఓ అలాగా! సరే, నేను ముసలివాణ్ణి, లేవలేను. నా తోకను కొంచెం పక్కకు నెట్టి నీ దారిన నువ్వు వెళ్లిపో నాయనా'' అన్నాడు హనుమంతుడు.

భీముడు నిర్లక్ష్యంగా ఎడమచేత్తో తోకను ఎత్తబోయాడు. వల్లకాలేదు. లాభంలేదని రెండు చేతులతో తోకను ఎత్త ప్రయత్నించాడు. ఊహు, కుదరలేదు. బలాన్నంతా కేంద్రీకరించి ప్రయత్నించాడు. మోకరించి పడిపోయాడు. ఒళ్లంతా ముచ్చెమటలు పోసింది. ఎందుకూ చేతకాని వాడిలా, సిగ్గుపడిపోయాడు. రెండు చేతులూ జోడించి నమస్కరిస్తూ ''అయ్యా! నిన్ను తెలుసుకోకుండా దుర్భాషలాడాను. నన్ను క్షమించి నీ నిజ రూపం చూపించు'' అంటూ ప్రార్థించాడు.

హనుమంతుడు తన నిజస్వరూపాన్ని చూపించాడు. ''తమ్ముడూ, నేనే హనుమంతుణ్ణి. శ్రీరాముని కీర్తి ఎంతవరకు యీ భూలోకంలో నెలకొని వుంటుందో అంతవరకు నన్ను జీవించి వుండమని శ్రీరాములవారు నాకు వరం ప్రసాదించారు. శ్రీరామనామం సదా వినడం, జపించడమే నా ధ్యేయం. అదే నా జీవితం. ఈ మార్గంలో మానవమాత్రులు వెళ్లలేరు. అన్యులెవరూ నిన్ను శపించరాదనీ, ఒడించరాదనీ నిన్ను నేను ఆపాను. నువ్వు వెదుకుతున్న కొలను ఆ దిశలో వున్నది'' అన్నాడు హనుమంతుడు.

''అన్నా! నీ దర్శనంవల్ల నేను కృతార్థుడినయ్యాను'' అంటూ భీముడు, హనుమంతుడికి పాదాభివందనం చేశాడు. ''సముద్రం దాటినప్పుడు నువ్వు ధరించిన మహోన్నతరూపాన్ని చూడాలనే కోరిక నాకు చాలాకాలంనుండి వున్నది. దయచేసి నాకా రూపాన్ని చూపించు'' అంటూ ప్రార్థించాడు.

భీముడి వినయానికి ముచ్చటపడి ఆంజనేయుడు తాను సముద్ర లంఘనం చేసినప్పటి రూపాన్ని చూపించాడు. ఆతడి శరీరం మేరుపర్వతం లాగా పెరిగిపోయింది. దిక్కులను తాకేంత పొడవైనది తోక. మహోన్నతము, అద్భుతము అయిన ఆ విశ్వరూపాన్ని చూసి భీముడు పాదాభివందనం చేశాడు. అటు పిమ్మట హనుమంతుడు తన మామూలు స్వరూపం స్వీకరించి, భీముడితో కుశలప్రశ్నలతో కొంతసేపు ముచ్చటించాడు. భీముడు సెలవు తీసుకొనేటప్పుడు హనుమంతుడు తమ్ముణ్ణి గాఢంగా కౌగలించుకున్నాడు. ఆ స్పర్శతో అంతవరకు భీముడు పడ్డ శ్రమంతా తొలగిపోయి, నూతన బలం కలిగింది. ''తమ్ముడూ! నేను ఇక్కడ వున్న విషయం ఎవరికీ చెప్పవద్దు. నీకొక వరం ప్రసాదిస్తాను. నువ్వు కోరుకుంటే నేనిప్పుడే హస్తినాపురానికి వెళ్లి ఆ కౌరవులనందర్నీ సర్వనాశనం చేస్తాను. ఆ నగరాన్ని పిండి పిప్పిగా చేస్తాను. లేదా దుర్యోధనుని కాళ్లు చేతులుకట్టి తీసుకు వస్తాను'' అన్నాడు హనుమ. ''అన్నా! జగదేకవీరుడివైన నీకు ఇదో లెక్కా? నీ కృపాకటాక్షంతో మేము నిశ్చయంగా వాళ్లను పరిమారుస్తాం'' అన్నాడు భీముడు.

''మంచిది. అతిరథుడైన అర్జునుడి రథం పతాకంమీద నుండి మీ యుద్ధాన్నంతా చూస్తూ మిమ్ము ఉత్సాహపూరితుల్ని చేస్తూ వుంటాను'' అంటూ సౌగంధికా సరోవరానికి దారి చూపిస్తూ, జాగ్రత్తగా వుండమని భీముణ్ణి హెచ్చరిస్తూ, హనుమంతుడు అంతర్ధానమయ్యాడు.

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

భీముడు సౌంగంధికా పుష్పాలను ద్రౌపది కిచ్చుట

ఆంజనేయుణ్ణి కలుసుకున్న ఆనందంతో భీముడు వేగంగా సౌగంధిక సరోవరంవైపు నడిచాడు. అలా వెళుతూ ఒక వెండికొండ సమీపంలో ఒక అందమైన ప్రదేశాన్ని చూశాడు. అది కుబేరుడి ఉద్యానవనం. అందలి సరోవరంలో వేలకొలది సౌగంధికాపుష్పాలు వికసించి వుండడాన్ని భీముడు చూశాడు. అనేకమంది యక్షులు ఆ సరోవరాన్ని కావలికాస్తున్నారు. వాళ్లు భీముణ్ణి చూడగానే ''ఎవరు నువ్వు? ఇందులో ప్రవేశించడానికి నీ కెంత ధైర్యం?'' అన్నారు. ''నన్ను భీము డంటారు'' ధీమాగా అన్నాడు. ''ధర్మరాజు తమ్ముణ్ణి. మా ద్రౌపదికోసం యీ పద్మాలు తీసుకు వెళ్లాలని వచ్చాను'' అన్నాడు. కుబేరుని అనుజ్ఞలేనిదే యీ పద్మాలు తీసుకోడానికి అనుమతించము

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

న్నారు యక్షులు. అందుకు భీముడు ''సుక్షత్రియులమైన మేము ఒకరివద్ద ఏదీ యాచించం. కొండవాగులవల్ల రూపొందిన సరోవరం యిది. అందరికీ అందుబాటులో వుండాల్సిందే. కుబేరుడు దీన్ని త్రవ్వించనప్పుడు ఇది అతని కెలా స్వంతమవుతుంది? అందువల్ల నన్ను ఎవ్వరూ అడ్డగించలేరు'' అంటూ పద్మాలకోసం ముందు కెళ్లాడు. యక్షులు మహాకోపంతో వివిధాయుధాలు తీసుకొని భీమునిపై కలియబడ్డారు. భీముడు ప్రచండ కోపంతో తన మీదికి వచ్చిన వారినందరినీ చావబాదాడు భయభీతులైన యక్షులు ముందూ వెనుకా చూడకుండా పరిగెత్తారు. కొందరు వెళ్లి కుబేరునితో విషయం చెప్పారు. అంతా విన్న కుబేరుడు నవ్వుతూ ''భీముడు మన స్నేహితుడే. అతడికి కావలసినన్ని పద్మాలను కోసుకోనివ్వండి. ఆతడితో పోట్లాడవద్దు'' అన్నాడు. భీముడు తనకు కావలసినన్ని సౌగంధికా పుష్పాలను తీసుకొని బయలుదేరాడు.

భీముడు ఇక్కడ యక్షులతో పోరాడుతుంటే అక్కడ బదరీవనంలో మబ్బులులేకుండా పిడుగులు పడ్డాయి. కొండలు చలించాయి. ఈ దుర్నిమిత్తాలకు భయపడి ధర్మజుడు ఘటోత్కచుణ్ణి పిలిచి, అతడి భుజాలమీద ఎక్కి తమ్ములతో భీముణ్ణి వెదుక్కుంటూ సౌగంధికావనానికి వచ్చాడు. అక్కడ సరోవరం వద్ద తన చేతులనిండా సౌగంధిక పుష్పాలతో ఆనందంగా కూర్చుని వున్న భీముణ్ణి చూశారు. అతడి చుట్టూ అనేకమంది యక్షులు చచ్చి పడివుండటం చూసిన ధర్మజుడు ''ఇదిగో తమ్ముడూ, నిజంగా నా మీద నీకు ప్రేమ వుంటే ఇకముందు ఇలాంటి పనుల జోలికిపోవద్దు'' అని హితం బోధించాడు. అంతలో కుబేరుడు అక్కడికి వచ్చాడు. ఆయన కోరికమేర పాండవులు అక్కడ కొంతకాలం గడిపారు. ధర్మజుడు ఉత్తర దిక్కుకేసి తమ యాత్ర కొనసాగిస్తామని భీమునితో చర్చిస్తుండగా అశరీరవాణి యిలా పలికింది: ''ఇకముందుకు వెళ్లకండి. నరనారాయణ ఆశ్రమానికి తిరిగి వెళ్లండి. త్వరలోనే మిమ్మల్ని అర్జునుడు కలుసుకుంటాడు.'' ఆ ప్రకారమే వాళ్లు నరనారాయణ ఆశ్రమానికి తిరిగి వచ్చేశారు.

ఇలా వుండగా ఒకరోజు జటాసురు డనే రాక్షసుడు బ్రాహ్మణ వేషం ధరించి వచ్చి, భీముడు లేని సమయం కనిపెట్టి ధర్మజుని ద్రౌపదిని, నకుల సహదేవుల్ని, ఎత్తుకుని ఆకాశమార్గంలో పారిపోసాగాడు. వాడి పట్టునుండి ఎలాగో తప్పించుకున్న సహదేవుడు భీముని కోసం ఎలుగెత్తి పిలువసాగాడు. ''దురాత్మా! మాయతో మమ్మల్ని మోసం చేశావు. ధర్మాన్నే తలక్రిందులు చేశావు. యక్షులతో సహా అందరూ ధర్మబద్ధులే'' అన్నాడు ధర్మజుడు, రాక్షసుడితో.

అంతలో గాలిలా దూసుకుంటూ వచ్చాడు భీముడు. జటాసురుడితో యుద్ధానికి దిగాడు. భయంకరంగా సాగింది వారి మధ్య యుద్ధం. వారి తాకిడికి మహావృక్షాలు నేలకూలాయి;



Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

భూమి కంపించింది. చివరకు జటాసురుడి బలం తగ్గుముఖం పట్టింది. వాడి మెడ కుంగిపోయేట్లు ఒక్క పిడిగుద్దు గుద్దాడు. పెద్ద పిడుగు పడితే విరిగిపడే నల్లటి కొండ శిఖరంలా క్రింద పడిపోయాడు జటాసురుడు. పడీపడగానే వాడి కళేబరాన్ని పైకెత్తి పెద్దబండరాయి మీద విసిరికొట్టాడు. జటాసురుడి శరీరం నుగ్గునుగ్గయింది. ఈ విధంగా భీముడు ఆ రాక్షసుడి బారినుండి తన సోదరులను, ద్రౌపదిని కాపాడాడు.



S... yabharathi Book Centre, ...

CC-O. In Public Domain. Digitized by eGangotri

అర్జునుడు తిరిగి వచ్చుట

ఇలా పాండవులు ఐదు సంవత్సరాల కాలం వనవాసం చేస్తూ గడిపారు. కందమూలాలు తింటూ, లోమశమహర్షి వినిపించే గాథలను వింటూ కాలం వెళ్లబుచ్చుతూ, అర్జునుడి రాకకోసం ఎదురుచూడసాగారు. ఒకనాడు ఆకాశంలో అకస్మాత్తుగా వెయ్యి మెరుపులతో పెద్ద వెలుగు కనబడింది. చూస్తూ వుండగానే ఒక బంగారు రథం దేవలోకం నుండి గంధమాదనం మీద దిగింది. మాతలి రథం నడుపుతున్నాడు. రథం మీద అర్జునుడు సూర్యునిలా ప్రకాశిస్తున్నాడు. అర్జునుడు రథం దిగి ధర్మజ, భీములకు ప్రణమిల్లాడు. నకుల సహదేవులు, అర్జునుడికి నమస్కరించారు. అందరూ మహానందభరితులయ్యారు. అర్జునుడి చుట్టూ అంతా కూర్చున్నారు. అంతలో వెలుపల ఒక్కపెట్టున దేవదుందుభులు మ్రోగాయి. తీరా చూసేసరికి దేవగణాలతో దేవేంద్రుడు పాండవులను చూడడాని కొస్తున్నాడు. పాండవులు ఆయనను ఎంతో ఆదరంగా ఆహ్వానించారు. వారి నందరిని అభినందించి ''ధర్మజా! నీ తమ్ముడు దివ్యాస్త్రాలు సంపాదించాడు. మీ కష్టాలన్నీ తీరిపోతాయి. ఇక శత్రువులను చూసి భయపడాల్సిన పనిలేదు. అర్జునుడు తిరిగి వచ్చేశాడు కాబట్టి ఇక మీరు కామ్యకవనానికి వెళ్లిపోవచ్చు. అర్జునుడు నాచేత దివ్యాస్త్ర ప్రయోగాల్లో ఆరితేరాడు. శివుణ్ణి మెప్పించి పాశుపతం సంపాదించాడు. ఈ ముల్లోకాల్లోను అతణ్ణి జయించే వీరుడు లేడు'' అంటూ వారినందరినీ సంతోషపరుస్తూ వెళ్లిపోయాడు దేవేంద్రుడు.

ఇంద్రుడు వెళ్లిపోయిన పిమ్మట పాండవు లందరూ అర్జునుడి చుట్టూకూర్చుని అతడి అనుభవాలు వివరించమన్నారు. అర్జునుడు యిలా చెప్పసాగాడు: ''ఇంద్రలోకంలో నేను ఎంతో ఆనందంగా వున్నాను. ఒకరోజు అమరేంద్రుడు నాతో 'నువ్వు నాకో సహాయం చెయ్యాలి. సముద్రగర్భంలో నివాతకవచులనే మూడు కోట్లమంది రాక్షసులున్నారు. వాళ్లెప్పుడూ దేవతలను బాధిస్తూ వుంటారు. వారిని నువ్వు పరిమార్చాలి' అన్నాడు. ఇదిగో యీ రత్నాల కిరీటం నా తలమీదవుంచి 'ఈ రోజునుండి యీ కిరీటం వల్ల నీకు 'కిరీటి' అని పేరుకలుగుతుంది' అన్నాడు. ఋషులు నన్ను ఆశీర్వదించగా, దేవేంద్రుడు తన రథాన్ని నా కిచ్చి, మాతలిని సారథ్యం చెయ్యమన్నాడు. నేను ఆ రాక్షసులను నిర్జించడానికి బయలుదేరాను. సముద్రగర్భాని కెళ్లి పెద్దపెద్ద సౌధాలతోను, విశాలమైన వీధులతోనూ వున్న రాక్షసనగరాన్ని చూశాము. ఆ నగరద్వారం వద్ద ఆగి, నేను దేవదత్తం పూరించాను. ఆ శంఖారావం వింటూనే యావన్మంది రాక్షసులూ వివిధాయుధాలతో పరుగెత్తుకొచ్చారు. మాయా యుద్ధంలో ఆరితేరిన ఆ రాక్షసులు నాతో మాయాయుద్ధానికి తలపడ్డారు. రాక్షసమాయలను పటాపంచలు చెయ్యడానికి నేను ఎన్నో దివ్యాస్త్రాలు ప్రయోగించి చివరకు 'మోహిని' అస్త్రం ప్రయోగించి. వారి మాయలనన్నీ వమ్ముచేశాను. పిమ్మట వారు నాతో ప్రత్యక్షంగా యుద్ధానికి తలపడ్డారు. గాండీవం విరామం లేకుండా పనిచేసింది. బాణాల జడివాన కురిపించాను. కొండలు పడినట్లు చచ్చి కుప్పలుగా పడ్డారు



Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

నివాతకవచులు. కన్నుమూసి కన్ను తెరచేలోపల వందలూ వేలూ పడుతూ వుంటే భూమి గడగడలాడిపోయింది. చివరకు అంతనుందీ హతమైపోయారు. మాతలి నన్నెంతో ప్రశంసిస్తూ 'ఇలాంటి యోధుణ్ణి నే నింతవరకు చూడనేలేదు' అన్నాడు.

నివాతకవచులను హతమార్చిన పిమ్మట వారి నగరాన్ని చూడడానికి వెళ్ళాము. ఆ నగరం ఎంతో రమ్యంగా వుంది. 'ఈ నగరం ఒకప్పుడు ఇంద్రుడిది. కాని నివాతకవచులు తపస్సుచేసి బ్రహ్మను మెప్పించి ఈ నగరాన్ని తను పరం చేసుకున్నారు' అన్నాడు మాతలి.

మేము తిరిగి వస్తున్నప్పుడు దారిలో ఒక విచిత్రమైన పట్టణం కనిపించింది. అది గాలిలో తేలే హిరణ్యపురం. పూర్వం పులోమా అనే రాక్షసస్త్రీ బ్రహ్మను గురించి తపస్సుచేసి తన కుమారులైన కాలకేయులు దేవతలద్వారా చావకూడదనీ, వారి కోసం అందమైన బంగారునగరం ప్రసాదించమనీ కోరుకుంది. వాళ్లతో యుద్ధం చెయ్యమని మాతలి నన్ను ప్రోత్సహించాడు. వారిని యుద్ధానికి పిలిచాను. అరవైవేల మంది కాలకేయులు ఒక్కసారిగా నా మీదికి విరుచుకుపడ్డారు. వారితో పోరాడటం దుస్సాహమనిపించింది. చివరకు పరమేశ్వరప్రసాదమైన పాశుపతాస్త్రం ప్రయోగించాను. అమోఘమైన ఆ దివ్యాస్త్రప్రభావం వల్ల అరవైవేలమంది కాలకేయులు క్షణమాత్రంలో హతమైపోయారు.

అటుపిమ్మట అమరావతికి తిరిగివచ్చి దేవేంద్రునితో కొంతకాలం ఆనందంగా గడిపాను. కాని మిమ్మల్ని చూడాలనే 'గాఢ తపన నాలో వుండిపోయింది. మీ సాంగత్యంతో ఆ దేవలోక సుఖాలు తులతూగలేవు. ఇప్పుడు నేను ఎంతో ఆనందంగా వున్నాను.''

''మన శ్రమ ఫలించింది. మనం కృతార్థుల మయ్యాము. ఏవీ నీకు ఇంద్రుడు ప్రసాదించిన దివ్యాస్త్రాలు మాకు చూపించు'' అన్నాడు ధర్మరాజు.

అర్జునుడు ప్రతిఒక్క దివ్యాస్త్రాన్నీ తీసి అందరికీ చూపించాడు. తరువాత వాటిని ప్రయోగించి చూపడానికి పూనుకున్నాడు. అతడలా సిద్ధపడే సరికి భూమండలం కంపించిపోయింది. సముద్రాలు అల్లకల్లోలమైపోయాయి. సూర్యబింబం మాసిపోయింది. సుడిగాలులు వీచాయి. జంతుజాలమంతా భీతిల్లింది. మెరుపులా వచ్చాడు నారదుడు. ''అర్జునా! ఆగు! ఎదుట శత్రువు లేకుండా యీ అస్త్రాలను ప్రయోగించటం ఘోరం. ఇవి అమోఘమైన శక్తి గలవి. ఉత్తినే ప్రయోగిస్తే ముల్లోకాలనీ నాశనం చేస్తాయి'' అని వారించాడు. అంతటితో అర్జునుడు ఆ ప్రయత్నం విరమించాడు. నారదుడు తనదారిన వెళ్లిపోయాడు.



Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

భీముణ్ణి కొండచిలువ పట్టుకొనుట

పదిరోజులు అక్కడ గడిపాక లోమశమహర్షి, అరిష్టసేన మహర్షి సలహాల మేరకు ముందుకు బయలుదేరారు పాండవులు. హిమాలయ మహారణ్యాలలో భీముడు ఒకరోజు వేటకు వెళ్లి యిటూ అటూ తిరుగుతుండగా హఠాత్తుగా ఒక కొండ చిలువను చూశాడు. తనకేమైనదీ తెలుసుకోకముందే అది భీముణ్ణి పట్టుకుని, అతణ్ణి వెనకేసి చుట్టేసింది. ఆ మహాసర్పం అతణ్ణి చుట్టుకోగానే అతడు సర్వశక్తులూ కోల్పోయాడు. ఇంత మహాబలం యీ కొండచిలువకు ఎలా వచ్చిందో ఆశ్చర్యపోతూ "నువ్వెవరు? నేను భీముణ్ణి. వెయ్యి ఏనుగుల బలం కలవాడిని. అలాంటి నన్ను ఎలా పట్టుకోగలిగావు?" అని అడిగాడు.

తన పట్టును సడలించకుండా ఆ కొండచిలువ యిలా చెప్పింది: "చాలాకాలంగా నేను ఆకలితో వున్నాను. నా అదృష్టం

Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

కొద్దీ నువ్వు దొరికావు. ఇక నా కథ అంటావా! అదొక పెద్ద ఉదంతం. నేను నహుషు డనే చక్రవర్తిని. మీ పూర్వీకులకు పూర్వుణ్ణి. ఇంద్రుడితో సమానమైనవాడిని. ఐశ్వర్యంవల్ల మదించి అగస్త్యమహర్షిని అవమానించాను. ఆయన మండిపడి నన్ను కొండచిలువగా పడివుండమని శపించాడు. ఆయన శాపంతో ఇంద్రపదవి వదలి క్రిందపడిపోతూ శాపవిమోచనం చెప్పమన్నాను. ఆయన కరుణించి 'నువ్వు భూలోకంలో చాలా కాలం పడివుంటావు. ఒకనాడు నువ్వు అడిగే ప్రశ్న లన్నిటికీ జవాబు చెప్పే మహాత్ముణ్ణి కలుసుకుంటావు. అప్పుడు నీకు శాపవిమోచనం కలుగుతుంది' అన్నాడు.''

కొండచిలువరూపంలోని నహుషుడితో అప్పుడు భీముడు ఇలా అన్నాడు: ''నేను నిన్ను కోపగించుకోవడం లేదు. విధిని ఎవరూ తప్పించుకోలేరు. నా సంగతే చూడు. మహాబలవంతుడినైన నేను నీకు చిక్కిపోయి, యీ అవస్థకు వచ్చాను. నా చావును గురించి విచారించడం లేదు. రాజ్యం పోగొట్టుకుని ఘోరమైన యీ 'కారడవుల్లో ఆకులలములు తింటూ, తిరుగుతున్నారు నా అన్నదమ్ములు. నన్ను చూడక ఎంత దుఃఖిస్తున్నారో అని మాత్రం విచారిస్తున్నాను.''

అక్కడ ధర్మజుడికి ఎన్నో దుర్నిమిత్తాలు కనబడ్డాయి. భీముడు కనిపించకపోవడం చూసి అతణ్ణి వెతుక్కుంటూ వెళ్లాడు. భీముడి అడుగుజాడలు చూసుకుంటూ వెళ్లి, అతణ్ణి ఒక కొండచిలువ పట్టుకుని వుండటం చూసి నిశ్చేష్టుడయ్యాడు ధర్మజుడు. ''తమ్ముడూ! ఏమిటీ వైపరీత్యం! ఈ పెనుబాము నిన్ను ఎలా పట్టుకుంది'' అని ప్రశ్నించి, జరిగిన దంతా తెలుసుకున్నాడు.

అప్పుడు ధర్మజుడు ''ఓ సర్పరాజా! నా తమ్ముణ్ణి విడిచిపెట్టు. నీకు కావలసినంత ఆహారం నేను సమకూర్చి పెడతాను'' అన్నాడు.

అందుకా కొండచిలువ ''నీ తమ్ముడే నాకు ఆహారం. నువ్వు ఇక్కణ్ణుండి వెళ్లిపో. లేకపోతే నిన్నుకూడా పట్టుకుని రేపటికి నా ఆహారంగా చేసుకుంటాను. నేనడిగే ప్రశ్నలకు నువ్వు బదులు చెబితే నీ తమ్ముణ్ణి విడిచిపెడతాను'' అన్నది.

''నీ ప్రశ్న లేమిటో అడుగు. బదులు చెప్పడానికి ప్రయత్నిస్తాను'' అన్నాడు ధర్మజుడు.

కొండచిలువ ప్రశ్న లడగసాగింది:

''ఎవడు బ్రాహ్మణుడు?''

''సత్యమూ, దయా, దానమూ, క్షమా, సత్ప్రవర్తనా, అహింసా, తపస్సూ ఎవడిలో వుంటే వాడే బ్రాహ్మణుడు.''

''ఈ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ తెలుసుకోదగిన దేది?''

''సుఖదుఃఖాలకు అతీతమైనదీ, తెలుసుకున్న తర్వాత కలగనీయనిదీ అయిన పరబ్రహ్మమే తెలుసుకో తగింది.''

ఆ కొండచిలువ రూపంలోని నహుషుడు యిలా వర్ణాశ్రమ ధర్మాలను గురించి, ధర్మం గురించి ఎన్నో ప్రశ్నలు వేశాడు. వాటన్నిటికీ ధర్మజుడు సంతృప్తికరంగా సమాధానాలిచ్చాడు. ఆ సమాధానాలు విన్న నహుషుడు ''నువ్వు నా ప్రశ్న లన్నిటికీ తృప్తికరంగా సమాధానా లిచ్చినందువల్ల నేను శాపవిముక్తుడి నవుతున్నాను. నేను గర్వాంధుడినై మహర్షులచేత నా పల్లకీ మోయించాను. ఒకసారి అగస్త్యమహాముని నా పల్లకీ మోస్తున్నప్పుడు ఆయన్ను ఘోరంగా అవమానించాను. ఆయన రుద్రుడై నన్ను శపించాడు.

ఆ శాపకారణంగా నేను కొండచిలువనయ్యాను. శాపవిమోచనం కోరితే ధర్మజుడు వచ్చి నిన్ను శాపంనుండి విముక్తుణ్ణి చేస్తాడని చెప్పాడు. ఇక నీ తమ్ముణ్ణి తీసుకువెళ్లు'' అన్నాడు. చూస్తూ వుండగానే సర్పశరీరం వదలిపెట్టి నహుషుడు దివ్యశరీరంతో స్వర్గానికి వెళ్లిపోయాడు.

శ్రీకృష్ణుని పునరాగమనం

వృషపర్వుని ఆశ్రమంలో సుమారు ఒక సంవత్సరకాలం గడిపి, పాండవులు ద్వైతవనానికి తిరిగి వచ్చారు. అటుపిమ్మట కామ్యకవనానికి వెళ్లిపోయారు. పాండవులు కామ్యకవనంలో సాధుసాంగత్యంలో కాలం గడుపుతున్నప్పుడు సత్యభామతో సహా శ్రీకృష్ణుడు పాండవులను చూడడానికి వచ్చాడు. శ్రీకృష్ణ దర్శనంతో పాండవులు ఎంతో ఆనందించారు. శ్రీకృష్ణుడు ద్రౌపదితో ''సుభద్ర, అభిమన్యులు బాగున్నారు. అభిమన్యుడు విలువిద్యలో తండ్రిని మించేలా వున్నాడు'' అన్నాడు. తరువాత ధర్మజునివైపు తిరిగి ''అంధకులూ, వృష్ణికులూ, భోజులూ, కుకురులూ యావన్మందీ కౌరవులను పరిమార్చడానికి సిద్ధపడుతున్నారు'' అన్నాడు.

CC-O. In Public Domain. Digitized by eGangotri

''నీ శరణుజొచ్చిన మాకు అడ్డేముంటుంది కృష్ణా?'' ఆనందంగా అన్నాడు ధర్మజుడు. ''వనవాసం దాదాపు పూర్తికావస్తూవుంది. ఈ అరణ్యవాసం పూర్తిచేసుకుని, ఆ తరువాత అజ్ఞాతవాసం కూడా పూర్తిగావించుకుని, మాలో ఏ దోషమూ లేకుండా శత్రువులను జయించడానికి పూనుకుంటాము. ఇదంతా నిర్వహించే భారం మాత్రం నీమీదే వుంది.''

ఆ సమయంలో మార్కండేయ మహర్షి పాండవులను చూడడానికి వచ్చాడు. పాండవులకు దేవతల గాథలూ, రాజుల చరిత్రలూ మొదలైనవి వివరించమని కృష్ణుడు, ఆయనను ప్రార్థించాడు. అప్పుడే నారదుడు కూడా అక్కడకు వచ్చాడు. అందరూ మార్కండేయ మహర్షి చుట్టూ కూర్చుని ఆయన వినిపించే గాథలు వినసాగారు. ఆయన వారికి యుగధర్మం గురించీ, మహావిష్ణువు స్వీకరించిన అవతారాలను గురించీ, జ్ఞానం యొక్క ప్రాశస్త్యం గురించీ వివరించాడు. కుమారస్వామి అసురులతో సలిపిన యుద్ధం గురించి కూడా వివరించాడు.

శ్రీకృష్ణుడు, సత్యభామ పాండవులతో కొంతకాలం గడిపి ద్వారకకు వెళ్లిపోయారు.

దుర్యోధనుడి పన్నాగం

అరణ్యంలో పాండవులను చూసివచ్చిన ఒక బ్రాహ్మణుడు ఒకరోజు ధృతరాష్ట్రుని వద్దకు వచ్చాడు. పాండవుల సంక్షేమం గురించి ధృతరాష్ట్రుడు విచారించాడు. పాండవులు అనుభవిస్తున్న కష్టాలను గురించి, భీముడి బలం గురించి, అర్జునుడు శివుణ్ణి మెప్పించి పాశుపతాస్త్రం సంపాదించిన విషయమూ ఆ బ్రాహ్మణుడు తెలిపాడు. అతడు వెళ్లిపోయాక, తాను పాండవులకు ఒనరించిన అన్యాయం గురించి ధృతరాష్ట్రుడు దుఃఖించాడు. కాని దుర్యోధనుడి కది నచ్చలేదు. అతడు కర్ణుడు, శకునులతో తమకు పెద్దబలగం వుందని, పాండవుల పరాక్రమం గురించి భయపడనక్కరలేదని ధృతరాష్ట్రునికి నచ్చచెప్పబోయాడు.

పాండవులకు కీడొనరించాలని దుర్యోధనుడు, శకుని, దుశ్శాసనుడు మరో పన్నాగం పన్నారు.

శకుని వారితో ఇలా అన్నాడు: ''ప్రస్తుతం పాండవులు ద్వైతవనంలోని ఒక సరోవరప్రాంతంలో నివసిస్తున్నారు. తన శత్రువు యొక్క సంపదలను, వైభవాన్ని కన్నులార చూడడం కంటె యీ ప్రపంచంలో బాధాకరమైన మరో విషయం వుండదు. మనం కామ్యక వనానికి ఉల్లాసయాత్రచేసి, కొన్ని రోజులు అక్కడ గడుపుదాము. మనం మన స్త్రీ జనంతో వెళదాం. మన వైభవాన్ని, సంతోషాన్ని చూసి పాండవులు కోపంతోను, అసూయతోను మండిపోతారు.''

ఈ మాటలకు దుర్యోధనుడు ఎంతో సంతృప్తి పొందాడు. కాని సందేహించాడు. ''నువ్వన్నది యథార్థమే. కాని నా తండ్రికి వాళ్లంటే ఇష్టం. అనుమతికోసం ఆయన వద్దకు నేను వెళ్లను. మరో ఆలోచన చేద్దాం'' అన్నాడు దుర్యోధనుడు.

మరునాడు ఉదయం దుర్యోధనుని వద్దకు కర్ణుడు నవ్వు ముఖంతో వచ్చి యిలా అన్నాడు. ''ఈ ఉపాయం ఎలా వుంటుందో చూడు? మన ఆవులమంద ద్వైతవన ప్రాంతంలో మేస్తూవుంది. వాటిని పరిశీలించే మిషమీద మనం అక్కడకు వెళదాం. దీనికి నీ తండ్రి తప్పక సమ్మతిస్తాడు.'' శకుని యీ పథకానికి ఆనందంగా తన సమ్మతాన్ని వెలిబుచ్చాడు. ఆవుల మందను తక్షణమే పరిశీలించాల్సిన ఆవశ్యకతను వివరించడానికి సామంగుడనే ఆవులకాపరిని ధృతరాష్ట్రుని వద్దకు పంపారు.

''అలాగే, మనం పూర్తిగా ఆవుల కాపరుల మీదే ఆధారపడకూడదు. అప్పుడప్పుడు మనం కూడా వెళ్లి ప్రత్యక్షంగా చూసుకోవాలి. కాని పాండవులు ఆ ప్రాంతంలోనే వున్నట్లు నేననుకుంటున్నాను'' అన్నాడు ధృతరాష్ట్రుడు.



Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

ఆ మాటలకు శకుని ''మనం వెళ్లటం పాండవుల నుద్దేశించికాదు. ఏ విధంగానూ వారి ఉనికికి భంగం కలిగించము'' అన్నాడు.

చివరికి ధృతరాష్ట్రుడు అనుమతించాడు. దుర్యోధనుడు పెద్దపరివారంతో బయలుదేరాడు. అతడితో దుశ్శాసనుడు, కర్ణుడు, శకుని; వారి భార్యలతో సహా అనేక మంది స్త్రీ జనం కూడా వున్నారు. పెద్ద సైన్యం కూడా వారి వెంట బయలు దేరింది.



ధర్మజుడి సహృదయత

వాళ్లు ఆలమందలున్న ద్వైతవన ప్రాంతంలో శిబిరాలు వేసుకొన్నారు. దుర్యోధనుడు ఆవులమందలను పర్యవేక్షించి, దూడలను లెక్కించాడు. ఈ పని అయ్యాక, తన పరివారాన్ని వినోదక్రీడా భవనాలను నిర్మించమన్నాడు.

కాని అరణ్య సరిహద్దుల్లో సైనికులకు అడ్డుగా గంధర్వులు బారులుతీరి వున్నారు. సైనికులు యీ విషయం దుర్యోధనుడికి విన్నవించారు. ఆ గంధర్వులను ఎదుర్కోమన్నాడు దుర్యోధనుడు. గంధర్వులు తమ రాజైన చిత్రసేనుడి ఉత్తరువు మేరకు దుర్యోధనుడి సైన్యం మీద తిరగబడ్డారు. వారి దెబ్బకు దుర్యోధనుడి సైనికులు చెల్లాచెదరయ్యారు. కర్ణ డొక్కడే గంధర్వుల ధాటికి ఎదురొడ్డి నిలిచి పోరాడాడు. వాళ్లు కర్ణుణ్ణి కత్తులతో, గండ్రగొడ్డళ్లతో, శూలాలతో తాకారు. వాళ్లు కర్ణుడి రథం యొక్క కాడి, పతాకధ్వజాన్ని విరుగగొట్టారు. కర్ణుడు ప్రాణరక్షణార్థం పలాయనం చేశాడు. దుర్యోధనుడు కొంతసేపు యుద్ధం చేశాడు కాని అతడి రథంకూడా విరిగిపోయింది. నేలమీద నిలబడే యుద్ధం చెయ్యసాగాడు. అప్పుడు చిత్రసేనుడు అతడి మీదకు దుమికి, అతణ్ణి ఒడిసి పట్టుకున్నాడు. తన పరివారంతో దుర్యోధనుడు బంధితుడయ్యాడు. కొంత మంది సైనికులు ధర్మజుడి ఆశ్రమానికి పరుగెత్తుకుని వెళ్లి ధర్మజుడితో ''గంధర్వులు దుర్యోధనుణ్ణి బంధించారు; స్త్రీ జనాన్నికూడా వదలిపెట్టలేదు. మీరు ఎలాగైనా వారిని కాపాడండి'' అన్నారు. ఆ మాటలు విన్న భీముడు ''మంచిది. ఈ వార్త నాకు ఆనందాన్ని కలుగచేస్తూంది. మమ్మల్ని పరిహాసం చేసేందుకు దుర్యోధనుడు పన్నిన దుష్టపథకానికి యిది ఫలితం. మాకు సహాయార్థం వచ్చేందుకు యీ ప్రపంచంలో ఒక్కడైనా వున్నాడని తెలుసుకోవడం జరిగింది. దురాత్ముడైన దుర్యోధనుడు తగిన ఫలితాన్నే అనుభవించాడు'' అన్నాడు.

కాని ధర్మజుడు, భీముణ్ణి వారిస్తూ ''వైషమ్యం చూపాల్సిన సమయం కాదిది. వాళ్లు మన సహాయం కోరారు. వాళ్లు మన శత్రువులే అయివుండవచ్చు. కాని మూడో వ్యక్తి [illegible] మనం ఐకమత్యంతో వుండాలి. గంధర్వరాజుకు మనం ఇక్కడ నివసిస్తున్న విషయం తెలిసే వుంటుంది. మనల్ని అతడు అవమానించాడు. ఆయుధాలు ధరించి, ఏమాత్రం ఆలశ్యంలేకుండా వెళ్లి దుర్యోధనుణ్ణి కాపాడి, మన కుల గౌరవాన్ని నిలబెట్టు'' అన్నాడు.

అర్జునుడు వెంటనే అంగీకరించి, భీముడు మొదలైన వారితో యుద్ధం జరిగే చోటుకు వెళ్లాడు. ''దుర్యోధనుణ్ణి వెంటనే విడిచిపెట్టండి'' అంటూ అర్జునుడు కేకపెట్టాడు. ఆ మాటలకు గంధర్వులు నవ్వుతూ ''మా రాజు చిత్రసేనుడి నుండే తప్ప ఇతరుల ఆజ్ఞలను మేము పాటించం'' అన్నారు. వెంటనే అర్జునుడు కొన్ని వందలమంది గంధర్వులను హతమార్చాడు. నలుగురు అన్నదమ్ముల రథాలను గంధర్వులు నుగ్గు నుగ్గు చేశారు. పైకెగిరిపోతున్న గంధర్వుల మీదికి పాండవులు బాణవర్షం కురిపించారు. చిత్రసేనుడు తమ మీదకు ప్రయోగించిన ఆయుధాలను అర్జునుడు తన బాణప్రయోగంతో నివారించాడు. అటు తరువాత చిత్రసేనుడు మాయా యుద్ధానికి దిగాడు. అతడు ఆకాశంలోకి అదృశ్యుడై, కనిపించకుండా బాణాలు ప్రయోగించసాగాడు. ఈ చర్యకు అర్జును డేమాత్రం జంకలేదు. అతడు దివ్యాస్త్రాలు ప్రయోగించాడు. చివరికి చిత్రసేనుడు క్రిందికి దిగివచ్చి ''ఆపు అర్జునా! నీతో నీ మిత్రుడే యుద్ధం చేస్తున్నాడు'' అన్నాడు.

వెంటనే అర్జునుడు దివ్యాస్త్రాలను ఉపసంహరించుకున్నాడు. చిత్రసేనుడు, అర్జునుడు, మిగిలినవారు తమ తమ రథాలలో ఆశీనులై క్షేమసమాచారాలు విచారించుకున్నారు. ''కౌరవులను శిక్షించటంలో నీకేం లాభం? దుర్యోధనుణ్ణి ఎందుకు బంధించావు?'' అని చిత్రసేనుణ్ణి, అర్జును డడిగాడు.

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-0. In Public Domain. Digitized by eGangotri

దానికి చిత్రసేనుడన్నాడు ''ఓ అర్జునా! ఇక్కడికి రావటంలో దురాత్ములైన దుర్యోధనుడి, కర్ణుల ఆంతర్యం నాకు తెలుసు. మిమ్మల్ని, ద్రౌపదిని పరిహసించడానికే వాళ్లు ఇక్కడికి వచ్చారు. ఇంద్రుడు మీకు సహాయం చెయ్యమని నన్ను ఆజ్ఞాపించాడు. అందువల్లే నేనిక్కడికి వచ్చాను. ఈ దురాత్ముల్ని గొలుసులతో బంధించి ఇంద్రుడి వద్దకు తీసుకెళతాను.''

''నువ్వు నాకేదన్నా సహాయం చెయ్యాలనుకుంటే, వెంటనే దుర్యోధనుణ్ణి బంధవిముక్తుణ్ణి చెయ్యి. ఇది నా అన్న



Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

గారి ఉత్తరువు'' అన్నాడు అర్జునుడు. వాళ్లందరూ ధర్మజుడి వద్ద కెళ్లారు. ధర్మజుడు దుర్యోధనాదులను విడిచిపెట్టమని చిత్రసేనుణ్ణి కోరాడు. అతడు దుర్యోధనుణ్ణి మెత్తగా మందలిస్తూ ''మళ్లీ ఎప్పుడూ యిలాంటి పని చెయ్యకు. ఆనందంగా వుంటూ నీ రాజధానికి తిరిగి వెళ్లిపో'' అన్నాడు. అవమానభారంతో, జీవితం మీద విరక్తితో దుర్యోధనుడు తన రాజధానికి బయలుదేరాడు. ధర్మజుడి యీ ఉదాత్తచర్యను బ్రాహ్మణులు ప్రశంసిస్తుండగా, అతడు సంతోషంగా ద్వైత వనంలో కాలం గడపసాగాడు.

ఊరడిల్లని దుర్యోధనుడు

పచ్చిక, నీరు ఎక్కువగా లభించే చోట దుర్యోధనుడు మజిలీ చేశాడు. ఆనాటి రాత్రి కర్ణుడు ప్రవేశించి దుర్యోధనుడితో యిలా అన్నాడు: ''ఓ దుర్యోధనా! నువ్వు బ్రతికి వుండటం మా అదృష్టం; మనిద్దరం తిరిగి కలుసుకోవడమూ అదృష్టమే. నువ్వు గంధర్వులను జయించటం మంచికే జరిగింది. ఆ గంధర్వుల ధాటికి నిలబడలేక నేనా యుద్ధరంగం నుండి పలాయనమైనాను. నువ్వు నేడొనర్చినది ప్రపంచంలో మరొకరెవరూ చెయ్యలేరు.'' ఆ మాటలువిని దుర్యోధనుడు ఇలా పలికాడు: ''నీ కసలు జరిగిన దేమిటో తెలియదు కాబట్టి, నీ మీద నాకు కోపం లేదు. మేం గంధర్వుల బందీలమైనాము. పాండవులు వచ్చి మమ్ములను బంధవిముక్తులను చేశారు. ఆ పరాభవం భరించటంకంటే ఆ యుద్ధరంగంలో మరణించివుంటేనే మేలు. నన్నొంటరిగా వదిలిపెట్టు. సౌశీల్యం, సంపద, స్నేహం, రాజరికం మొదలైనవాటితో నాకేం పనిలేదు. ఇక్కడ ఆమరణ నిరాహారదీక్షకు కూర్చుంటున్నాను.''

కర్ణుడు అతణ్ణి ఓదార్చడానికి శతధా ప్రయత్నించాడు. కాని దుర్యోధనుడు ఓదార్చబడని వాడయ్యాడు. అతడు తనకు సంభవించిన పరాభవం గురించి విచారిస్తూ దుశ్శాసనుడితో, ''ఓ దుశ్శాసనా, నిన్నిప్పుడే రాజుగా అభిషిక్తుణ్ణి చేస్తాను. కర్ణుడు, శకుని రక్షణలో యీ భూమండలాన్ని పరిపాలించు'' అన్నాడు. ఈ మాటలు పలికి దుర్యోధనుడు స్నానమాచరించి, దర్భలమీద ఆసీనుడై, బైట ప్రపంచంతో అన్ని సంబంధాలు వదలుకుని, తపస్సుకు పూనుకున్నాడు.

దుశ్శాసనుడు ఏడుస్తూ అన్నగారి కాళ్లుపట్టుకున్నాడు. శకుని యిద్దరి మధ్యకు వచ్చి ''కర్ణుని మాటలు వినండి. ఎంతో కష్టం మీద నేను సంపాదించి పెట్టిన ఐశ్వర్యాన్ని యిలా ఎందుకు కాలరాచుకుంటారు? నిరాహారదీక్ష వల్ల ప్రయోజనం లేదు; ఇప్పటివరకు మీరు చేసిన దానికి యథార్థంగా పశ్చాత్తప్తులైతే పాండవులతో చెలిమి చేసుకొని వారి రాజ్యాన్ని వారికిచ్చివేయండి'' అన్నాడు.

అదే సమయంలో దేవతలచేత ఓడింపబడ్డ దైత్యులు, దానవులు దుర్యోధనుడు తన నిశ్చయాన్ని మార్చుకోకపోతే తాము నాశనం గావింపబడతామని భయంతో పాతాళంలో ఒక బలిపూజా కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. వారి బలిపూజకు సంతసించిన ఒక విచిత్రదేవత ప్రత్యక్షమై వారితో ''మీ కేంకావాలో కోరుకోండి?'' అని అడిగింది.

''దుర్యోధనుణ్ణి యిక్కడికి తీసుకురావాలి'' అని వాళ్లు కోరారు. క్షణంలో ఆమె దుర్యోధనుణ్ణి వారివద్దకు తీసుకువచ్చింది. వారు అతడితో యిలా అన్నారు: ''దేవతలకు పాండ

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri



పులే ఆధారమైనట్లు నువ్వే మాకు ఏకైక ఆశాజ్యోతివి. జయం నిన్ను వరించుగాక. మేమంతా నీ పక్షం వహిస్తాము. పాండవుల జంకు లేకుండా భూమండలాన్ని పరిపాలించు.'' ఆ దేవత దుర్యోధనుణ్ణి తిరిగి యథాస్థానానికి చేర్చింది. దుర్యోధనుడు కళ్లు తెరిచాక, జరిగినదంతా కలగా భావించాడు. ''పాండవులను యుద్ధంలో సంహరిస్తాను'' అంటూ ప్రతిజ్ఞ పూనాడు.

కౌరవులు రాజధానికి తిరిగి రాగానే, భీష్ముడు పాండవులను వారు చూపిన వీరోచితచర్యకు ప్రశంసించాడు; కౌరవులను వారి కుతంత్రానికి గర్హించాడు. పాండవులతో సఖ్యంగా వుండమని కౌరవులకు సలహా యిచ్చాడు. కోపంతో దుర్యోధనుడు అక్కణ్ణుండి వెళ్లిపోయాడు.

దుర్యోధనుడు యాగాన్ని నిర్వర్తించుట

దుర్యోధనుడు, కర్ణుడు కలుసుకొని భావి కార్యక్రమాన్ని గురించి సుదీర్ఘంగా చర్చించుకున్నారు. దుర్యోధను డన్నాడు ''ధర్మజుడు నిర్వర్తించిన రాజసూయ యాగం చూసినప్పటి నుండీ, ఆ యాగాన్ని జరిపించాలనే కోరిక నాలో బలంగా నాటుకుంది.''

ఆ మాటలకు కర్ణుడు నవ్వి ''నువ్వెందుకు జరిపించకూడదు? భూమండలంలోని రాజు లందరూ నీ ఏలుబడిలోకి వచ్చేశారు గదా. బ్రాహ్మణులను రప్పించి, యాగకార్యక్రమాన్ని ప్రారంభించటమే ఆలశ్యం'' అన్నాడు.

బ్రాహ్మణులు రప్పింపబడ్డారు. కాని వాళ్లన్నారు ''ధర్మరాజు, ధృతరాష్ట్రుడు బ్రతికి వున్నంతవరకు రాజసూయయాగాన్ని నువ్వు జరుపకూడదు. దానికి బదులు వైష్ణవయాగాన్ని జరిపించవచ్చు. ఇది రాజసూయానికి దీటైనది.''

దుర్యోధనుడు వారి సలహాకు ఒప్పుకుని ఆ యాగానికి ఆయత్తమయ్యాడు. బంగారు నాగలి రూపొందించబడింది. భూమండలం లోని రాజు లందరిని ఆహ్వానించడానికి వార్తావహాలు పంపబడ్డారు. దుశ్శాసనుడు ఒక వార్తావహుణ్ణి ద్వైతవనానికి పంపుతూ ''నువ్వు తక్షణమే ద్వైతవనానికి వెళ్లి అక్కడ బ్రాహ్మణుల నందరిని, వారితోబాటు ఆ క్రూర పాండవులను ఆహ్వానించిరా'' అన్నాడు.

ధర్మజుడు వచ్చిన వార్తావహుడితో ఇలా అన్నాడు: ''దుర్యోధనుడు ఒక గొప్పయాగాన్ని జరిపించటం నాకు ఆనందాన్ని కలిగిస్తున్నది. కాని మేం పదమూడు సంవత్సరాలు పూర్తి కాకుండా నగరంలోకి ప్రవేశించరాదు.''

కాని భీముడు ''వెళ్లి దుర్యోధనుడితో క్షేమం పదమూడు సంవత్సరాల అనంతరం నగరంలో ప్రవేశించి ఒక గొప్ప యజ్ఞం చేస్తాం. ఆ యజ్ఞంలో దుర్యోధనుడు, వాడి సలహాదారులే బలి పశువులు అని చెప్పు'' అన్నాడు.

వార్తావహుడు తిరిగి వెళ్లి జరిగింది తుచ తప్పకుండా దుర్యోధనుడికి నివేదించాడు.

దుర్యోధనుడు ఆ యాగాన్ని ఎంతో వైభవంగా జరిపించాడు. యాగాన్ని చూడవచ్చిన రాజులలో అనేకులు కౌరవుల మిత్రులు, కాకుంటే కర్ణుడిచే జైత్రయాత్రలో ఓడింపబడిన వాళ్లు. అక్కడ మహానందం నెలకొన్నది. ప్రతి ఒక్కరికి విలువైన బహుమతులు ఇవ్వబడ్డాయి. యాగకార్యక్రమం పూర్తయ్యాక దుర్యోధనుడు జరిపించిన యీ యాగం, ధర్మజుడు నిర్వర్తించిన రాజసూయయాగ వైభవంలో పదహారవ వంతు కూడా లేదనుకున్నారు, పౌరులు. కాని వందిమాగధులు మాత్రం దుర్యోధనుణ్ణి ప్రశంసిస్తూ యయాతి, భరతుడు మొదలైన

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

చక్రవర్తులు ఒనరించిన యాగంతో యీ యాగాన్ని సరిపోల్చారు.

అంతా అయ్యాక దుర్యోధనుడు, కర్ణుణ్ణి ఆలింగనం చేసుకొని, ''కర్ణా! నీ వల్లే యీ యాగం విజయవంతంగా పూర్తి చెయ్యగలిగాను. నీ సహాయ సహకారాలతోనే భవిష్యత్తులో నేను పాండవులను హతమార్చి యీ భూమండలాన్ని నిశ్చింతగా పరిపాలించాలి'' అన్నాడు.

ఆ మాటలకు పొంగిపోతూ కర్ణుడిలా అన్నాడు: ''రారాజా! నేను అర్జునుణ్ణి చంపేంత వరకు నా కాళ్లను కడుక్కోను, మాంసం మదిరలను ముట్టను, యాచకులకు అడిగనది ఏదైనా సరే ఇచ్చివేస్తాను.'' ఈ శపథం విన్న కౌరవులు, అప్పటికే పాండవులు చచ్చిపోయారన్న భావంతో ఆనందంగా కేకలు పెట్టారు.

ఈ వార్త పాండవులకు అందినది. కర్ణుడి బలపరాక్రమాల వల్ల గొప్ప అభిప్రాయం గల ధర్మజుడు యీ వార్త విని అన్యమనస్కుడయ్యాడు.

ఒకనాటి రాత్రి ధర్మజుడు ఒక కలగన్నాడు. ఆ కలలో అడవిలోని ఒక జింక అతడి వద్దకు వచ్చి తన సంతతిని పూర్తిగా నాశనం గావించవద్దని వేరే అరణ్యానికి తరలివెళ్లమని దయనీయంగా వేడుకుంది. ఈ కలతో చలించిపోయిన ధర్మజుడు తన తమ్ములతో కామ్యక వనానికి బయలుదేరాడు.

పాండవులు అరణ్యంలో సంతోషంగా వున్నారనే వార్త దుర్యోధనుడికి తెలిసింది. అతడి హృదయం అసూయతో భగ్గుమన్నది. కర్ణుడు, దుశ్శాసనులతో మళ్లీ పాండవులకు కీడుకలిగించే పథకం వెయ్యసాగాడు.

కృష్ణుడు తన భక్తులను కాపాడుట

ఒకనాడు దూర్వాసమహాముని తన పదివేల మంది శిష్యగణంతో దుర్యోధనుణ్ణి చూడడానికి వచ్చాడు. అతివినమ్రంగా దుర్యోధనుడు దూర్వాసుణ్ణి ఆహ్వానించాడు. దూర్వాసుడు శపిస్తాడనే భయంతో రేయింబవళ్లు తనే స్వయంగా ఆయనకు సేవలు చేశాడు. కొన్ని సమయాలలో దుర్వాసుడు హఠాత్తుగా ''నాకు ఆకలిగావుంది, వెంటనే ఆహారం వడ్డించు'' అనేవాడు. ఆటుతరువాత స్నానమాచరించడానికి వెళ్లి ఎంతో ఆలశ్యంగా తిరిగివచ్చి ''ఈ రోజు నేను ఏమీ తినను'' అనేవాడు. అలా అన్నాక, ఆయన అంతర్ధానమయ్యేవాడు. ఒకొక్కప్పుడు అర్ధరాత్రి నిద్రలేచి ఆహారం సిద్ధంచెయ్యమని ఆజ్ఞయిచ్చి, ఏమీ తినకుండా వుండేవాడు. ఇలా దూర్వాసుడు అడ్డదిడ్డంగా ప్రవర్తిస్తున్నప్పటికీ దుర్యోధనుడు యిసుమంతైనా చికాకు కనబరచలేదు. అప్పుడు దూర్వాసుడు, దుర్యోధనుణ్ణి ప్రశంసిస్తూ ''ఏదన్నా వరం కోరుకో'' అన్నాడు.

దుర్యోధనుడు తను అడగదలచుకున్న వరాన్ని ఇదివరకే ఆలోచించి పెట్టుకున్నాడు. అతడు ఎంతో వినయంతో యిలా అన్నాడు: ''ధర్మజుడు నా అన్నగారు. తన తమ్ములతో ఆయన ప్రస్తుతం అరణ్యంలో వున్నాడు. నా అతిథి సత్కారాలు పొందినట్లే, మీ శిష్యులతోకూడా మీరు ఆయన ఆతిథ్యం స్వీకరించడమే నా కోరిక.'' అంతేగాక ధర్మజుడి పరివారమంతా భోజనాలు ఎప్పుడు పూర్తిగావిస్తారో తనకు తెలుసుకాబట్టి, ఆ వేళకు మునిని అక్కడకు వెళ్లమని దుర్యోధనుడు సూచించాడు. అకస్మాత్తుగా వచ్చిన అతిథులకు ఇవ్వడానికి ధర్మజుడివద్ద ఏమీ మిగిలి వుండదని దుర్యోధనుడి దురాలోచన. అరణ్యంలో పాండవులు తమ ఆహారానికే నానా అగచాట్లు పడుతూంటే, దూర్వాసుడికి, ఆయన పెద్దపరివారానికి ఎలాగూ సక్రమంగా



CC-O. In Public Domain. Digitized by eGangotri

ఆతిథ్యం ఇవ్వలేరని దుర్యోధనుడి ఊహ. కోపిష్ఠియైన దూర్వాసుడు వెంటనే పాండవులను శపిస్తాడు. ఈ విధంగా తన చిరకాల వాంఛితమైన పాండవ వినాశం జరుగుతుందని దుర్యోధనుడి వక్ర ఆలోచన.

దుర్యోధనుడు సూచించిన మేరకు దూర్వాసుడు తన శిష్యగణంతో అరణ్యంలోని పాండవుల వద్దకెళ్లాడు ఆ సమయంలో పాండవులు మధ్యాహ్న భోజనాలు పూర్తిచేసుకొని, విశ్రాంతి తీసుకుంటున్నారు. వారు మునిని గౌరవపూర్వకంగా ఆహ్వానించారు. ''మహామునీ! స్నానం, ఆచమన కార్యక్రమాలు పూర్తిచేసుకొని మా వద్దకు తిరిగి రండి'' అన్నాడు వినమ్రంగా ధర్మజుడు. ముని, ఆయన శిష్యులు నదివద్ద స్నాన మాచరిస్తుండగా, ద్రౌపది ఆందోళన పడసాగింది - ముని గణానికి ఇవ్వడానికి ఆహారం ఏమీ లేనందువల్ల. ఆ విచారంలో ఆమె కృష్ణుణ్ణే

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

ప్రార్థించింది. "ఓ కృష్ణా! నువ్వే సర్వజగద్రక్షకుడివి. నిస్సహాయులకు నువ్వే శరణు. నిన్ను శరణుకోరుతున్నాను, నన్ను కాపాడు." అప్పుడు కృష్ణుడు ఆమె ముందు ప్రత్యక్షమై "నాకు చాలా ఆకలిగా వుంది. ముందు ఏదన్నా వుంటే వడ్డించు, తరువాత తీరికగా మాట్లాడుకుందాం" అన్నాడు.

ద్రౌపది కంగారుపడి "నేను భోజనం చేసేంతవరకు సూర్యుడు ప్రసాదించిన అక్షయపాత్ర నిండుగా వుంటుంది. నేను ఇప్పటికే భోజనం చేసేశాను, అక్షయపాత్ర ఖాళీ అయింది". కృష్ణు డన్నాడు "పరిహాసాల కిది సమయం కాదు. ఆ పాత్రను తీసుకురా, చూస్తాను." ద్రౌపది అక్షయపాత్రను కృష్ణుని కిచ్చింది. ఒక చిన్న అన్నపు మెతుకు అక్షయపాత్ర ఒక మూలలో అతుక్కుని కనబడింది. దాన్ని తీసుకుని నోట్లో వేసుకుని "ఈ విశ్వానికి ఆత్మయైన శ్రీహరి దయతో దీనితో తృప్తిపడుగాక! యజ్ఞ హవిస్సులను గైకొనే దేవుడు దీనితో సంతృప్తిపడుగాక!" అన్నాడు. పిమ్మట సహదేవుణ్ణి, మునిగణాన్ని భోజనాలకు ఆహ్వానించమన్నాడు కృష్ణుడు.

సహదేవుడు వెంటనే నదివద్ద కెళ్లాడు. అక్కడే మునిగణాలు తమ పొట్టలను నెమ్మదిగా తడుముకుంటూ, తమ కడుపులు ఆశ్చర్యంగా నిండిపోయాయని ఒకరితో ఒకరు చెప్పుకోవటం విన్నాడు. వాళ్లు నదిలోనుంచి బైటికి వచ్చి దూర్వాసుడితో "మనం భోజనం సిద్ధంచెయ్యమన్నాం: కాని ఇప్పుడు మా కడుపులు నిండిపోయాయి. ఇప్పుడేం చెయ్యాలి?" అని అడిగారు. "మనం ధర్మజుడికి గొప్ప అపకారం తలపెట్టాము. అతడు ధర్మశీలుడు. ఆతడి కోపం మనలను దగ్ధం చెయ్యగలదు. కాబట్టి యిక్కడ నుండి తక్షణమే వెళ్లిపోదాం" అన్నాడు దూర్వాసుడు. అలా అంటూ గబగబా అక్కణ్ణుండి కదలిపోయారు. సహదేవుడు జరిగింది కృష్ణుడికి, ధర్మజుడికి, ద్రౌపదికి, మిగిలినవారికి వివరించాడు.

ఆ మునిగణం అర్ధరాత్రి తిరిగి వచ్చి ఆహారం సిద్ధం చెయ్యమంటారేమోనని ధర్మజుడు ఆందోళనపడసాగాడు. అది చూసి కృష్ణుడు "ధర్మజా! ద్రౌపది ప్రార్థనలు నన్నిక్కడకు తీసుకువచ్చాయి. ఈ క్లిష్టపరిస్థితిలో మీకు సహాయం చెయ్యడానికే నేనిక్కడకు పరిగెత్తుకొచ్చాను. ఈపాటికే దూర్వాసుడు, అతడి శిష్యులు పలాయనం చేసివుంటారు. వాళ్లు తిరిగి ఎన్నడూ ఇక్కడకు రారు. ధర్మనిరతికి ఎన్నడూ అపజయం వుండదు," అన్నాడు. ఇలా మాట్లాడి కృష్ణుడు పాండవుల వద్ద సెలవుతీసుకొని తన నిజస్థానానికి వెళ్లిపోయాడు.

జయద్రథుడు శిక్షింపబడుట

ప్రతి ఋతువులోను నూతన అనుభవాలతో రోజులు దొర్లిపోతున్నాయి. ఐదుగురు సోదరులు కలిసి ఒకనాడు వేటకు వెళ్లారు. సింధురాజైన జయద్రథుడు ఆ సమయంలో పాండవుల ఆశ్రమం ప్రక్కగా వెళ్లటం జరిగింది. ఆశ్రమం ద్వారం వద్ద ద్రౌపది నిలబడివుండటం అతడు చూశాడు. ద్రౌపది అపరూప సౌందర్యానికి దిగ్భ్రమ చెందాడు. తన మిత్రుడు కోటికునితో "వెళ్లి ఆమె ఎవరో ఎక్కణ్ణుంచి వచ్చిందో, ఎందుకు ఇక్కడ వున్నదో కనుక్కో? నన్ను తన నాథుడిగా అంగీకరిస్తుందా?" అన్నాడు. అతడి మిత్రుడు ద్రౌపది వద్దకు వెళ్లి వచ్చి జయద్రథుడితో "మిత్రమా, విచారిస్తున్నాను. శక్తివంతులైన పాండవుల పత్ని ఆమె. ఆమె గురించిన ఆశలన్నీ వదలుకుని వెళ్లిపోవడం మంచిది" అన్నాడు.

జయద్రథుడికి మిత్రుడి మాటలు రుచించలేదు. ఆరుగురి అనుచరులతో ఆశ్రమంలో ప్రవేశించాడు. కుశల ప్రశ్నలయ్యాక తన మనసులోని మాటను బైటపెట్టాడు. ఆమెపట్ల తన కెంతో ప్రేమ ఉన్నట్లు, పనికిమాలిన భర్తలను వదలిపెట్టి తనతో వచ్చేయమని ద్రౌపదితో చెప్పాడు. అప్పుడు ద్రౌపది "తను ప్రసవిస్తూ నశించే ఎండ్రకాయవంటి వాడివి నువ్వు. నా భర్తలు నిన్ను హతమారుస్తారు" అంది. జయద్రథుడన్నాడు, "పాండవులంటే నాకేం భయం లేదు. మాటలు నిన్ను రక్షించవు ద్రౌపదీ! రా నాతో. బలవంతంగా నిన్ను ఎత్తుకు వెళ్లే పరిస్థితి తెచ్చుకోకు." తనను పట్టుకోవడానికి ముందుకు రాబోతుండగా ద్రౌపది, ధౌమ్యుడికోసం కేకలుపెట్టింది. కాని జయద్రథుడు ఆమెను పట్టుకుని బలవంతంగా తన రథంమీద ఎక్కించుకున్నాడు. అప్పటికి ధౌమ్యుడు అక్కడికి వచ్చి "ఆమె భర్తలతో పోరాడకుండా ఆమెను తీసుకువెళ్లడానికి నీకు హక్కులేదు. నీ యీ నీచకార్యానికి తగిన ఫలం అనుభవిస్తావు" అన్నాడు. కాని జయద్రథుడు ధౌమ్యుని హితవాక్యాలు పట్టించుకోలేదు. ద్రౌపదిని అపహరించుకుపోసాగాడు.

ఆశ్రమానికి తిరిగి వచ్చిన పాండవులు ద్రౌపది చెలికత్తె ద్వారా జరిగింది తెలుసుకున్నారు. ఐదుగురూ జయద్రథుణ్ణి వెన్నంటడానికి బయలు దేరారు. దారిలో జయద్రథుణ్ణి నిస్సహాయంగా వెంబడిస్తున్న ధౌమ్యుణ్ణి చూశారు. మితిమీరిన కోపంతో పాండవులు జయద్రథుడి పరివారాన్ని ఎదుర్కొన్నారు. వారి బాణవర్షంతో ఆకాశం గాఢాంధకారమైంది. చావు

Sri Vidyabharathi Book Centre, Sringeri

భయంతో జయద్రధుడు రథం దిగి పారిపోసాగాడు.

CC-O. In Public Domain. Digitized by eGangotri

అప్పుడు భీముడు, ధర్మజుడితో ''అన్నా! ద్రౌపదిని తీసుకుని నువ్వు ఆశ్రమానికి వెళ్లు. పాతాళంలో దాక్కున్నా జయద్రధుణ్ణి వదలిపెట్టను'' అన్నాడు. ''భీమా! జయద్రధుడు మన బంధువని మరిచిపోవద్దు'' అన్నాడు ధర్మజుడు.

భీముడు, అర్జునుడు, జయద్రధుణ్ణి వెంబడించారు. అతడి గుర్రాలు వీరికి రెండు మైళ్ల దూరంలో వున్నప్పటికీ అర్జునుడు తన బాణాలతో వాటిని నేలకూల్చాడు. ''వెనక్కు-తిరుగు, ఆడవాళ్లను అపహరించేవాడా!'' అంటూ భీమార్జు

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-0. In Public Domain. Digitized by eGangotri

నులు అరిచారు. కాని జయద్రథుడు ఒక్కమారైనా వెనక్కి తిరిగి చూడలేదు. భీముడు తన రథం దిగి, అతడి వెంట పరిగెత్తి, వాడి సిగపట్టుకున్నాడు. జయద్రథుడు స్పృహతప్పి కింద పడిపోయాడు. అర్జునుడు కష్టంమీద కిందపడ్డ అతడి శరీరాన్ని లాక్కురాసాగాడు. కాని భీముడు అతడి తలను తన్నుతూ, అతడి రొమ్ముమీద కూర్చుని తిరిగి స్పృహకోల్పోయేదాకా పిడిగుద్దులు గుద్దసాగాడు. ధర్మజుడి మాటలు జ్ఞప్తి చేస్తూ, జయద్రథుణ్ణి చంపవద్దని భీముణ్ణి వారించాడు అర్జునుడు. ''ఈ దురాత్ముడు జీవించడానికి అనర్హుడు. కాని నేనేం చేస్తాను, మన అన్నగారు దయామయుడు'' అన్నాడు భీముడు. ఒక వాడి బాణం తీసుకుని జయద్రథుడికి శిరోముండనం గావించాడు; కాని ఐదు పిలకలను వుంచాడు. పిమ్మట జయద్రథుడితో యిలా అన్నాడు: ''నువ్వు జీవించాలంటే బహిరంగ సభలలో 'నేను పాండవుల బానిసను' అంటూ చెప్పుకోవాలి.'' జీవితం మీద ఆశతో, దానికి అంగీకరించాడు. భీమార్జునులు, జయద్రథుడి చేతులు కాళ్లు కట్టి, రథంమీద వేసుకొని ఆశ్రమానికి తీసుకువచ్చి, ధర్మజుడి ముందు పడేశారు. ''ద్రౌపదికి చెప్పండి, యీ దురాత్ముడు పాండవ బానిస అయ్యాడని'' అన్నాడు భీముడు, ధర్మజుడితో

ధర్మజుడు, ద్రౌపది జయద్రథుణ్ణి వదలిపెట్టమని భీముడికి నచ్చచెప్పారు. జయద్రథుడు పరాభవంతో, తిన్నగా గంగా నది తీరానికి వెళ్లి అక్కడ శివుణ్ణి గురించి తపస్సు ప్రారంభించాడు. అతడి తపస్సుకు మెచ్చి, శివుడు ప్రత్యక్షమై వరం కోరుకోమన్నాడు. ''పాండవులను యుద్ధంలో హతమార్చే వరం ప్రసాదించు దేవా!'' అని జయద్రథుడు ప్రార్థించాడు. దానికి శివుడన్నాడు ''అసంభవం, భూమిమీది ఏ మానవుడికీ యిది వీలుపడదు. కాని నీకు యీ వరం ఇస్తాను. ఒకే ఒక్కమారు నువ్వు పాండవులను జయించగలవు, అర్జునుణ్ణి తప్ప.''

తరువాత శివుడు అంతర్థానమైనాడు. జయద్రథుడు తన రాజ్యానికి వెళ్లిపోయాడు. పాండవులు కామ్యకవనంలో రోజులు వెళ్లబుచ్చుతున్నారు.

కొన్నిరోజులు గడిచాక మార్కండేయమహర్షి పాండవులను చూడడానికి కామ్యకవనానికి వచ్చాడు. ప్రగాఢ దుఃఖంలో వున్న ధర్మజుణ్ణి అనేక నీతికథలు చెప్పి, ఊరడించాడు మహర్షి. దురదృష్టాన్ని వరించిన రాజు అతడొక్కడేకాడని, శ్రీరాముడు, సావిత్రీకూడా ఎంతో కష్టాలు పడ్డారని; సావిత్రి యమధర్మరాజునే తన మాటలచాతుర్యంతో, పాతివ్రత్యంతో మెప్పించినదని మార్కండేయుడు, ధర్మజుడితో చెప్పాడు. ఆ విధంగా మార్కండేయమహర్షిచే ఊరడింపబడ్డ ధర్మజుడు, కామ్యకవనంలో తమ్ములతో, ద్రౌపదితో కాలం గడపసాగాడు.

కవచ కుండలాల కానుక

పాండవుల పన్నెండు సంవత్సరాల అరణ్యవాసం పూర్తయ్యే సమయంలో, పాండవులకు సహాయపడాలని ఇంద్రుడు, కర్ణుని కవచకుండలాలు సంపాదించాలనుకున్నాడు. కాని ఇంద్రుడి పథకం తెలిసిన సూర్యుడు, కర్ణుడికి కలలో బ్రాహ్మణరూపంలో దర్శనం యిచ్చి ''కుమారా! నేను చెప్పేది సావధానంగా విను. పాండవులకు సహాయపడాలనే నిశ్చయంతో ఇంద్రుడు నీ వద్దకు బ్రాహ్మణరూపంలో వచ్చి నీ కవచకుండలాలు అర్థిస్తాడు. కవచకుండలాలు నీ శరీరం నుండి తీసి ఇవ్వకు. వాటిని కోల్పోతే, ఆయుస్సు తగ్గి, నువ్వు చచ్చిపోతావు'' అన్నాడు. కర్ణుడడిగాడు ''మీ రెవరు? నా యోగక్షేమాల గురించి మీ కెందు కింత అక్కర?'' ఆ ప్రశ్నకు బ్రాహ్మణుడు ''నేను సూర్యుణ్ణి. నీ మంచికోరే యీ సలహా యిస్తున్నాను'' అన్నాడు. అప్పుడు కర్ణుడు యిలా అన్నాడు: ''మీ సలహాకు నేనెంతో కృతజ్ఞుణ్ణి. కాని నేనొక మాట నీతో చెప్పాలి. ప్రతిరోజు నువ్వు ఆకాశం నడినెత్తి మీదికి వచ్చినప్పుడు, నేను నిన్ను అర్చిస్తాను. నిన్ను అర్చించాక, దానం పట్టేవాళ్లకోసం ఎదురు చూస్తాను. వాళ్లు అడిగినదేదైనా తక్షణం యిచ్చేస్తాను. ఈ తంతు సంవత్సరాల తరబడి నువ్వు చూస్తూనే వున్నావు. అడిగినప్పుడు, నా ప్రాణాన్నికూడా యివ్వడానికి నేను వెనుకంజవెయ్యను. కాబట్టి ఇంద్రుడే వచ్చి అర్థిస్తే నా కవచకుండలాలను ఇవ్వడానికి నిరాకరించను.'' ఆ మాటలకు సూర్యుడు ''ఏదీ నీ ప్రతిజ్ఞను భంగ పరచలేదు. కనీసం నీ కవచకుండలాలు దానం యిస్తూన్నప్పుడు, ఇంద్రుడినుండి శక్తి ఆయుధాన్ని ప్రతిఫలంగా అడుగు. ఈ శక్తి ఆయుధం నీ కవచకుండలాలు లేని లోటును కొంతతీరుస్తుంది.'' ఇలా అంటూ సూర్యుడు అంతర్థానమైనాడు.

కర్ణుడు నిద్రనుండి మేల్కొని, మిగిలిన రాత్రంతా కలను గురించే యోచిస్తూ గడిపాడు.

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

మరునాడు యథాప్రకారం కర్ణుడు సూర్యుని అర్చించాడు. అప్పుడు చేతులు జోడిస్తూ ఒక బ్రాహ్మణుడు కర్ణుడి వద్దకొచ్చాడు. అత డెవరైనదీ కర్ణుడికి తెలుసు. సంప్రదాయప్రకారం ఆ బ్రాహ్మణుడికి నమస్కరించి, కూర్చోడానికి ఆసనం చూపించాడు. పిమ్మట "మీరుకోరింది ఏదైనా ఇస్తాను, సంకోచించక అడగండి" అన్నాడు కర్ణుడు. ఆ బ్రాహ్మణుడు "నాకు బంగారం, సంపదలు, ఆవులు ఏవీ వద్దు. నీ కవచకుండలాలే నాకు కావాలి" అన్నాడు దృఢంగా. దానికి కర్ణుడు ఇలా అన్నాడు: "మీ కోరిక చిత్రంగా వుంది. ఈ కవచకుండలాలు నా శరీరంలోని అంగాల వంటివి. వాటిని నా శరీరం నుండి వేరు చెయ్యలేము. కావాలంటే నా రాజ్యాన్ని కూడా యిచ్చేస్తాను; వీటిని అడగవద్దు." ఆ మాటలకు బ్రాహ్మణుడు ఇలా అన్నాడు: "నిన్ను దానకర్ణు డంటారు. దాతలలో నువ్వే శ్రేష్ఠుడంటారు. నీ పేరు ప్రతిష్ఠలు సార్థకం చేసుకోవాలని నీకుంటే కవచకుండలాలు నీ శరీరంనుండి కోసి నా కిచ్చెయ్యి. నువ్వు ఇప్పటి వరకు ఇచ్చిన, ఇకముందు ఇవ్వబోయే అన్ని దానాలకంటే ఇది గొప్పదానంగా పరిగణింపబడుతుంది." నవ్వుతూ కర్ణుడన్నాడు "దేవాధిదేవా, నువ్వు ఎవరో నాకు తెలుసు. ఇంద్రా! దేవతలకే దేవుడవైన నీకు నిరుపయోగంగా ఒక కానుకను ఇవ్వటం సముచితం కాదు. నా కేదన్నా వరం ప్రసాదించటం నీకు ధర్మంగా వుంటుంది. నీకు కవచకుండలాలు దానం చేశాక, నేను చచ్చిపోవటం ఖాయం. నీ కారణం

Sri Vidyaphar... Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

గానే నాకు చావు సంభవించినదనే అపవాదు నీకు రాకూడదు. కాబట్టి నా కవచకుండలాలు స్వీకరించి, నేను అడిగినది ప్రసాదించు. లేకుంటే వాటిని నీకు ఇవ్వలేను.'' ఆ మాటలకు ఇంద్రుడు ''సూర్యుడు నా రాకను నీకు ముందుగా చెప్పాడని తెలుసు. నా వజ్రాయుధం తప్ప ఏదన్నా కోరుకో, ఇస్తాను'' అన్నాడు. ఎవరికి గురిపెడితే వారిని సంహరించే శక్త్యాయుధాన్ని కర్ణుడు కోరాడు. అప్పుడు ఇంద్రుడు ''సరే, దానినే ప్రసాదస్తాను. 'నువ్వు చంపాలనుకున్న ఒకే శత్రువును ఇది సంహరిస్తుంది'' అన్నాడు. ''నేను ఒక శత్రువునే సంహరించాలనుకుంటున్నాను'' అన్నాడు కర్ణుడు. దానికి ఇంద్రు డన్నాడు ''అతడు శ్రీకృష్ణుడి రక్షణలో వున్నాడు. మరో మాట జ్ఞాపకముంచుకో - యీ ఆయుధాన్ని నీకు ప్రాణాపాయం సంభవించే సమయంలోను, అన్ని అస్త్రాలు నిష్ప్రయోజనమైనప్పుడు మాత్రమే ప్రయోగించాలి. లేకపోతే అదే తిరిగివచ్చి నిన్ను సంహరిస్తుంది.''

కవచకుండలాలు శరీరంనుండి ఖండించి ఇచ్చాక కర్ణుడి శరీరంలో గాయమైన మచ్చలు పడకుండా ఇంద్రుడు వరం ఇచ్చాడు.

పిమ్మట కర్ణుడు తన శరీరంలోని భాగాలైన కవచకుండలాలను కోసి, ఇంద్రుడి కిచ్చాడు. దేవతలు ఆకాశం నుండి పువ్వుల వర్షం కర్ణుడిమీద కురిపించారు. తను వచ్చిన పని విజయవంతంగా ముగించుకుని ఇంద్రుడు, తన లోకానికి వెళ్లిపోయాడు.

నకులుడు తదితరులు మరణించుట

ఒకనాడు లేడి ఒకటి తన శరీరాన్ని ఒక బ్రాహ్మణుడి అగ్ని రగిలించే అరణితో రుద్దుకోగా, ఆ అరణి, రెండు మండే కట్టెలు దాని కొమ్ములలో ఇరుక్కున్నాయి. భయపడ్డ ఆ లేడి అడవిలోకి పారిపోయింది. ఆ బ్రాహ్మణుడు పాండవులవద్దకు పరుగెత్తుకొచ్చి, ఆ అరణిని సంపాదించి పెట్టమని కోరాడు. పాండవులు లేడివెంట పడ్డారు. ఆ లేడి అమితవేగంగా పాండవులకు కనబడకుండా అడవిలోఅదృశ్యమైంది. పాండవులు ఒక మర్రిచెట్టు నీడన బడలికతో, నిరుత్సాహంతో కూర్చున్నారు. అప్పుడు నకులుడు ధర్మరాజుతో ''విచిత్రంగా వుంది. ఆ లేడి ఎలా మాయమైంది? మనం ఎన్నడూ ధర్మపథం తప్పలేదు. అటువంటప్పుడు యిలా ఎందుకు జరిగింది?'' అన్నాడు.

ధర్మజుడు అన్నాడు ''దురదృష్టాలకు హేతువులు వెదకటం దుస్సహం. పాపపుణ్యాల ఫలితాన్ని ఆధర్మదేవతే పంచుతాడు.''

భీముడన్నాడు ''కారణం నాకు తెలుసు. ద్రౌపదిని సభలోకి యీడ్చుకుని వచ్చినప్పుడే దుశ్శాసనుణ్ణి నేను వధించి వుంటే యీ కష్టాలు మనకు కలిగేవికావు.''

అప్పుడు సహదేవుడిలా అన్నాడు: '' మాయాజూదంలో శకుని నిన్ను ఓడించినప్పుడే అతణ్ణి నేను వధించి వుంటే ఇలా జరిగివుండేదికాదు.'' ''నకులా! యీ చెట్టు పైకెక్కి చుట్టుప్రక్కల ఎక్కడన్నా నీటి తటాకం కనబడుతోందేమో చూడు'' అన్నాడు ధర్మజుడు. నకులుడు అలాగే చెట్టుపైకెక్కి చూసి ''కాస్త దూరంలో నీటిమొక్కలు, కొంగలు కనబడుతున్నాయి. బహుశ అక్కడ నీరు తప్పక వుంటుంది'' అన్నాడు.

ధర్మజుడు నీరు పట్టుకురావడానికి నకులుణ్ణి పంపాడు. నకులుడు తటాకం వద్ద కొచ్చాడు. తటాకంలోని నీరు తాగబో

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-0 Public Domain. Digitized by eGangotri

తుండగా ఒక కంఠం ''ఆగు! ఈ తటాకం నాది. నువ్వు దాహం తీర్చుకోవాలంటే, ముందు నా ప్రశ్నలకు జవాబు లివ్వు'' అని పలికింది. బాగా డస్సివున్న నకులుడు ఆ మాటలు పట్టించుకోకుండా తటాకంలోని నీటిని తాగాడు. వెంటనే చచ్చి, క్రింద పడిపోయాడు.

ఎంతసేపటికీ నకులుడు తిరిగి రాకపోయేసరికి, ధర్మజుడు, నకులుణ్ణి కనిపెట్టడానికి, నీరు తీసుకురావడానికి సహదేవుణ్ణి పంపాడు. తటాకం వద్దకొచ్చిన సహదేవుడు, చచ్చిపడివున్న నకులుణ్ణి చూసి, తనూ దాహం తీర్చుకోబోయాడు. మళ్ళీ అదే కంఠం వినవచ్చింది. కాని విపరీతమైన దాహంతోవున్న సహదేవుడు, ఆ హెచ్చరికను నిర్లక్ష్యం చేస్తూ నీళ్లు తాగి, తనూ మరణించాడు.

ధర్మజుడు తరువాత అర్జునుణ్ణి పంపాడు. అర్జునుడు విల్లంబులతో ఆ తటాకం వైపు బయలుదేరాడు. అక్కడ తన తమ్ములు చచ్చిపడివుండటం చూసి దిగ్భ్రమ చెంది, చుట్టూ పరికించాడు. కాని చుట్టుప్రక్కల ఏ జంతువు కనబడలేదు. పిమ్మట దాహం తీర్చుకోడానికి నీటివద్ద కెళ్లాడు. ''నా ప్రశ్నలకు బదు లివ్వకుండా నువ్వు యీ నీళ్లు త్రాగగలవా?'' అదే కంఠం ఖంగుమన్నది. ''నీ ప్రాణాల మీద ఆశ లేకపోతే అలా చెయ్యి, నీ తమ్ముల గతి చూడు.''

ఆ మాటలువిని, అర్జునుడు ఇలా అరిచాడు; ''నా ముందు నిలబడి, నేను నీళ్లు తాగకుండా ఆపు. నా బాణాల రుచి చూస్తే నువ్వు యిలా మాట్లాడవు.'' ఆ కంఠం విన వచ్చిన దిక్కుకేసి వేలబాణాలు ప్రయోగించాడు అర్జునుడు. కాని నిష్ప్రయోజనమే అయింది. ''పార్థా, అలిసిపోబోకు'' అన్నదా కంఠం, ''ముందు నా ప్రశ్నలకు జవాబు లివ్వు, తరువాత నీళ్లు తాగు.'' ఆ మాటలు నిర్లక్ష్యం చేస్తూ అర్జునుడు నీళ్లు తాగి, మరణించాడు.

తరువాత ధర్మజుడు, భీముడితో యిలా అన్నాడు: ''భీమా! నీ తమ్ములందరూ వెళ్లారు, తిరిగి రాలేదు. నువ్వు వెళ్లి, వాళ్ల జాడ తెలుసుకుని, నీళ్లతోబాటు వాళ్లనుకూడా వెంటబెట్టుకునిరా.'' భీముడు తటాకం వద్దకు వచ్చి తన సోదరులు మరణించి వుండటం చూసి నిర్ఘాంతపోయాడు. తనలో యిలా తలపోశాడు: ''ఈ దురంతం ఏ రాక్షసుల పనో అయి వుంటుంది. ముందు కాస్త దాహం తీర్చుకుని, వాళ్ల పని పడతాను.' ఈ ఆలోచనలతో, నీటిమడుగుకేసి అడుగులు వేశాడు. మళ్లీ ఆ కంఠం వినవచ్చింది. భీముడు ఆ మాటలు పట్టించుకోకుండా నీళ్లుతాగి, తనూ మరణించాడు.

ధర్మజుడు ఎంతో కంగారు పడ్డాడు. తన సోదరులు ఎవరూ ఎందుకు తిరిగిరాలేదో అర్థం కాలేదు. తనే స్వయంగా తటాకం వద్దకెళ్లి, అక్కడి దృశ్యంచూసి నిశ్చేష్టుడయ్యాడు. అతడి సోదరులందరూ వరుసగా చచ్చిపడివున్నారు. అర్జునుణ్ణి చూసి నిట్టూరుస్తూ, దుఃఖించాడు. భీముణ్ణి ఉద్దేశించి ''నాయనా భీమా, దుర్యోధనుడి తొడలు విరక్కొడతానని శపథం చేశావే!'' అంటూ వాపోయాడు. దగ్గరగా పరిశీలించి చూస్తే వాళ్లు నిద్రపోతున్నట్లే వుంది. వాళ్ల శరీరాల్లోని కళాకాంతులు చెక్కుచెదరలేదు. ధర్మజుడు సందిగ్ధంలో పడ్డాడు. కాని నిస్సహాయుడే అయ్యాడు.

యక్ష ప్రశ్నలు

బాధ, దాహాలతో ధర్మజుడు తటాకం వద్దకెళ్లాడు. అప్పుడు ఒక కంఠం విన్నాడు. ''నా మాటలు నిర్లక్ష్యం చేసి, నీ తమ్ములు యీ గతిని పొందారు. చేపలు ఆహారంగా బతికే కొంగను నేను. నా ప్రశ్నలకు జవాబులు చెప్పకుండా నీళ్లు తాగితే, నువ్వూ మరణిస్తావు.'' ఆ మాటలకు ధర్మజుడు ''నువ్వు ఎవరవు? రుద్రుడివా, మరుత్తుడివా, వసువువా? ఒక సాధారణ పక్షి నా తమ్ములను చంపలేదు. కాబట్టి నువ్వు ఎవరవో మళ్లీ అడుగుతున్నాను?'' అని అడిగాడు. ''నేనొక యక్షుణ్ణి'' అంటూ అతడు ధర్మజుడిముందు ప్రత్యక్షమయ్యాడు. ఆ యక్షుడు తాటి ప్రమాణంలో వున్నాడు, పెద్ద కళ్లతో, శరీరంతో సూర్యుడిలా వెలిగిపోతూ, మబ్బులా గర్జిస్తూ కనబడ్డాడు. తరువాత ధర్మజుడు ''నీ ప్రశ్నలకు నా శాయశక్తులా జవాబు లివ్వడానికి ప్రయత్నిస్తాను. యథేచ్ఛగా నీ ప్రశ్నలడుగు'' అన్నాడు. తరువాత యక్షుడి ప్రశ్నలు, ధర్మజుడి జవాబులు యీ క్రింది విధంగా సాగాయి:

ప్రశ్న: ఏది సూర్యుణ్ణి ఉదయింపచేస్తూంది? ఏది సూర్యుణ్ణి అస్తమింపచేస్తోంది? ఎవరు అతడి కూడా వుంటారు? ఎవరు అతణ్ణి కదిలించుచున్నది?

జవాబు: బ్రహ్మము అతణ్ణి ఉదయింపచేస్తున్నది. ధర్మము అతణ్ణి అస్తమింపచేస్తున్నది. దేవతలు అతడికూడా వున్నారు, సత్యమే అతణ్ణి కదిలిస్తూన్నది.

ప్రశ్న: ఏది గొప్ప భాగ్యం?

జవాబు: ఆరోగ్యం

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

ప్రశ్న: గొప్ప ఆనందమేది?
జవాబు: సంతృప్తి.
ప్రశ్న: నిజమైన జ్ఞానమేది?
జవాబు: భగవంతుణ్ణి తెలుసుకోవడమే.
ప్రశ్న: దయ అంటే ఏమిటి?
జవాబు: అందరూ సంతోషంగా వుండాలనుకోవడమే.
ప్రశ్న: అజ్ఞానమంటే ఏమిటి?
జవాబు: తన కర్తవ్యం తెలుసుకోకుండుటే.



Sri Vidyabharathi Book Cent

CC-O. In Public Domain. Digitized by eGangotri

ప్రశ్న: ఎవడు ఉత్తముడు?
జవాబు: అందరికీ మంచినే కోరేవాడు.
ప్రశ్న: సోమరి తనమేది?
జవాబు: తన కర్తవ్యాన్ని నిర్వర్తించకపోవటం
ప్రశ్న: ఒకరిని బ్రాహ్మణుణ్ణిగా చేసేది జన్మ, శీలం, అధ్య
యనం, వివేకం వీటిలో ఏది?
జవాబు: జన్మ, అధ్యయనం, వివేకం యివేవీ కావు. శీలం లేక
నడవడి మాత్రమే ఒకణ్ణి బ్రాహ్మణుడిగా చేస్తుంది.
ప్రశ్న: నిజమైన సంతోషి ఎవడు?
జవాబు: ఋణం లేనివాడు నిజమైన సంతోషి.
ప్రశ్న: ప్రపంచంలో అత్యంత విచిత్రమైన దేది?
జవాబు: కొన్నివేల మంది రోజూ మరణిస్తున్నారు. అదే సమ
యంలో బ్రతికివున్న వాళ్లు తాము శాశ్వతంగా వుండబోతామని
భావించుకుంటారు. ఇది అన్నింటికంటే విచిత్రమైన విషయం.
ప్రశ్న: సంతోషానికి మంచి బాట ఏది?
జవాబు: సత్ప్రవర్తనులు నడిచిన వెళ్లిన బాటే!

అప్పుడు యక్షుడు యిలా అన్నాడు: ''నాయనా! నా ప్రశ్నలన్నిటికీ తృప్తికరంగా జవాబులిచ్చావు. కాబట్టి నీ సోదరు లలో ఒక్కరిని బ్రతికిస్తాను, కోరుకో.'' దానికి ధర్మజుడు ''ఓ యక్షా! నల్లని దేహం గలవాడైన నకులుణ్ణి బ్రతికించు'' అన్నాడు. ఆ మాటలకు యక్షుడు ఆశ్చర్యపోతూ ఇలా అన్నాడు: ''భీముడు నీకు మిక్కిలి ప్రియుడంటారు. అర్జునుడు నీ బలానికి మూలాధారం. అటువంటప్పుడు నీ సవతి తమ్ముడైన నకులుణ్ణి ఎంచుకున్నా వెందుకు?'' ధర్మజు డన్నాడు ''ధర్మాన్ని బలిపెట్టేవాడు నశిస్తాడు. కాబట్టి నేను ధర్మాన్ని బలిచెయ్యను. నా తండ్రిగారికి ఇద్దరు భార్యలు·కుంతి, మాద్రి. నేను వారిద్దరిని సమానంగా చూస్తాను. వారిలో నాకే భేదమూ కనబడదు. నకులుడు బ్రతికితే, మాద్రి కుమారులలో ఒకరు బ్రతికి వుంటారు.'' ఆ మాటలు అంటూ వుండగానే సోదరు లందరూ నిద్రనుండి మేలుకొన్నట్లు లేచారు. వారి బడలిక, దాహం అన్నీ మాయమైనాయి. అప్పుడు ధర్మజుడు ''ఒకే కాలిమీద తటాకంలో నిలబడ్డ నువ్వు ఒక సామాన్య యక్షుడివై వుండవు? నువ్వు ఏ దైవానివి?'' అని అడిగాడు. యక్షుడు నవ్వుతూ ''నాయనా! నేను యమధర్మరాజును, నీ తండ్రిని. నిన్ను చూసి సంతోషిస్తున్నాను. ఏదన్నా వరంకోరుకో'' అన్నాడు. ''ఆ బ్రాహ్మణుడి అగ్నిహోత్రం రగిలించే అరణి ఆ లేడితో సహా మాయమైనది. ఆ అరణిని ప్రసాదించండి చాలు'' అన్నాడు ధర్మజుడు. యక్షుడు నవ్వుతూ ''నిన్ను పరీక్షించా లనే నేను లేడిరూపంలో వచ్చి ఆ బ్రాహ్మణుడి అరణిని, మండేకట్టెలను ఎత్తుకుపోయాను. మరేదన్నా వరం కోరుకో'' అన్నాడు. ఆ మాటలకు ధర్మజుడు ''మేము పన్నెండు సంవత్స రాలు అరణ్యవాసం చేశాం. మా అజ్ఞాతవాసంలో ఎవరూ మమ్మ గుర్తించకుండా వరం ఇవ్వు'' అన్నాడు. అప్పుడు యమధర్మ రాజు ఇలా అన్నాడు: ''ఈ వరంకూడా నీకు ఇస్తున్నాను. మీరు మారువేషంలో లేకుండా తిరిగినప్పటికీ, యీ త్రిలోకాలలో మిమ్మ ఎవరూ గుర్తించలేరు. మీ అజ్ఞాతవాస సంవత్సరకా లాన్ని విరాట నగరంలో అజ్ఞాతంగా గడపండి. మీరు కోరిన రూపాన్ని మీరు ధరించే శక్తి వస్తుంది.'' అలా అంటూనే యమధర్మరాజు అంతర్ధానమైనాడు. పాండవులు ఆనందంగా ఆశ్రమానికి తిరిగి వచ్చారు. బ్రాహ్మణుల వద్ద సెలవుగైకొని, అజ్ఞాత వాసకాలాన్ని ఎలా గడపాలో ధౌమ్యుడితో చర్చిస్తూ ముందుకు బయలుదేరారు.

అరణ్య పర్వం సమాప్తం.



Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

CHILDREN'S BOOKS

The Story of
Sri Ramakrishna for Children
ISBN 81-7120-217-9



Divine Paraphernalia
ISBN 81-7120-284-5

Gods and Goddesses-2
ISBN 81-7120-283-7
ISBN 81-7120-282-9



The Story of
Sri Krishna for Children-1
ISBN 81-7120-140-7
ISBN 81-7120-277-2



Divine Vahanas
ISBN 81-7120-245-4

Gods and Goddesses-1
ISBN 81-7120-136-9
ISBN 81-7120-282-9



A Prayer Book
for Children
ISBN 81-7120-188-1

Value Oriented
Moral Lessons
Volume 1 to 3



The Story of
Sri Krishna for Children-2
ISBN 81-7120-278-0
ISBN 81-7120-277-2

Dasavataras
ISBN 81-7120-123-7



Pictorial Stories for Children
Volume 1 to 7



Mahabharata for Children-1
ISBN 81-7120-315-9
ISBN 81-7120-314-0



The Story of
Sri Sankara for Children
ISBN 81-7120-119-9

Sri Ramakrishna Math
Mylapore, Madras 600 004

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

Sri Vidyabharathi Book Centre, Sringeri

CC-O. In Public Domain. Digitized by eGangotri

Balala Mahabharatam
Vol. 2 (Telugu) Rs. [illegible]5.00

ISBN 81-7120-408-2
ISBN 81-7120-318-3

Sri Vidyabharathi Book Centre, Sringeri